
ఆంధ్రస చిత్రవారపత్రిక



26-10-60

25 నయాపైసలు

ANDHRA SACHITRA VĀRA PATR



మజిలీ

చిత్రకారుడు—టి. కేశవరావు (మద్రాసు)


త్యాగదీక్ష
సహనశక్తి
స్త్రీల సొత్తు అని
నిరూపించే
ఉత్తమ చిత్రం...
నేడే చూడండి!
ఎం.ఆర్.ఎం. ప్రొడక్షన్సు వారి
మావూరి
అమ్మాయి
దర్శకత్వం
A. భీమసింగ్
మాటలు-పాటలు
అనిసెట్టి
స్టూడియో
ఏవి.ఎం
BAKTHA

ఉత్తరాలు

దీపావళి ప్రత్యేక సంచిక

దీపావళిసంచిక (19-10-60) సర్వాంగ సుందరంగా ఒంటినిండా సెంటు పూసుకుని మాయింటికి టికీసందులోంచి ఒక్కదూకులో ప్రవేశించింది. ప్రతీపేజీ కూడా విడువకుండా చదవ బుద్ధివేసింది. మీ పత్రిక పెద్దవాళ్ళని పిన్న వాళ్ళని ఆకర్షించడంకంటే పనివాళ్ళను కూడా ఆకర్షించింది అనడంలోనే గొప్ప.

బెన్‌హర్ కథ ఇంత త్వరగా అయిపోతుందనుకోలేదు. ఇన్ని కష్టాలుపడ్డ బెన్‌హర్ చివరికి భగవంతుని దయవల్ల తల్లిని చెల్లెలిని ప్రియురాలిని సంతోషంతో కలుసుకోగలిగాడు. ఈచిత్రం మావూరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాం.

నిశీవాలీల (అంటే అర్ధరాత్రప్పుడు షూటింగులకుతిరిగేవాళ్ళు) వ్యాసాలన్నీ కూడా చాలా బావున్నాయి.

వెనకటికి ఒకాయన శతపత్ర సుందరీ! అంటే, ఇప్పుడు ఆంధ్రపత్రిక శతపత్ర సంచికా అని పాడాలనిపిస్తోంది. ఇలాగే ప్రతీపండుగకు ప్రత్యేకా కర్షణలతో మాపాఠకలోకానికి అందచేస్తారని ఆసిస్తున్నాం.

ఎం. సావిత్రి (విజయవాడ)

* * *

19-10-1960 వ తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో శ్రీ ఎమ్. అంజి రెడ్డిగారు, రచించిన కథ "ప్రేమకు కత్తిపోట్లు"కు మొదటి బహుమతి వచ్చుట చాలా న్యాయమని తలుస్తాను. వారికి ఈ పత్రిక ద్వారా నా హృదయపూర్వక అభినందనలను తెలియ పరచుచున్నాను. కథ మంచి బిగువుగా వుండి చదువరులను బాగుగా ఆకర్షించినది.

దీపావళి ప్రత్యేక సంచిక చాలా బాగుగా వుండి చదువరుల కింపుగా వున్నదని తెలుపుటకు నేను ఎంతయో గర్విస్తున్నాను.

పి. వి. ఆర్. శేషగిరి రావు (విజయవాడ)

* * *

ఈసారి మీ 'దీపావళి' సంచిక ఎంతో ముచ్చటగా నుస్తాబై, ఘుమ ఘుమలాడే పరిమళద్రవ్యాన్ని పూసుకొని పాఠకుల హస్తాల్ని అలంకరించింది...! పండుగకు సెంటుబుడ్డి కొనకుండా, మీ పత్రిక ఒకటి కొనుక్కొని చంక పెట్టుకుంటే ... నిజంగా ఎలా వుందనుకున్నారూ......ప్రతివారూ యీ నూతనపంథాను మీ పుణ్యమా అంటూ అనుసరించారు...! సుగంధాన్ని ఆస్వాదించారు. హాయిగా ఆనందించారు. పై సౌరభంతో పాటు, లోపలి వివిధ రచనల మాధుర్యాన్ని కూడా ఆనందంతో

ఆస్వాదించారు. ముఖ్యంగా ముఖచిత్రం ఎంతో బాగుంది. భావగర్భితంగా వుంది! ప్రతి కథా మీ సంచికలో ఒక్కొక్క ఎనలేని మణిపూస. సంచికను సర్వతోముఖంగా చిత్రించి సర్వాంగ సుందరంగా వెలువరించటంలో మీకు మీరే సాటి. రేలంగి వారి వ్యాసం నిజంగా చదువుతున్నంతసేపూ ఎంతో నవ్వువచ్చింది. వారికి నా ధన్యవాదాలు. మొత్తానికి మీ దీపావళి సంచికకు, మీకు, నా హృదయపూర్వకాభివందనలు.

తంగెళ్ళ పాండురంగ శర్మ (విజయవాడ-1)

* * *

(మా) మీ దీపావళి సంచిక సర్వతోముఖంగావుంది. "స్త్రీలకు యోగ్యమైన విద్య ఎలాంటిది" అని చర్చింపబడిన వ్యాసాలు అద్భుతంగా ఉన్నాయి. "ప్రేమకు కత్తిపోట్లు" వ్రాసిన శ్రీ ఎం. అంజిరెడ్డిగారికి నా ధన్యవాదములు. పంచభక్ష్య పరమాన్నము ముందరగుంచుకొని ఏదీ తినలేని పరిస్థితి ఏ విధంగా కలుగుతుందో, అదేవిధంగా మీపత్రిక వచ్చినప్పటినుండి (నాదగ్గరికి) ఏది చదువవలెనో ఏదిలేదో అని తహ తహలాడి పోయేనంటే నమ్మండి. మీ (మా) పత్రిక (ఈ సంచిక) 25 నయాపైసలకే 100 పేజీలలో లభించడం మరీ ముదావహం.

డి. పద్మనాభాచారి (పెద్దదిన్నె)

* * *

దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించిన అన్నపూర్ణ గారి వ్యాసం "స్త్రీలకు యోగ్యమైన విద్య ఎలాంటిది" నాకు బాగా నచ్చింది. ఈ వారం అట్టమీద వేసిన బొమ్మ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నది.

"తెలుగు వెలుగులు" లేకపోయినా బహుమతిపొందిన కథలతో వ్యాసాలతో వెలువడిన దీపావళి ప్రత్యేకసంచిక ఆశలను పెంపొందింప జేసింది.

ఎం. రామకృష్ణరాజు (విజయవాడ)

* * *

తెలుగు వెలుగులు

తెలుగు వెలుగుల్లో కె. వి. రెడ్డి గారిని గురించి వ్రాసినవారికి, సినిమాలంటే ఏమిటో తెలియదనిపించింది. కె. వి. గారిచిత్రాలు 'పొడుగు' చిత్రాలు కావు. వాటిది సగటు పొడుగే. అన్నీ 'జానపద' చిత్రాలూ కావు: పోతన వేమన జీవిత చరిత్రలు; గుణసుందరి, పాతాళభైరవి మాత్రమే జానపదాలు. మాయాబజార్ పౌరాణికం, మిగతా మూడూ సాంఘికాలు. ఈ చిత్రాలలో పాత్రలు 'అనగనగా మార్కు మనుషులు' మాత్రం కావు: నిజానికి, పాత్రపోషణలోని విశిష్టతే ఆయన చిత్రాల విజయానికి ముఖ్యకారణం. 'పెళ్లినాటిప్రమాణాలు' రాణించక (?) పోవటానికి చూపినకారణంకూడా నిజంకాదు. ఆ చిత్రంలోని కథావస్తువు విశ్వజనీనమైనది. 'మారుతున్న తెలుగు జీవితపు నుడికారం' పై ఆధారపడిందికాదు. సత్యజిత్ రాయ్ చిత్రాలను ఎందరు గ్రామస్థులు రెండెడ్ల బళ్ళపై వచ్చి చూడగలరు? అంతమాత్రాన వాటిలో 'జీవితపు నుడికారం' లోపించినట్లే? కించపరచటం కాదుగాని, కె. వి. గారి చిత్రాలవంటివి బహుశా సత్యజిత్ రాయ్ ప్రయత్నించినా తీయలేడేమో? భారతీయ సినిమా దర్శకులలోని కొద్దిమంది ప్రతిభావంతులలో కె. వి. ది చాలా అగ్రస్థానం. 'తెలుగు సినిమా' రథానికి బి. యన్. రెడ్డి, కె. వి.

ఉత్తరాలు

రెడ్డి గారు తీసిన చిత్రాలు. చిత్రనిర్మాణ రంగంలో కె. వి. కి ఎక్కడా పోటీయే లేదు.

ఎ. కె. ఆచారి (ఖర్గ్‌పూర్)

* * *

"దైవ మిచ్చిన జానపదానికి ముకుటం లేనిరాజు శ్రీ కె. వి.కి" అన్న వాక్యము అక్షరాలా నిజం. బొమ్మకూడ చాల బాగా వేసినారు.

డి. కోటేశ్వర రెడ్డి (గిద్దలూరు)

* * *

శ్రీ కె. వి. రెడ్డి గారిని మీ "తెలుగు వెలుగు"లలో ఎన్నుకొని ఆయనలోని విశేషాలను చక్కని ధోరణిలో తెలియచేసినందుకు వ్యాసకర్తకు, చిత్రాన్ని బాగా వేసిన బాపు గారికి నా అభివందనములు. ఈ వారము "వివృత్త దృష్టులు" "లచ్చి తల్లి" "వసుంధర" నన్నెంతో ఆకర్షించినవి.

పిరవాల వినోద (దమ్మన్నపేట.)

* * *

మీరు తెలుగు వెలుగులు శీర్షికలో కె. వి. రెడ్డిగారి గురించి రాస్తూ 'పెళ్ళినాటి ప్రమాణాలు' రాణించలేదని రాసేరు. చిత్రం అంటే తెలిసిన వారు దానికి ఎంతైనా విలువనిస్తారు. అది ఫస్ట్ క్లాస్ సినిమా అని అందరూ చెప్తారు. అందుకే దానికి రాష్ట్రపతి బహుమతికూడా వచ్చింది.

పి. ఎం. గోపాలకృష్ణ;
ఎం. సత్యనారాయణమూర్తి (వాల్తేరు)

* * *

తెలుగు వెలుగులలో ఈనాటికైనా కె. వి. రెడ్డిగార్ని గురించి వ్రాయడం ఎంతో సమంజసము. వీర్ని జానపదానికి ముకుటం లేని రాజన్నారు. సాంఘికానికి మటుకు కారా! వారి పెద్దమనుష్యులు, దొంగరాముడు జనాదరణ బాగా పొందలేదా? వారు తీసిన "పెళ్ళినాటి ప్రమాణాలు" ప్రభుత్వ రజతపతకాన్ని పొందింది. అది వారి గొప్పదనానికి వన్నె నిచ్చింది.

డి. లక్ష్మీనారాయణ రావు (రాజమండ్రి)

* * *

వేట

ఈ వారం (12-10-60) పత్రికలో ప్రచురించిన "వేట" చాలా బాగున్నది. ప్రతి వాక్యమూ హాస్యాన్ని ఒలికిస్తూ వుంది. అప్పారాయలవారిని గూర్చిన హాస్యము ప్రశంసించదగినది. పలుమార్లు చదివి ఆనందించాను. "వేట" ను వ్రాసిన ముళ్ళపూడి వెంకటరమణగార్కి పత్రికద్వారా నా అభినందనలు.

ఆర్. బసవేశ్వరరావు (నందిగామ)

* * *

లచ్చితల్లి

మీరు ఈ వారం వార పత్రికలో ప్రచురించిన "లచ్చి తల్లి" కథ చాలా బాగున్నది. ఇలాంటి కథలను ఇక ముందుకూడా ప్రచురిస్తారని ఆశిస్తున్నాను. రచయిత శ్రీ తూలికా భూషణ్ గారికీ, ప్రచురించిన మీకు నా ధన్యవాదాలు.

జలా వెంకటేశ్వరరావు (విజయవాడ)

* * *

12-10-60 తేదీ సంచికలో ప్రారంభించిన "లచ్చి తల్లి" చాలా నచ్చింది మాకు.

ఏ. యల్. నారాయణ (వెంకటగిరి)

* * *

వివృత్త దృష్టులు

ఆర్. ఎం. చిదంబరం గారు వ్రాసిన "వివృత్త దృష్టులు" అనే కథ నన్ను చాల ఆకర్షించింది. ముఖ్యంగా యేసుఖానికీ నోచుకోని మాలతి, ఇంట్లో చాకిరంతా తనే చేస్తూ, తోబుట్టువుల సుఖంకోసం తను మానసికంగాను శారీరకంగాను బాధపడుతూ, తప్పుడు దోవలు పట్టే వారిని వాళ్ళంతట వాళ్ళే సన్మార్గంలోకి వచ్చేటట్లు చేసి ఇంటికి పెద్ద దైనందుకు తన కర్తవ్యం తాను నెరవేర్చుకున్న ముఖ్య ఘట్టాలు ఈ కథలో చదువుతున్నంతసేపూ ప్రపంచంలో నిజంగా యిటువంటి పరమ సాధ్వీమణులున్నారా? అనిపిస్తుంది.

కొయ్యాకాళ్ళతో సీతాపతి ఇంట్లో నడుస్తూంటే ఆ చప్పుడు విని రామం, సీత హడలిపోయేవారు అన్న వాక్యాలు కన్నులకు కట్టినట్లుండి ఒక్కసారి నా తలంపుకొచ్చి గుండె దడదడలాడించివేశాయ్.

డి. రామమోహనరావు (నర్సరావుపేట)

* * *

ప్రభాకరుడూ-సుందరీ

మీరు 12-10-1960 బుధవారం సంచికలో ప్రచురించిన "ప్రభాకరుడూ-సుందరీ"- అన్నకథ చాలా బాగుంది. అది వ్రాసిన శ్రీ దొంతంశెట్టి విశ్వేశ్వరరావుగార్కి, సంపాదకులైన మీకును నా ధన్యవాదాలు.

అప్పల శ్రీరామ చంద్రమూర్తి (నదురుపాక)

* * *

ఉషా కన్య కథ

నేను "ఉషాకన్య కథ" మిక్కిలి ఆసక్తితో చదువుచున్నాను. ఇంకను ఎక్కువ పేజీలు ఉషాకన్య కథ వేసి ఆకర్షణీయముగా బొమ్మలు వేసి మా బోటి బాలబాలికల మనస్సును రంజింపజేయవలసినదిగా కోరుచున్నాను.

జి. లలితాంబ (అల్లూరు)

* * *

గళ్ళ నుడికట్టు

నా అభిమాన ఆంధ్ర సచిత్ర వార పత్రికయందు నీయబడు "గళ్ళ నుడికట్టు" నన్నెంతో ఆకర్షిస్తుంది. పత్రిక రాగానే ముందు గళ్ళ నడి పూర్తి చేసిగాని మిగతావాటి కుపక్రమించను. ఇది కాలక్షేపానికి బఠానీ గింజలాంటిది.

మందాళి వెంకటేశ్వర రెడ్డి
(సంగం జాగర్లమూడి)

'ఆంధ్రసచిత్రవారపత్రిక' నిర్వహిస్తున్న పోటీలు

'కథ కాని కథ', 'కార్టూన్ పోటీ', 'గళ్ళ నుడికట్టు అధారాలపోటీ', 'కవితా కింకిణి' మున్నగు పోటీలలో పాల్గొనేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు గమనించాలని కోరుతున్నాము:

ఆయా పోటీలలో పాల్గొనడానికి ప్రత్యేకమైన నిబంధనలు ఏమీ లేవు. ప్రవేశరుసుము లేదు. ఎవరు అయినా పాల్గొనవచ్చు. పోస్టుకార్డులమీద వ్రాసి పంపినా, 'ఇన్‌లాండ్ లెటర్'లలోను, కవర్లలోను పంపినా ఏ పోటీకి సంబంధించినది స్పష్టంగా వాటిమీద వ్రాయవలసి ఉన్నది. ఆవిధంగా వ్రాసి పంపని వాటిని పరిశీలించడం జరుగదు. అన్ని పోటీలకు కలిపి ఒకే కార్డుమీదగాని, ఇన్‌లాండ్ లెటర్‌లోగాని, కవరులో కాని పంపినా వాటిని పరిశీలించడం జరుగదు.

ఆయా పోటీలకు పంపినవాటిని తిప్పిపంపడం జరుగదు. కనుక స్టాంపులుకాని, స్టాంపులు అతికించిన చిరునామాలు కల కవర్లుకాని జతచేసి పంపరాదు.

కార్టూన్‌లు ఏ కాగితంమీద అయినా వేయవచ్చు. కాని 'ఇండియన్ ఇంక్'తో వేయవలసి ఉన్నది.

ఏ సందర్భంలోను ఆయా పోటీలలో పాల్గొనేవారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం సంభవం కాదు.

—సంపాదకుడు

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 58

26-10-60
బుధవారం

శార్వరి కార్తిక శుద్ధ షష్ఠి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.


విషయానుక్రమణిక

ముఖచిత్రం :
'భట్టివిక్రమార్క' చిత్రంలో
అంజలీదేవి


గమనిక

19-10-60 సంచికలో 'రమాసుందరి' చిత్రసమీక్షలో పాటలు 'కొసరాజు' అని పడినది. పాటల రచన 'వడ్డాది' అని గమనించవలెను.


★ దీపావళి కథలపోటీ ★



ఎమ్. అంజిరెడ్డి
(విశాఖపట్టణం)
మొదటి బహుమతి పొందిన
'ప్రేమకు కత్తిపోట్లు'
రచయిత



వై. సుబ్రహ్మణ్యం
(హైదరాబాదు)
'కన్సొలేషన్' బహుమతి పొందిన
'చలమయ్య సంసారం'
రచయిత


ఇంటులేని శాంతి
ఇలనెట్లు
నెలకొల్ప
కాంగ్రెసు
అజమాయిషీ ప్రభుత్వం కావాలి
సాదుపుచేసి జాతిసేవ చేయండి!
ఏదండో గొడవ–
అత్తగారు మననగలు
అడిగినా అడగవచ్చు



తెలుగు వెలుగులు 56

అచ్చమైన తెనుగుదనం తొణికిసలాడే ముచ్చటైన పలుకుబడి, విజాతీయ వాసనా సంస్కార ధోరణికి దూరమై సజాతీయతను సంతరకట్టుకున్న పాత్రలు, గోదావరీ ప్రవాహోదారంగా సాగిపోయే శిష్ట వ్యావహారిక విశిష్టశైలీ, అక్షరాక్షరాన గుబాళించే ఆంధ్ర సంస్కృతి పాండితీ పరిమళం శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు.

ఈయన రచనలలోని ఈ గుణాలే అత్యాంధ్రజాతీయతగా పరిణమించి కాలానుగుణం కాని కొన్ని అడుగులు వేయించడమే కాక "హిందీ-గాంధీ-ఖద్దరు" అనే స్వాతంత్ర్యోద్యమ త్రిరత్నాలను ఈసడింపజేసి "ఏమిటీ పెడసరం?" అన్న విమర్శలకూ గురికాకపోలేదు. అయితే, భారత స్వాతంత్ర్యోద్యమ స్వరూపం ఎలా వుండాలో, అప్పట్లో ఈయన నిర్వచించలేదు సరికదా, విదేశ ప్రభుత్వం పై తమ వైఖరినిగూడ ఎక్కడా వెల్లడించినట్లూ లేదు. మహావీరాంధ్రం వెళ్ళబోసుకున్నారు. భారత జాతీయతకన్నా ఆంధ్ర జాతీయతే పరమారాధ్యం మొదలయిన చిత్రవిచిత్రాభిప్రాయాలు ఘనీభవించిన మూర్తి ఈయన; సహజంగానే 'తిక్క-బ్రహ్మ'.

ఈ పెడసరానికి కారణం చిన్నప్పటి నుంచి బ్రదుకుబాటలో వాటిల్లిన ఎడతెగని పోరాటాలని అంటారు. అనూచానమైన పండిత వంశంలో జన్మించి, తండ్రిగారివద్ద, పెద్దన్నగారి వద్ద వేదాధ్యయనం చేసి, జ్యోతిషం, వైద్యం పఠించినా, పెద్దల అభిరుచికి విరుద్ధంగా ఏటికెదురీది, సంగీత నాటక సాహిత్యాల వ్యాసంగ వాసనలో పడేట్లు చేసింది ఈ పెడసరమే. దీనివల్లనే ఒకతరహా ఉడుంపట్టులాంటి పట్టుదల అలవడింది! దీనికితోడు ఈయనది కండలు తిరిగిన దండి విగ్రహం.

నిజానికి ఈ పట్టుదల ఈయనకూ, ఆంధ్ర సారస్వతానికి-ముఖ్యంగా కథానికాశాఖకు-మేలే కలిగించింది. లేకపోతే పదిమంది వేద, వైద్య, జ్యోతిష పండితులలో ఈయన ఒకరుగా వుండేవారే.

ఈయన సంగీతంలో సాధనచేసినా, నాటకాలలో ఆడవేషాలు వేసినా, ప్రధానంగా వ్యావహారిక భాషను చేపట్టారు. దానిని సాహిత్యస్థాయికి తెచ్చిన పెద్దతరంవారిలో ఈయన ఒకరు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారన్నట్టు అత్యల్పసంఖ్యాకులయిన వ్యావహారికాంధ్ర నిర్మాతలలో పరిగణించదగిన ప్రముఖులు ఈయన. గద్యానికేగాక పద్యానికీ వ్యావహారికభాష తగినదని నిరూపించడానికి "మగధ పాలించావు జావాసుమిత్రాల ఎగురవేశావు నీ జయపతాక" వంటి పద్యాలూ చెప్పారు.

ఈయన పట్టుదలకు మరొకఫలం నిరంతర పరిశ్రమ. కథలు, నవలలు, నాటికలు, మీగడ తరకలు, రామాయణం, భారతం, ఇంకా ఎన్నో - వేలపుటల సంఖ్యలో - రచించారు. డెబ్బయ్యవపడి నడుస్తున్నా - నేటికీ రచనావ్యాసంగ విముఖులు కాలేదు.

అయితే, వీరి కథలలో, నవలలో దృక్పథం ఒక కులంవారి ఆచార వ్యవహారాలకు — ముఖ్యంగా వైదిక కుటుంబాల, అగ్రహారికుల జీవితాలకు మాత్రమే పరిమితమైందనే ఆక్షేపణ వుంది. నిజమే. సిద్ధహస్తుడైన రచయిత తన పరిసరాలలోనే, స్వజనీనతలోనే విశ్వజనీనత కల్పిస్తాడు. పరిసరాల ప్రాభవం అలాంటిది.

ఏమైనా, శ్రీపాదవారి రచనలు తెనుగుతల్లి 'శ్రీపాదరేణువులు.'

★

శ్రీమతి - శ్రీవారు -

"నాన్నోయ్!... నాన్నోయ్!...."
అంటూ జారిపోతూన్న చింకిలాగును ఒక చిన్నారిచేత్తో పైకి లాక్కుంటూ, ముక్కుంట సంతతధారగా కారే లావాని ముండలో మీదికి ఎగలోస్తూ కేకలు పెడుతున్నాడు మా రెండో ప్రబుద్ధుడు పరుగెత్తుతూ—

ప్లాటుఫారం దాటి స్పీడు పుంజుకునే సమయంలో గొలుసులాగుడికి ట్రెయిను ఆక్కున ఆగినట్లుగా, ఆ గావుకేకలు విన్న నేను, ఏం ప్రమాదం సంభవించిందో అని వెంటనే ఆగిపోయాను.

"అమ్మ రమ్మంటూంది....రా...." అంటూ పంచె గోచీని మర్కటంలా పట్టేసి, జలగలా సాగటం ప్రారంభించాడు. గొల్లభామ డబ్బాపాలు త్రాగి పెరిగితేనె ఇలా ఉన్నాడు, అసలు తల్లి పాలమీదయితే వీణ్ణి పట్టశక్యం కాకపోయేదేమో అనిపించింది నా పాపిష్టి హృదయానికి-తల్లి ఆజ్ఞ శిరసావహించటంలో వాడు చూపుతూన్న పట్టుదల నన్ను ముగ్ధుణ్ణికూడా చేసింది—

"ఏరా...ఏం వచ్చిందని మళ్ళీరమ్మంటూంది...పద వస్తున్నా." అంటూ గృహోన్ముఖుడ నయ్యేను.

గుమ్మంలో దర్జాగా నుంచొని చంకలోనున్న చంటాడికి గోరుముద్దలు మురిపెంగా పెడుతూన్న మా శ్రీమతిని చూడగానే ఒళ్ళుమండింది.

"వెడుతూన్న వాణ్ణి వెనక్కు పిలవవద్దని ఎన్నిసార్లు చెప్పేను?...ఇహ నీకు బుద్ధి రాదా?..." అని గ్రుడ్లెర్రచేశా.

నా కోపం సత్తురూపాయి లాంటిదని, చెలామణి అయ్యేది కాదని సెంట్ పర్ సెంటు తెలిసినప్పటికి అలవాటు ప్రకారం మరచిపోయి ఒక ధణుతు ఎగిరించే—

"ఓ....మహా చెప్పారులెండి.... ఇలా శకునాలు చూసుకుంటూ, అఫీసుకు వెళుతూండబట్టే మనపని ఇంత ఇదిగా వెలుగుతూంది...." అని మూతి ఆ చివరనుండి ఈ చివరకు రయ్యిమని త్రిప్పింది...

"మనపని వెలగక ఆరిపోయిందంటావా? ......నిక్షేపంగా ఉంది...మన శేం......



ఖండవిల్లి సాంబశివరావు

"అసలునీకు సంతృప్తి అనేది ఏకోశానా లేదు" అని నేనూ విసుక్కున్నా..

"ఇవా వేదాంతాలుచాలిద్దురూ.. చూడండి. ఇవాళ ఏమయినాసరే సినీమాకు వెళ్ళితీరాలి...ఆఫీసుఫైళ్ళలో తలదూర్చేసి ప్రపంచాన్ని మరచిపోతే మళ్ళీ వారంవరకు వెళ్ళేసం పడదు...అయిదూ అం...గని కొట్టేసరికి ఇంటికి వచ్చేయాలి...ఆలస్యంచేశారం టిక్కట్లుదొరకవు ... దొరికినా నిలబడే చూడాలి మొన్నట్లా...మరచిపోకండీ! మీ పుణ్యముంటుంది!" అంటూ ఒకటికి పదిసార్లు చెవిటివాడికి మతిలేనివాడికి చెప్పినట్లుగా చెప్పింది మాకంబుకంఠి!!!

"వెళ్ళొచ్చా!..." అడిగేను ధుమధుమలాడుతూ.

"వచ్చేటప్పుడు పావు శేరు మల్లెపువ్వులూ, ఓమూర జాజిదండా పట్టుకురండి...మరచిపోకండి."

నేనువెంటనే సైకిలుఎక్కాను...ఎదురుగా ఉంటే ఏదోఒకటి చెప్పబుద్ధి మా ఆవిడకు వాళ్ళనాన్న (తహసీలుదారు)లా...

* * *

పగిలిపోయిన బిసీనాటి గోడగడియారం "సినీమాగోయ్...సినిమాగోయ్..." అంటూ అయిదుసార్లు మూలిగేసరికి డ్రాయరు తాళాలు వేసి, కుర్చీకితగిలించిన కోటు ఒంటికి తగిలించి, బీడీముట్టించి బయలుదేర సిద్ధమయ్యాను.

ఇంతకూ ఇవ్వాళ ఆదివారం—

హాలీడేలోకి పబ్లిక్ హాలీడే—

అంచేత అయిదింటికి బయలుదేరడంలో అట్టేతప్పున్నట్లు నాకనిపించలేదు.

సరిగ్గా అదేసమయానికి మా దొరగారు చక్కగా తలంటుకొని ఆఫీసుకువచ్చేరు... దొరగారికి ప్రతీ ఆదివారం తలంటుకోటం అలవాటు—

శ్రీవారికి పాపం అదేంజబ్బోగాని, ఆదివారం అనిగాని, పండుగపబ్బం అనిగాని—రాత్రిఅనిగాని, పగలుఅనిగాని ఎరుగరు... అసలు వారు ఆశించరుకూడా—ఒక్కజీతం ఆజీవికి రాస్తుంటే మీకేసినట్టు—

ఇరవై నాలుగు, మూడు వంతుల అరవై అయిదురోజులూ గానుగెద్దులాగ, పనిభారంతో క్రుంగిపోతుంటారు. గీతాకారుడు శెలవిచ్చినట్లు శ్రీవారు కేవల'కర్మయోగి'... ఎంతసేపూ,కర్మ...కర్మ...కర్మ...(అంటే పని) అంటూంటారు...ఎవడికో ఒకడికి కర్మ చేయడమో లేదా ఎవడిచేతనైనా కర్మ చేయించటమోతప్ప రెండోదిలేదు వారికి...

శ్రీవారు ఆఫీసుకి ఇలా అయిదుగంటలకు రావటం ఇదే మొదటిసారిగాదు. ప్రతిరోజూ అందరూ ఇళ్ళకు వెళ్ళే వేళ, శ్రీవారు ఆఫీసుకు వచ్చే వేళ.

పైశాచిక ప్రవృత్తిగలవారికి సంధ్యా సమయం సమీపిస్తున్నకొద్దీ బలం విజృంభిస్తుంది పగలుకన్నా రాత్రే దిట్టంగా పని చేయగల శక్తిని ప్రసాదించిన ఆ పరమాత్ముని వేనోళ్ళ అనాలిగాని శ్రీవారిని అనవీలా? ఒకవేళ నోరుజారి అన్నామా నాలిక తెగిపోదూ!... శంకరగిరి మన్యాలు, దండకారణ్యం ప్రాంతాలు సందర్శించమా!! కుమ్యులేటివ్ ఎఫెక్టుతో ఇంక్రిమెంటులు ఎగిరిపోవూ!... పాపంశమించుగాక... ఇవన్నీ నేనె అంటున్నానా?! కలగాదు కదా!...



ఉదయం తొమ్మిదిన్నరకు ఉడికీ ఉడకని క్రొత్త బియ్యపు అన్నం ప్లస్ కాటోయిన కందిపప్పు మైనస్ నెయ్యితో కతికేసి కరవేగంతో ఆఫీసుకు వచ్చిన ప్రాణికి, సాయంకాలం అయిదు అవుతోందనగానే నరాలు వోడేస్తూం[illegible] సత్తువ నిలువెల్లా గాపురిస్తుంది... చెవులు వినవొల్లవు...... నేత్రాలు చూడనిచ్చగించవు......మనస్సు డానాలేనిగుఱ్ఱంలా ఈదురోమంటూంటుంది. ...కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలుఎదురు తిరిగిన విపరీత విపత్కర పరిస్థితిలో ఫ్రీగా సప్లయి చేయబడ్డ వాహనంమీద కర్మ (అంటే పని...!) ప్రారంభించటానికి వచ్చిన శ్రీవారిని చూడ శక్యంగాకుండా ఉంటుంది.

నాలుగు గంటలకు సుష్టుగా డజనో, జడనున్నరో సేతిగారు (అల్లప్పచ్చడితో సహా) ఎడాపెడా పావుశేరు పాకం జీడిపప్పు తినేసి అర్ధశేరు చిక్కని బత్తాయిపాలు గ్లాసో

శ్రీమతి - శ్రీవారు

ఉపకారార్థం పుచ్చుకుని వచ్చి, ఆఫీసులో పంకా క్రింద, కుషన్ చైరులో జమాయించి కూచుని, "బేక్.....బేక్......బేక్...." మంటూ పైకప్పు ఎగిరి పొయ్యేటట్లు త్రేణుస్తూ వినలేక చుట్టుపట్ల జనం ఛస్తూండగా (పాపం శ్రీవారు ఏం చేయగలరు!...ఆ త్రేణుపుల్ని రమ్మనమని వారు ఆహ్వానించేరా?) తిన్నది అరిగే పర్యంతం అది బాగులేదని, ఇది బాగులేదని, అది చేయలేదం, ఇది చేయలేదం అని—బల్ల గుద్దుతూ బెల్లునొక్కుతూ సిగరెట్లు త్రాగుతూ, వక్కపొడి నములూ చెడుగుడు ఆడేసి—త్రాహీ, త్రాహీ అని తాబేదార్లు ఆర్తనాదాలు చేసేవరకు, పాహీ పాహీ అని ప్రార్థించేవరకు (?) ఛస్తేవదలరు.

ఈ వ్యాయామ క్రీడ రోజూ జరుగవలసిన కార్యక్రమంలో ఒకటి.

శ్రీవారిలో దూర్వాసుడు, పరశురాముడు ప్రత్యక్షమవుతూంటారు...వారి దర్శనం ఒక్క తాబేదార్లకు తప్ప అన్యులకు లభించదు.

శ్రీవారికి కోపం ఒక్కొక్కసారి పట్టరానంత వచ్చేసి, కట్టలు త్రెంచుకొని, హుంకరించుచూ, ఫైళ్లు మీదకు విసరటం రూపంలోగాని, బూతుల పంచాంగ పఠనరూపంలోగాని, చేతికందే దూరంలో ఉన్నట్టయిన చెంపకాయల రూపంలో గాని ప్రవహించేసి తిరిగి ఎండిపోతుంది...

ఈ మధ్యనే నా జూనియర్ శ్రీవారు కోపోద్రిక్తులయి ఉన్నట్లు గమనించక ఏదో అందామని పెదిమలు సవరించుకో బోతూండగా, శ్రీవారు విశ్వరూపం చూపించి వానికి దవడపండి చేశారు. అతను కిక్కురుమన కుండా ఏసు ప్రభువును సుమ్మారు తలచుకొని రెండో దవడకూడా అందించేడు చిరునవ్వుతో.

అసలు వాడు దంతసిరితో పుట్టి ఉండాలి. ...లేకపోతే శ్రీవారు ఆ దవడచూసి అమాంతంగా విసయిపోయి "అసలు ట్రూసర్వెంటు అంటే నువ్వేనోయ్ మైడియర్ బోయ్..." అనేసి నన్ను ఓవర్ లుక్ చేసి ఆ శుద్ధి చేయబడ్డ ప్రాణికి ప్రొమోషను ఇప్పించేరు—

నాకూడా దేహశుద్ధి అవుతేనే గాని ప్రొమోషను వచ్చే యోగం లేదని లాబీ వర్గాల్లో గుసగుసలు—దీన్నిబట్టి అయ్యగారు నడమీద (విరిగేవరకు) కొట్టే బాపతేగాని, పొట్టమీద పొడిచే క్రూరాత్ములుగారని రుజువవుతూంది కదూ!

శ్రీ వారి దర్పం ఒక్కటే చాలదన్నట్లు ప్రక్క డవాలా బంట్రోతు పిచ్చేశ్వర్రావ్ (అసలు పేరు పిచ్చిగాడు) దావత్తు యమదాపత్తుగా ఉంటుంది. వాడెప్పుడూ మంగు కొట్టేసి ఎవ్వరెడీ బ్యాటరీలా ఉంటాడు—పూర్వజన్మలో వాడు యమదూతగా ఉండి ఉంటాడు—

అయ్యగారు ఆఫీసుకు రావటంతోనే మన సినీప్రోగ్రాం 'ఆంఫట్' అయిందనుకున్నా. ఇంట్లో శ్రీమతి కిచ్చిన స్వీట్ ప్రామిస్ కాలదోషం పట్టిన ప్రామిసరీనోటు అయింది... సినిమాకు పోదామని ఆమె హడావుడిగా అన్నంమాత్రం వండి మరే అయిటాలు వండక ... వీర రసోత్పత్తికారకం అయిన ఆవకాయమీదనే ఆధారపడి, తొందర తొందరగా పిల్లకాయలకు తలకాయలు దువ్వి, పౌడరు కొట్టేసి బట్టలు తొడిగేసి, తనూ ట్రాయిలెటు అయి, గువ్వపిట్టలా గుమ్మం దగ్గర సైన్యంతో బైఠాయించి చిన్నరాగ వశనని చిన్నప్పుడు నేర్చుకొన్న కీర్తన మెల్లగా, చల్లగా పాడుకుంటూ సాగాకకై చంద్రునికోసం చకోరీలా, భాస్కరునికోసం పద్మినిలా కూచుని ఉంటుందనుకున్నా గతానుభవప్రకారం.

"అయిదయిపోయింది ... రారూ?..." అని ఆమె మళ్ళీ మళ్ళీ అడుగుతూన్నట్లు ఫీలయ్యేను. హృదయంలో ఆరాటం ఎక్కువ అయింది. ఎలా ఆఫీసునించి ఉడాయించటం? ఉపాయం ఏది? అనుకుంటూ శూన్యంలోకి చూస్తూ కూచున్న నా ఘ్రాణేంద్రియానికి గుప్పుకుని బ్రాందీ సారాయి వాసన తగిలింది. తూలుతూ ఊగుగుగా నుంచున్న పిచ్చేశ్వర్రావ్ విగ్రహం కంటబడింది.

"పడతావ్ ... కూర్చో అలా ..." అన్నా...

"మన కలవాకే...ఫరవాలే" అన్నాడు వాడు.

"ఏరా...ఇవాళ ఎంత రాత్రవుతుందిరా ఇంటికెళ్ళేసరికి?" అని అడిగేను.

వాడు ఆఫీసు వాసాలకేసి చూసి ఏదో లెక్కకట్టి కళ్ళుత్రిప్పి "పదవుతుంది..." అన్నాడు.

నా నాడీమండలం ఒక్కక్షణం స్తంభించింది. వాడి లెక్క యమకరకు అని నాకు తెలుసు. శ్రీవారికి వాడు రెండో గుండెకాయ...

"ఒరేయి పిచ్చేశ్వర్రావ్! నీ బుగ్గమీద విచ్చురూపాయంత లేసరంగు మచ్చను చూస్తే, నీకేదో పెద్దయోగం పట్టేటట్లు కనబడుతూందిరా..." అని ఒక్క చరుపు చరిచా "అబ్బబ్బ..." అంటూ తణుముకొని ఊరుకున్నాడు-లోపల కోపం మండిపోతూండగా కొట్టినదెబ్బ అని వాడికేం తెలుసు!—

"ఏదీ నీ చెయ్యి ఇలా పారేయి......" అన్నాను వాడు సంతోషంతో చెయ్యి యిచ్చేడు. నేను హస్తరేఖలు పరిశీలిస్తూండగా "అయ్యా, నాకు పిల్లలు పుడతారండీ? ..."సిగ్గుతో కూడిన ప్రశ్న వేసి గుటకలు మింగుతున్నాడు.

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ! ఎలారా పుడతారు?? అని మళ్లీ చరిచా...

ప్రఖ్యాత హాస్యనటుడు గ్రూచో మార్క్స్ మిత్రులతో ఏదో పార్టీలో ఉన్నప్పుడు, వేటలో మహాఆసక్తిఉన్న ఓ రిటైర్డ్ కర్నల్ ఇంకో విషయంగురించి ఎవర్నీ మాట్లాడనీయకుండా ఆఫ్రికాలో తన వేట అనుభవాలు చెప్పుకుపోతున్నాడు. అందరికీ విసుగ్గానే ఉంది కానీ కర్నల్ గారు మాత్రం మహా హుషారుగా చెప్పుకుపోతున్నారు ...తనోసారి సింహంనోట్లో పడకుండా ఎలా తప్పించుకొన్నాడో ఆ సంఘటన "...తీరా చూస్తే తుపాకీలో గుళ్ళన్నీ ఐపోయాయి!...చేతులో ఇంకో ఆయుధం లేదు! తక్కిన వేటగాళ్ళంతా దూరంగా ఉన్నారు... మసక చీకటి, కీకారణ్యం, పది అడుగుల దూరంలోనే ఆ సింహం గర్జిస్తూ నిల్చుంది. ఒక్క నిమిషంలో మీదపడి చంపేయవలసిందే...కానీ...ఆ సమయంలో నేను ఏం చేశాననుకున్నారు..." సరిగ్గా ఆ సమయంలోనే మార్క్స్ అందుకొన్నాడు..."మీ రేదో వేట అనుభవం చెప్పిఉంటారు సింహానికి... వెంటనే నిద్దరొచ్చి సింహం పడుకొని ఉంటుంది"...అన్నాడు బద్ధకంగా ఆవలిస్తూ...

—యం. వి. యస్. రావు
(భువనేశ్వర్)

చెప్పొద్దూ, నాకు వాడిమీద కోపంకొద్దీ ఈ సదవకాశం వినియోగించుకొని తృప్తి పడుతున్నా—

వాడు నడ్డి తడుముకుంటూ "అదేంటయ్యా గోరూ! అలా అంటున్నారు!..." అన్నాడు సినీమా టిక్కట్టు దొరకని అభాగ్యుడిలా ముఖం పెట్టి—

"ఇరవై నాలుగు గంటలూ ఇక్కడే పడి ఏడుస్తుంటేవి......ఇల్లూ వాకిలీ గొడవ ఏం పట్టించుకో వయితివి...రోజల్లా ఆఫీసరు గారి సేవకే చాలకున్నది... గబ్బిలంలా ఆఫీసుని, ఆఫీసరుని పట్టుకొని వేలాడుతూంటే నీకు ఈ జన్మలో పుట్టర్రా మొద్దూ." అని మళ్ళీ దరిచా.

"అబ్బబ్బ... చచ్చినానండి ఇయ్యాళ నన్ను బతకనిచ్చేటట్టు లేదు..." అంటూండగా వాడి ఎర్రగుడ్లలో నీళ్లు చిమ్మేయి...

పిల్లలు పుట్టరని అన్నాననో, లేక నా దెబ్బమాహాత్మ్యమో చెప్పలేను; వాడికి కన్నీరు జలజలా కారింది. మళ్ళీ ప్రారంభించేడు కళ్లు గుడ్డతో అద్దేసుకుని.

"ఇంతకూ ఏం చేయమని సలహా... చెప్పండయ్యాగోరూ ... ఇంట్లో ఆడముండ ఒకటే గోల మీరన్నట్టుగా నే!...ఆఫీసగారు ముడేసేవా నాకు సుడెట్టావా అని.... పిల్లలకోసం కలవరించేస్తూంది బాబయ్యా... అదేదో ఊళ్లో ఆశ్రమంలో చోములారున్నారట...ఆయన గారి దగ్గర కెడితే పిల్లలుడతాగుట ... పోదామంటే అయ్యగారు సెలవియ్యటంలేదు..." అన్నాడు విచారింగా.

"అన్నారూ!...అలా అంటారని నే చెప్పిందో అనుకున్నారా!...అందుకని ప్వం విచారించకు...ఒరేయ్ పిచ్చిగా!... కబంధుడిలా బ్రహ్మాండమయిన శరీరం మాత్రం ఉంది గాని బుద్ధేదిరా నీకు!...ఎవడో సోములారా నీకు చేసేది! ఎకరం బాతిక చాతీ పెట్టుకొని వాడిదగ్గర కెళ్లటానికి సిగ్గేయ లేగురా!... పసుచు పెళ్లాంగదా! రాత్రిం బవళ్లు మంగు సేవిస్తూ ఇక్కడే పక్షిలా తిరిగి ఏంవకపోతే, దాన్ని ఓసినీమాకని, ఓనాటకానికని, తీసుకెళ్ళి చిలకా గోరింకల్లా ఉషారుగా ఉత్సాహంగా, ఆనందంగా, హాయిగా సంసారం చేసుకొని, పిల్లా పాపల్ని కని సుఖంగా ఉండకూడదూ..." అని నేనంటూండగానే లోపలనుండి కాలింగ్ బెల్ ఋర్రుమని మోగింది.

సచ్చేశ్వర్రావ్ హర్షపులకిత శరీరంతో నేగంయిమని లోపలకు వళ్లి ఇట్టే తిరిగి వచ్చి "సార ...మిమ్మల్ని రమ్మంటున్నారు..." అన్నాడు మీసాలు మీద కెగ తోసుకుంటూ—

వాడు మీసం ఎగదోసి మాటాడినప్పుడల్లా ఏదో కొంపమునిగే విషయం ఉందనే నాకు భయం......

"నన్నేనా రమ్మన్నది? నిజంగానా!!!" అన్నా.

"మిమ్మల్నే సార్ ... ఆఫీసులో మీరూ, నేనూ తప్ప ఇంకోరు ఉండేరుగా......" అన్నాడు మీదికె త్తిన మీసాన్ని మెలేస్తూ. ఆ మాటకు నా హృదయం విలా విలా తన్నుకుని విడిచింది......

"సరిగా వినిపించుకొన్నావా అయ్యగారన్నది... ఆ చెవులమీద నుంచీ కట్టంత తలపాగా ఒకటి చుట్టేసుకుంటున్నావ్... వినబడి ఏడవటం లేదేమో అని అనుమానం. జాగ్రత్తగా విన్నావా ?...... నన్నేనా

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఉగాది నవల పోటీ

1961 ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో ఆకర్షణగా నవల పోటీ నిర్వహించడానికి నిశ్చయించాము. రచయితల సహకారం అర్థిస్తున్నాము.

ఈ పోటీని తెలుగు వారికి సంబంధించిన సాంఘిక నవలలకు మాత్రమే పరిమితం చేయడానికి నిశ్చయించాము. ఇతివృత్తం ఫలానా విధమైనదిగా ఉండాలనే నిబంధన మేమీ లేదు.

అయితే పోటీలో పాల్గొనేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలను గమనించవలసి ఉన్నది:

పోటీలో పాల్గొనడానికి ప్రవేశ రుసుము ఏమీ లేదు. ఎవరు అయినా పాల్గొనవచ్చు. నవల వ్రాత ప్రతి ఫూల్స్‌కేప్ సైజు 150—200 కాగితాలకు పరిమితమై ఉండాలి. కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయవలసి ఉంటుంది. వాటిని పంపేటప్పుడు 'ఉగాది నవల పోటీకి' అని కవరుమీద స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. బహుమతి పొందని నవలలను త్రిప్పి పంపగోరువారు వాటితో తగు మాత్రం పోస్టేజి పంపవలసి ఉంటుంది. బహుమతి పొందకపోయినా యోగ్యమైనవాటిని తరువాత ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించగలము. 1961 ఫిబ్రవరి 28 వ తేది తరువాత చేరే నవలలను పరిశీలించడం జరుగదు. (క్రిందటి సంచికలో ప్రచురించినట్లుగా 1961 జనవరి 31 వ తేది కాదు.)

బహుమతి పొందిన నవలను ఉగాది ప్రత్యేక సంచిక నుండి వరుసగా ప్రచురించగలము.

ఉత్తమమైన నవలకు

బహుమతి రు 250 లు

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేది 1961 ఫిబ్రవరి 28.

—సంపాదకుడు.

కిరించింది?..." అని నచ్చి నచ్చి అడిగేను.

"నా చెవల మీద తలపాగా ఉన్నా చక్కగా వినబడుతుందండి... తమకి అనుమానంగా ఉంటే వెళ్ళడం మానేయండి" అన్నాడు కచ్చితంగా...

నేను లోపలకు వెళ్ళగానే శ్రీవారు చిత్రగుప్తా డైరీ తీసి, కనుబొమలు మీదికెత్తి చక్రాల్లా కళ్ళు చేసి

"ఆ రిటర్న్సు ఎంతవరకు వచ్చింది? ఆ రిజిస్టరు పోస్టింగు ఏం అయింది?... ఆ రిఫరెన్సులు ఎక్కడ మూలుగుతున్నాయి?..." అంటూ ప్రశ్నల వర్షం ఊపిరి సలపకుండా కురిపించేరు.

వాటన్నిటికీ యథాశక్తిగా జవాబులు చెప్పకొని వినమ్రుడనై తలొంచుకొని నుంచున్నా...

శ్రీవారు సింహాసనంలో అటూ ఇటూ దర్జాగా కదలి రెండు వక్కపలుకులు, ఒక లవంగం ముక్క, నాలుగు యాలక్కిగింజలు నోట్లో వేసుకుని సుగంధం గుప్పుమంటూండగా నావైపు క్రీగంట చూసేరు- ప్రేమతో అనుకోకేరు......!

"ఆ... ఇవ్వాళ అప్పుడే ఆఫీసునుంచి చెక్కేస్తున్నావేం?... అయినా ఈ మధ్య నీకు ధైర్యం అడ్డంగా మహా బలిసిపోయిందోయ్...... స్వతంత్ర భారత్‌లో ప్రతి పౌరుడూ ఒళ్ళువంచి, నిస్వార్థంగా రాత్రింబవళ్ళు శ్రమించాలంటూ నాయక శిఖామణులు ఘోషిస్తూంటే మీరు కొంచెమైనా చలించకపోవటం శోచనీయం...

శ్రీమతి - శ్రీవారు

మళ్ళీ మాట్లాడుతే క్రిమినల్ అఫెన్సు కూడాను! ప్రమోషను కావాలంటే మజాకా అనుకున్నావా?...... ఎంత కష్టపడాలి!... ఎందరి కాళ్ళు పట్టాలి! ఎన్ని చీవాట్లుతిని అరిగించుకోవాలి. హక్కులు కావాలంటారు గాని మీలో ఒక్కడికి బాధ్యతుందా?... హక్కులంటే ఏవిటో కూడా మాకు తెలిసేదికాదు......కాని బాధ్యతో, కొండంత ఉండేది...మాకాలంలో ఎవరి శరీరం కోసినా రక్తానికి బదులు చీవాట్లు కనుపించేవి... మానావమానాలు కులమాత్ర సంబంధమైన దేహానికి గాని ఆత్మకు లేవు అన్న అంతర్యోగం అవలంబించి ఆఫీసరు యొక్క వారిసతీమణి యొక్క కరుణా కటాక్ష వీక్షణంకోసం పడిగాపులు పడేవాళ్ళం...... అవును గాని మొన్న మా ఇంట్లో భోగిపళ్ళకు ఎటెండు అవమని నా మిసెస్ పిచ్చిగాడిచేత కబురెడితే మీ ఆవిడ రావటం మానేసిందటగా...అది ఎంత అహంకార భూయిష్టమైన తప్పిదమో తెలుసుకున్నావా?..." అన్నారు.

"అది చాలా పెద్ద అపరాధం...యావజ్జీవ కారాగారశిక్ష వెయ్యతగ్గ ఘోర అపరాధంసార్...నాకు ఈ విషయం తమరి నోటిద్వారా ఇప్పుడే తెలిసింది...సార్ నమ్మండి...ఇరవైనాలుగు గంటలూ ఆఫీసులోనే సరిపోతూంది...ఈ సంగతి ఇదివరకే తెలిసినట్టయిన దానిఒళ్ళు తోమా సురబ్బా మోగించి ఉండేవాణ్ణి...సార్ మీరేం బాధపడొద్దు...నేను ఎంక్వయిరీచేసి అటువంటి తప్పిదాలు, అపచారాలు ఇటుపైని జరక్కుండా చూసుకుంటాను—

"సరేగాని, లాస్టుట్వెంటీ ఇయర్సు తాలూకు ఇన్ఫర్మేషను ఏదో కావాల్ట వీడికి... తెల్లవారేసరికి తయారుచేసి నా ఇంటికి ఏడున్నరకు పట్టుకురా..." అని ఓ ఎర్రతోక తగిల్చిన తెల్ల రిఫరెన్సు నాకందిచ్చారు...చేత్తో నిప్పు పట్టుగున్నట్టుగా ఉంది.

ఇవాళ రాత్రేకాదు, రేపు రాత్రిల్లా కూచున్నా అయ్యేదా ఇది? శివ శివా! ఏం ఖర్మ చేశానయ్యా!...మరి సినిమా సంగతి?...

"ఏవండోయ్! టయిం అయిపోతూంటే రారేం?..." అని శ్రీమతి కోరంకోరంగా అంటూన్నట్టు అనిపించింది...నా పని కురుక్షేత్రంలోని అర్జునునిలా ఉంది..అటుప్రక్క భార్య...ఇటుప్రక్క ఆఫీసరు...చేతిలోని నిప్పయిటన్నుల బరువు బాధలతో కూడిన కాగితాన్ని మడిచి జేబులో పెట్టేను... అగ్నిహోత్రాన్ని జేబులో పెట్టుకున్నట్టుగా నేఉంది...అయినా తప్పదు...—

"సార్! ఇవాళ్టికి నాకు శెలవు ఇప్పించాలి..." అన్నా. శ్రీవారు భగ్గున మండిపోయ్యారు...

"ఇదేం ఆఫీసుపని అనుకున్నావా మరో టనుకున్నావా? శెలవియ్యం కాలా డ్యూటీ అంటే ప్రాణాలయినా అర్పించేయాలి...అప్పుడే ప్రమోషను...అప్పుడే కీర్తి..." అంటూండగా నేను అడుతిగిలి "కాదుసార్! మా ఆవిడకు హండ్రెడండ్ ఫోరు ఫీవరండి...ఈ పాటికి ఓ డిగ్రీ ఇంకా పెరిగేఉంటుంది...ఇంతకూ ఇవ్వాళ శుక్రవారం, పైగా ఆరు కావస్తూంది..." అంటూ ధైర్యంచేసి అని చేతులు వెనక్కి కట్టుకొన్నా.........

"వాట్!! ఏవన్నావ్?...అసలు నువ్వు ట్వెంటీఫోరు అవర్సు ఫుల్ టైం సర్వెంటువి!...ఒక్క సెకండు కూడా తక్కువ అవడానికి వీల్లేదు...తెలుసా!... అదీగాక కోడ్సు రూల్సుకి విరుద్ధంగా వాగుతున్నావ?...డిసిప్లినరీ ఏక్షనుకు నిన్ను ఎందుకు గురిచెయ్యకూడదు..." అని ఉగ్రులై "పిచ్చయ్యా! ఓ జింజర్ సోడా తీసుకురా..." అన్నారు.

ఒంటికి చెమటలుపట్టి, బట్టల్ని సగం తడిపేశాయి—

"చిత్రం!...తమరు శెలవిచ్చినదాంట్లో ఒక్కటీ అబద్ధంలేదు...ఆ వెధవజ్వరం

(59-వ పేజీ చూడండి)

వైద్య సహాయం

ఏ పరిస్థితుల్లో వైద్య సహాయం పొందాలి?

ఏ వైద్యసహాయం ఎప్పుడు అర్జంటుగా అవసరమౌతుంది? వైద్యసహాయం లభించే వరకు చూస్తూ ఖంగారు పడుతూ ఏడుస్తూ ఉండవలసిందేనా లేక మనం చేయగలిగింది యేమయినా ఉన్నదా? వైద్యుడు ఇంటికి వచ్చినప్పుడు అతనికి మనం చికిత్స సందర్భంలో చేయగలిగిన సహాయం యేమయినా ఉందా? వ్యాధి నివారణలో, నిరోధంలో, ఉపశమనంలో, బాధ్యత అంతా వైద్యునిదేనా? లేక మన బాధ్యత సహకారమూ అవసరమా?

ప్రతివారూ ఈ ప్రశ్నలు వేసుకోవడమూ వాటికి జవాబు తెలుసుకోవడమూ చాలా అవసరం.

టెలిఫోన్లూ కారులూ ఉన్న ప్రదేశాలలో నే వైద్యసహాయం నిముషాలమీద లభించడం సాధ్యం కాదు. సాధారణంగా డాక్టరు రావడానికి అంతో ఇంతో ఆలస్యం జరుగుతోంది. ఇక గ్రామాల్లో ఈ ఆలస్యం ప్రమాదకరంగాకూడా జరుగుతుంది. వైద్యుల కాలం చాలా విలువైంది. వారివల్ల లభించే సేవ సాధారణంగా చాలా వ్యయప్రయాసలతో కూడుకున్నదిగా ఉంటుంది. వైద్యులు ఉన్న స్వల్పకాలంలో వారివల్ల అత్యధిక లాభం జరగాలంటే, రోగి, రోగి అనుచరులు కూడా కొంత రోగవిజ్ఞానం కలవారై ఉంటే ఎన్నో బాధలు ఎంతో సులభంగా ఎంతో త్వరితంగా నివారించడానికి వీలుంటుంది. రోగ నిరూపణకు, రోగం పూర్వచరిత్ర ప్రస్తుత చరిత్ర రోగి జీవిత పరిస్థితులూ, అభ్యాసాలూ, ఈ రోగాంకురానికి ముందున్న పరిస్థితులూ, ఇవన్నీ తెలిసినవారు, ఏవి ముఖ్య విషయాలో ఏవి అముఖ్య విషయాలో తెలుసుకుని, క్లుప్తంగా, స్పష్టంగా, దాపరికం లేకుండా, అతిశయోక్తులు లేకుండా, ఆవేశం లేకుండా, అమర్యాద కాకుండా, ప్రమాదం జరగకుండా చెప్పగలిగి ఉండడం అత్యవసరం. ఒకరు ఎక్కువగా భోంచేస్తే అజీర్ణం చేసి విరోచనాలయినవనుకోండి. డాక్టరుతో ఆ సంగతి చెప్పడానికి ఎవరు ఎందుకు విందుకు పిలిచిందీ, ఆ తిన్నది ఇంట్లోనా లేక బయటనా? తిన్న పదార్థాలేమిటి? అవి తయారు చేసిన పద్ధతులూ, చేసినవారి పాకశాస్త్ర విజ్ఞానమూ, అవి తినమని వారు చేసిన బలవంతమూ, తినకపోతే అమర్యాద అనుకుంటారేమోనని మనం పడ్డ బాధా ఇవన్నీ అనవసరములు. అవి తినంగానే యీ వ్యక్తి మాత్రమే కాక ఇంకా అనేకమందికి ఇల్లాంటి వ్యాధే ఏర్పడిందనుకోండి. ఆ విషయం తెలియజేయడం అత్యవసరం. ఇది మరచి మిగతా సోదంతా చెప్పబుచ్చడం. డాక్టరు వినకపోతేనో విని విసుక్కుంటేనో మనస్సు కష్టపెట్టుకోవడం, అతన్ని యాగీ చెయ్యడం తరుచు జరుగుతూ ఉంటుంది. వైద్యులుకూడా ఇతరులు ఆందోళనలో ఏదో చెబుతున్నారని అర్థం చేసుకోక విసుక్కుంటారు. ఒక వేళ విసుక్కోకుండా వినడం ఆరంభిస్తే ఆరోజంతా రోగి రోగనిర్ణయమే జరగక ఏ వైద్యమూ జరగకపోవచ్చు. అందుచేత బంధుమిత్రులు వైద్యుడికి సహకరించాలంటే ఏమి చెప్పాలో తెలుసుకుని ముఖ్యాంశాలను క్లుప్తంగా అర్థమయ్యేటట్లు చెప్పడం నేర్చుకోవాలి.

బిడ్డకి చిన్నబిడ్డ నొప్పి వస్తే ఏ గ్లిసరిన్ ఎనీమా ఇవ్వడం అవసరం కావచ్చు. అల్లా కాకుండా "వెంటనే రండి" అని గంద్రగోళం చేస్తే, అతను పరిగెత్తుకుని వచ్చి, ఆ పరికరంకోసం మళ్లీ వెనక్కు వెళ్లి కాలహరణం జరుగుతోంది. ఇక సుఖ సంకటములు హత్య, ఆత్మహత్యా ప్రయత్నములు, త్రాగుడు, గంజాయివంటి అలవాటులు వీటివల్ల కలిగే ప్రమాదాలలో ఈ సంగతి తెలియజేయడం అవసరమే. కాని అతి లౌక్యంగా రహస్యంగా వైద్యానికి భంగం లేకుండా డాక్టరుకు తెలియజేయవలసి ఉంటుంది. డాక్టరు తెలుసుకోడంకూడా అల్లాగే చేయాలి. అరికాలు దురద పెడుతున్నదని రాత్రి పన్నెండు గంటలకు డాక్టర్ని లేవగొట్టేవారున్నారు. వారు ముఖ్యులయితే, డాక్టరు విధివిహీనుడైతే, తనతో అంతకన్నా అవసరమున్న వేరేరోగిని విడిచిపెట్టి పరిగెత్తడంజరుగుతుంది. మృత్యువుతో యుద్ధం చేయడం విడిచిపెట్టి "ఫరవాలేదు భయపడకండి" అని చెప్పడానికి కాలాన్ని వ్యర్థం చేయడం జరుగుతుంది.

ఇటువంటి పొరపాట్లు రోగులూ రోగి ఆత్మీయులూ చేయాలని చేయరు. అజ్ఞానం వల్ల కలిగిన ఆందోళనతో ప్రాణభీతితో చేస్తారు. ఈమధ్య వైద్య విషయాలనుగురించి తెలుసుకోవలెననే అభిలాష చాలామందిలో ఏర్పడింది. దానికి ఫలితంగా వార్తా పత్రికల్లో కొత్త మందుల్ని గురించిన వార్తలు తరచూ పడుతుంటవి. ఘరానా ఉన్న కంపెనీలుకూడా వృత్తిధర్మమును విడిచిపెట్టి, ఉబ్బసానికి పనికివచ్చే దగ్గుమందులను అన్ని దగ్గులకు దివ్యౌషధం అని ప్రచురణ చేయడం జరుగుతున్నది. తమాషా ఏమిటంటే, వార్తా పత్రికల్లో గొప్పవారి మరణవార్తలలో, టైఫాయిడ్ జ్వరం, టెటనస్ లాంటి వ్యాధులతో చచ్చిపోయినప్పుడు మరణ కారణం చెప్పరు. కాని గుండె జబ్బుతో మరణించినప్పుడు మాత్రం, ఆ సంగతి వివరాలతోసహా ప్రచురిస్తారు. గుండె జబ్బు తమకున్నదనే భ్రమతో బాధపడేవారు యీ వార్త చదవంగానే గుండెలో దడపుట్టి డాక్టరుదగ్గరకు వెళ్ళి, లేవగొట్టి ఆ [illegible] హడావుడిచేయడం జరుగుతున్నది. ముఖ్యంగా హృద్రోగం, క్షయవ్యాధులను గురించిన భీతి విపరీతంగా పెరిగిపోతోంది?

అనేక శాస్త్రాల్లో పారంగతులైనవారికి కూడా తమ శరీరాన్ని గురించి కించిత్తుకూడా తెలియకపోవడం యీ దేశంలో అసాధారణం కాదు. మన ప్రాథమిక విద్యలో, శరీర ధర్మ విజ్ఞానం విధిగా లేకపోవడం, ఆ విషయంలో కావలసిన కనీస విజ్ఞానం ప్రజానీకానికి లేకపోవడం, రోగుల బాధలనూ డాక్టర్ల బాధలనూకూడా అధికం చేస్తున్నవి. ఇతర దేశాలలో ఈ విజ్ఞానం సాధారణ మానవులందరికీ ఉంటుంది. అందుకని శాస్త్రజ్ఞులు ప్రజలకు తెలియవలసిన విషయాలను చెప్పడం తేలికగా ఉంటుంది. పచ్చకామెర్లలో లివరో, లివరు నుంచిపోయే పసరు నాళమో వాచి కొవ్వులు జీర్ణంకాక, వాటివల్ల హాని కలగడం జరుగుతుంది. డాక్టరు వచ్చి "కొవ్వు పదార్థాలు లేని ఆహారం పెట్టండి" అని వెళ్ళిపోతాడు. అప్పటికి ఇంట్లోవాళ్ళు తల వూపేస్తారు. రాత్రి పది గంటలకు "నిమ్మకాయబద్ద నంజుకోవాలంటున్నాడు పెట్టమంటారా?" అని ఫోన్ చేస్తారు. జాలీ, కోపం, నవ్వుకూడా కలుగుతవి. కాని ఆ తప్పు వారిది కాదని తోచంగానే, వీలున్నంతవరకు తినదగిన పదార్థాల లిస్టు చెప్పెయ్యడం జరుగుతుంది. అయినా అన్నింటి పేర్లూ చెప్పడం సాధ్యంగాదు గదా? మామూలుగా ఉన్నప్పుడు దేనిమీదా వాంఛలేని మానవుడికి రోగి కాంగానే ఎక్కడలేని జిహ్వాచాపల్యము – ముఖ్యంగా తినగూడని వస్తువులమీద చాపల్యమూ – ఏర్పడుతుంది. ఒకటొకటే అడగడం జరుగుతుంది. ప్రజలకు కొద్దిగా శరీరధర్మ విజ్ఞానం ఆహారవిజ్ఞానం విధిగా తెలిసివుంటే ఈనాడు ఆరోగ్య సమస్య ఆహార సమస్యకూడా యింత సంక్లిష్టంగా తయారయ్యేవి కావు. ముఖ్యంగా మనదేశంలో వున్న దురభిప్రాయాలు అజ్ఞానం దుఃఖస్రోతాలుగావున్నవి. "ఈ వస్తువు చలవ, ఆ వస్తువు వేడి. జ్వరం వచ్చినవాడికి చల్లబోసి పెడితే చలవలుకమ్ముతవి. అన్నం తిని నిద్రపోతే ప్రమాదం, కుండలో వండినఅన్నం చలవ, గిన్నెలోవండింది వేడి. ఎలెక్ట్రిక్ హీటరుమీద వండిన అన్నంతింటే కళ్ళ జబ్బు వస్తుంది." ఇల్లా

డాక్టర్
గాలి బాలసుందరరావు

ఎన్నో దురభిప్రాయాలున్నవి. వీటివల్ల, డాక్టరు ఒక ఆహారం యివ్వమని చెబితే, అది తమదృష్టిలో ప్రమాదకరమని తోస్తే, అది యివ్వక, ఇచ్చేమని అబద్ధాలు చెప్పేవారున్నారు. అల్లాగే డిన్నరుకు వెళ్ళి లడ్డూలూ గుల్లాబ్‌జాంలూ తిని అతి సీరియస్‌గా "నాకు కాఫీ పంచదారలేకుండా తెచ్చి పెట్టండి" అనే మధుమేహరోగులున్నారు. పిల్ల రజస్వల అయితే కందికట్టు నీళ్ళిచ్చి మాడ్చేవాళ్ళున్నారు. నెమోన్యా వచ్చి రోగిగాలి అందక చస్తుంటే కిటికీ తలుపులు బంధించేవారున్నారు. ఇల్లా చెప్పాలంటే యెన్నో వున్నవి. అయితే ఈ అజ్ఞానానికి కేవలము ప్రజలను నిందించడం అన్యాయం. ఇందుకు కొంతవరకు కొంతమంది డాక్టర్లుకూడా బాధ్యులే, వైద్యవిజ్ఞానం ఆ నాటి కానాడు విపరీతంగా పెరిగిపోతున్నది. రోగం విషయంలో, మందుల విషయంలో,

మనమూ మనదేహస్థితి


ఒక దశాబ్దం క్రిందవున్న అభిప్రాయాలలో అనేకం యీనాడులేవు. అల్లాగే ఆహార విషయంలోకూడా! అనేక సాంక్రామిక రోగముల విషయంలో, అంటువ్యాధుల విషయంలో, ఎన్నో సత్యాలు బయటబడి, వైద్య శాస్త్రజ్ఞుల అభిప్రాయాలే మారిపోతున్నవి. కొన్ని మందులు విసర్జించబడ్డవి. కొన్ని సంజీవులని విశ్వసించే మందులు ప్రాణాలు తీస్తున్నవి. తమరు చదువుకున్న నాటి అభిప్రాయాలే యీనాటికి కొందరు డాక్టర్లు ప్రజల్లో వ్యాపింపజేస్తున్నారు. ఒకమాటు విర్పడ్డ అభిప్రాయం సాధారణగా రోగిలో నుంచి పోదు. ఒకమాటు ఒక డాక్టరులో విశ్వాసం పోగొట్టుకున్న రోగిని ఆ తర్వాత ట్రీట్ చేయవలసిన డాక్టరు స్థితి చాలా దయనీయమైందిగా వుంటుంది.

ఈనాడు అన్ని విజ్ఞానములు యింతగా వర్ధిల్లినా, ప్రాణరక్షకహేతువైన వైద్య విజ్ఞానం ఇతర విజ్ఞానాలతో, పోల్చిచూస్తే చాలా తక్కువగా అభివృద్ధి చెందినదనే చెప్పాలి. ఇందులోనూ శస్త్రచికిత్సలో జరిగిన ప్రగతి ఔషధశాస్త్రంలో జరగలేదు. వైద్యశాస్త్రమే సర్వసంపూర్ణం కాదు. రోగవిజ్ఞానమూ పరిపూర్ణమయిందికాదు. పరిశోధనలు విపరీతంగా జరుగుతున్నవి. అభిప్రాయాలు మారిపోతున్నవి. మానవుడికి తెలిసిన రోగవిజ్ఞానం రోగాలతో పోల్చిచూస్తే అత్యల్పంగా కనిపిస్తుంది. ఆ విజ్ఞానంలో సాధారణంగా వైద్య వృత్తితో జీవించే వైద్యులకు తెలిసింది చాలా స్వల్పం. ప్రత్యేక నైపుణ్యం (Sp cialigation) అధికమౌతున్నది. కొంతమంది నిపుణులకు తమ సబ్జెక్టు తప్పయిందీ జ్ఞాపకం వుండదు. కాని సాధారణ ప్రజానీకానికి యీ విషయాలు తెలియవు. డాక్టరు సిసలయిన డాక్టరయితే రోగాన్ని నాలుగు ఇంచ్చులతో లాగి అవతల పారేస్తాడనీ అల్లా అతను చేయలేకపోతే అది అతని తెలివి తక్కువగాని శాస్త్రంలోటు కాదనీ ఖండితంగా విశ్వసించే వారున్నారు. వైద్యుల అపజయాన్ని కర్మకు ఆరోపించి వేదాంతభావంతో బాధను అనుభవిస్తూ ఆపదను విస్మరిస్తూ తమ ఖర్మను నిందించుకునే పుణ్యాత్ములూ అన్నారు.

(1) ఎప్పుడు డాక్టర్ని పిలవాలి? (2) డాక్టరు వచ్చేదాకా ఏం చెయ్యాలి? (3) ఆయన వచ్చివెళ్ళిన తరవాత రోగి కోలుకుంటానికి మనం ఏమేమి చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానం రోగవిజ్ఞానం వుంటేనే గాని రాదు. రోగవిజ్ఞానం వైద్యవిజ్ఞానం కాదు. అతి తాత్కాలికమైన బాధలకు తాత్కాలిక చికిత్స చేసుకోడం వైద్యవిజ్ఞాన మనిపించుకోదు: అది వైద్య విజ్ఞానమైతే అది ప్రతివారికి తెలిసివుండాలి. తాత్కాలిక ప్రమాదాల్లో ఇది అత్యవసర మౌతుంది. ప్రమాదం జరిగేక డాక్టరు వచ్చేలోగా ఉన్న అపాయం విషమించకుండా అనవసరమూ ప్రమాదకరణమూ అయిన పిచ్చి చికిత్సలు జరగకుండా చూడటం అత్యవసరం.

డాక్టరు, వైద్యవిజ్ఞానం పొందడానికి ప్రత్యేకమయిన మెదడుతో భగవంతుడు సృష్టించిన దేవతామూర్తి కాదు. అతనూ ఒక మనిషే. కృషివల్ల, తెలిసినవాడు. చెప్పడంవల్ల వైద్యులకా జ్ఞానం లభించింది. మామూలు తెలివితేటలు వున్న వారికందరికి కొంతవరకు ఆ విజ్ఞానం కళాశాలలు సహాయం లేకుండానే అందజేయడానికి వీలున్నది. అల్లా అందజేయడం అవసరమని కూడా నా నమ్మకం.

వచ్చేవారం అందరికి నిత్యము అవసరమయిన ఆహారాన్ని జీర్ణంచేసి పెట్టే జీర్ణకోశ బాధ్యులను గురించి వ్రాస్తాను. ★



భారతదేశంలో ఇండోనేషియా రాయబారిగా నియమితులైన లాదన్ సూకార్దో మొన్న 18వ ప్రధాని నెహ్రూను దర్శించారు.

న్యూఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణ

కాశ్మీర్ సమస్య పరిష్కారం

ప్రధాని ప్రకటనలో ఆంతర్యం: బొగ్గు కొరత తీరుతుందా?

ప్రధాన మంత్రి న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. పూర్వం రాజప్రతినిధి వచ్చినప్పుడల్లా, బిరుదులు గలవారు బిరుదుల కోసం తాపత్రయపడేవారు ఎదురేగి స్వాగతం చెప్పేవారు. స్వాతంత్ర్యం సిద్ధించినా, ప్రజల వైఖరిలో పెద్ద మార్పేమీ రాలేదు. నేటి ఉదయం ప్రధానికి తమ మంత్రివర్గ సహచరులు, తదితరులు పాలం విమానాశ్రయంలో స్వాగతమిచ్చారు. స్వదేశీ, విదేశీ అధికారులెవరైనాసరే, వస్తున్నప్పుడు, వెడుతున్నప్పుడు విమానాశ్రయంలో హాజరై ఉండటమే తమ వృత్తిగా చేసుకున్నారు వీరిలో కొందరు. సమితి సమావేశంలో ప్రధానమంత్రి అనుసరించిన విధానం రాజనీతిజ్ఞతకు ఎంత ఉచితంగా ఉన్నదో తెల్పవలసిన బాధ్యత ఆయనతో సాన్నిహిత్యం కల ప్రతి దేశభక్తుని మీద ఉన్నది. దేశానికి శ్రీ కృష్ణమీనన్ చేస్తున్న మహత్తర సేవను విసుగు, విరామం లేకుండా పొగడవలసిన బాధ్యత ప్రధాన మంత్రిపై ఉన్నది. మహాత్మాగాంధీ హత్యానంతరం భారతదేశ పురోభివృద్ధి కొనసాగింది. శ్రీకృష్ణమీనన్ చేస్తున్న దేశసేవకు మానవుడే గాని, భగవంతుడే గాని అడ్డు తగిలి ఉంటే ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు.

శ్రీ నెహ్రూ న్యూయార్క్ నగరంలో టెలివిజన్‌లో మాట్లాడుతూ, "కాశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితిని తలక్రిందులు చేస్తే, అవాంఛనీయ పరిణామాలు కలుగుతాయి" అని చరిత్రాత్మకమైన ఒక ప్రకటన చేశారు. మరో విధంగా చెప్పాలంటే, పాకిస్తాన్ కంటెకు అటువైపున ఉండి, ఒక్కసారి అయినా తుపాకీ పని చెప్పకుండానే భారత ప్రధాని చేత "యథాస్థితి"ని గుర్తింపజేసిందని అనాలి. పాకిస్తాన్ దురాక్రమణను తొలగించాలని శ్రీ కృష్ణమీనన్ వాదించటం నిరర్థకం.

భారతీయ ముస్లిమ్, తోటి హిందువుకంటే, ముఖ్యంగా కాంగ్రెసు వాదికంటే, రాజకీయ చతురుడని గత 25 సంవత్సరాల చరిత్ర నిరూపించింది. స్వర్గీయ మహమ్మదాలీ జిన్నా 14 అంశాలుగల ఒక ప్రణాళికను ఆమోదించమని కోరారు. దానికి ప్రతిగా కాంగ్రెసు దేశాన్ని విభజించింది. కాశ్మీ

(62-వ పేజీ చూడండి)



ఉద్యోగ మహాత్మ్యం

వేమూరి సుబ్రహ్మణ్యం

సీతాపతి మధ్యాహ్నం కాఫీ పూర్తి చేసుకొని వచ్చి సీటులో కూర్చోగానే ప్యూను వచ్చి "పి. ఎ. గారు పిలుస్తున్నారండీ" అని చెప్పి దగ్గరవుండి వెంటపెట్టుకు రమ్మన్నట్టుగా అక్కడే నిల్చున్నాడు. సీతాపతి తనకీ ఆహ్వానం ఎప్పుడొస్తుందా అని పొద్దుట నుంచి ఎదురు చూస్తున్నాడు. అందుచేత వెంటనే బయలుదేరాడు.

సీతాపతి వెడుతుంటే తక్కిన గుమాస్తాలు అతడివైపు జాలిగా చూశారు. "పాపం! పొద్దునే జాయినయ్యాడు. అప్పుడే పి. ఎ. గారి తాఖీదు! ఈ పి. ఎ. గారికి ప్రతివాళ్ళని పిలిచి వాలుగేసి అక్షింతలు వేయందే తోచదు కాబోలు...."

"అట్లా ఎందుకనుకోవాలండీ? యితను కొత్తగా వచ్చాడుగా. అందుచేత యూ

ఆఫీసులో పద్ధతులు, చేయవలసిన పనులు అంతా చెబుతాడేమో..."

"ఆఁ! నా ముఖం. అసలు పనులు ఆయనకు తెలుస్తేనా, యింకొకళ్ళకు చెప్పటానికి. ప్రతివాళ్ళనీ చెడా మడా నాలుగు తిట్లేస్తే అందరూ తనంటే భయంతో వణికి పోతారని ఆయనకో నమ్మకం. అంతేకాని ఆయనంటే అందరికీ అసహ్యం ఏర్పడిందని తెలియదు. పాపం."

"యిప్పుడితడ్ని పిలిపించి, కాఫీకెళ్ళి యింతసేపు ఆలస్యం చేశావెందుకని, ఏదో కారణం పెట్టి నాలుగు దులిపేస్తాడు. యితడికి ఆయనంటే భయం ఏర్పడుతుంది అదేగా...."

"ఉష్. మేనేజ రొస్తున్నాడు...."

అందరు హడావిడిగా ఫైల్స్‌లో మునిగి పోయి, ప్రభుత్వ యంత్రాంగాన్ని యథావిధిగా నడిపించటానికి యథావిధిగా పాటు పడటం మొదలెట్టారు.

అసలు వాళ్ళనుకున్నదానికి యథార్థం పూరిగా విరుద్ధమని వాళ్ళకు తెలియదు పాపం! సీతాపతికి పి. ఎ. గారికి దూరపు చుట్టరికముంది. సీతాపతిని యిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయగానే అతడి నాన్న గారు పి. ఎ. గారికి ఉత్తరం రాశారు. కొడుకుని కొంచెం కనిపెట్టివుండమని. సీతాపతి పొద్దున వచ్చి యిక్కడ డ్యూటీలో చేరినప్పుడు, పి. ఎ. గారు లేరు. సీతాపతి కాఫీకెళ్ళగానే ఆయన కారులో దిగారు. సీతాపతిరాగానే పిలిపించారు.

సీతాపతి స్ప్రింగ్ డోర్ నెట్టుకుని లోపలికి అడుగుపెట్టగానే ఏవో కాగితాలు చూస్తున్న పి. ఎ గారు తలెత్తి "రా. ఇటు కూర్చో" అన్నాడు. ఇదివరకు బాంధవ్య రీత్యా ఎన్ని సార్లు ఆయన్ను చూసినా, ఇప్పుడీ అధికారహోదాతో చూడగానే సీతాపతి తనకు తెలియకుండానే చేతులు జోడించి "నమస్కారమండీ" అన్నాడు.

"కూర్చో."

పి. ఎ. గారి గదిలో సీతాపతికి జరిగిన మర్యాద చూస్తుంటే ప్యూనుకు మతిపోయి నట్టుంది....

పి. ఎ గారు తలెత్తిచూశారు. సీతాపతి ఇంకా నిలబడే వున్నాడు. "కూర్చోవయ్యా పరవాలేదు". స్వరంలో అధికారం ప్రతిధ్వనించింది.

సీతాపతి కూర్చున్నాడు.

"నాన్న వాళ్ళూ కులాసాగా వున్నారు కదూ?"

"కులాసాగానే వున్నారండీ."

"ఎక్కడ దిగావు? సరాసరి ఇంటికి రాక పోయావా?"

"ఇల్లు తెలియదు కదండీ. అదీకాక నా స్నేహితుడు స్టేషను కొచ్చి వాళ్ళ రూముకు తీసికెళ్ళాడు."

"అట్లాగా...అన్నట్టు నీకు పెళ్ళయింది కదూ? మరి కాపురం పెట్టవూ?"

"ఏదో ఇల్లు చూసి..."

"అవునులే...రాములూ" అని ప్యూనుని పిలిచారాయన. ఆశ్చర్య సాగరంలోంచి ఒక్క ఉదుటున బయటపడి "బాబూ" అంటూ లోపలికొచ్చాడు.

"మేనేజరుగారిని పిల్చుకురా."

రాములు వెళ్ళి మేనేజరుగారితో తిరి గొచ్చాడు. పి. ఎ. గారి ఎదురుగా సీతాపతి కూర్చుని వుండటం చూసి పి. ఎ గారికి మతి భ్రమించిందా, లేకపోతే సీతాపతికి మర్యాద తెలియదా, లేకపోతే ఇదేమయినా కనికట్టా అని ఆశ్చర్యపోతూ మేనేజరు "నన్ను పిలిచారట..." అని నసిగాడు.

"అవునండి కూర్చోండి......ఇతడు మా అన్నగారి కొడుకు. కొంచెం శ్రద్ధగా పని నేర్పండి. మంచి గ్రాస్పింగ్ పవర్ వుంది లెండి. ఒకసారి చెబితే గ్రహించు కొంటాడు."

"అట్లాగే నండీ."

"ఇతనికి 'డి' సీటు ఇచ్చారు కదూ? అందులోంచి పే బిల్స్ తీసేసి 'ఎఫ్' సీటు కిచ్చెయ్యండి."

"అట్లాగే నండి" అని మేనేజరు లేచాడు. సీతాపతికూడ వెళ్ళటానికి లేచాడు.

"సీతాపతీ! సాయంత్రం యింటికిరా. రాములూ సీతాపతిని యింటికి తీసుకు రారా...మీ పిన్ని నిన్ను తీసుకురమ్మని స్పెషల్‌గా చెప్పిందోయ్. మర్చిపోకు" అన్నారు పి. ఎ. గారు.

"అట్లాగేనండి" అని చెప్పి మేనేజరు గారితో సహా బయటపడ్డాడు సీతాపతి. మేనేజరు సీతాపతిని తనగదిలోకి తీసుకెళ్ళి "అటు కూర్చో సీతాపతీ" అని కుర్చీ చూపించాడు.

సీతాపతికి యిప్పటికే మనస్సులో కొంచెం గర్వం కలిగింది. పి. ఎ. గారు తనకు దూరపు చుట్టమేగాని యింతలా తనను ఆదరిస్తాడని అనుకోలేదు. స్వంత అన్నగారి కొడుకులాగా ఆదరించాడు తనను. యిక యీ ఆఫీసులో తనొక యువరాజు...అందుచేతనే మేనేజరుగారు కుర్చీలో కూర్చోమనగానే నిస్సంకోచంగా కూర్చున్నాడు.

"పి. ఎ. గారు మీ బంధువులా? ఆసంగతి పొద్దున చెప్పలేదేం సీతాపతీ?"

సీతాపతి కొద్దిగా నవ్వి వూరుకొన్నాడు.

"మీవూళ్ళో యిద్దరిళ్ళూ ఒకేచోట వున్నాయా? ఆయన నీకు చిన్నప్పటినుంచీ తెలుసా?"

"బాగా తెలుసండీ. మా నాన్నగారూ యీయనా స్వంత అన్నదమ్ముల్లాగా వుంటారు" అన్నాడు సీతాపతి. పట్టి అబద్ధం. యిద్దరికీ దూరపు చుట్టరికమే, అదీ ఎప్పుడయినా బజారులో కనబడితే 'ఒహో' అంటే 'ఒహో' అనుకోవటమే. అంతే. సీతాపతి, హుషారులో ఒక చిన్న కోత కోశాడు.

సీతాపతి పి. ఎ. గారి బంధువనీ, అతడికి పి. ఎ. గారి గదిలో జరిగిన మర్యాదా, ప్యూను రాములుద్వారా సుమారుగా అందరికీ



తెలిసింది. వాళ్ళలో, ఒకచిన్న కలకలం బయలుదేరింది. 'యికనించి సీతాపతితో స్నేహంచేస్తే లాభమని' కొందరూ, 'యింతకుముందు సీతాపతి ఎదుట పి. ఎ. ను గురించి చెడుగా ఏమీ చెప్పలేదుకదా కొంపతీసి' అని మరికొందరు తర్జన భర్జన పడుతున్నారు.

ఇంతలో సీతాపతి మెల్లిగా, దర్జాగా, హాలులో ప్రవేశించి తన సీటులో కూర్చుని, ఆరోజు తన కిచ్చిన 'కరెంట్స్' తీసి చదవటం మొదలుపెట్టాడు.

గుమాస్తాలలో ఒకరికి బ్రహ్మాండమయిన ఆలోచన ఒకటి తట్టింది. వెంటనే అతడు తన సీటులోంచి లేచి ప్రక్కవాడి సీటుదగ్గరికి చేరాడు. "ఏవోయ్ మన పి. ఎ. గారి 'రెలెటివ్'కు ఒక చిన్నపార్టీ ఏర్పాటుచేస్తే బాగుంటుందికదూ ?" అన్నాడు.

"ఫస్టుగా వుంటుంది. ఆర్గనైజు చెయ్యి".

అతడు హుషారుగా హాలంతా ఎడపెడా తిరిగేసి అందరితో చెప్పి, ఒప్పించి, ఒక్కొక్కరి దగ్గరా అర్ధరూపాయి వసూలుచేసి, ఎవరిదగ్గరయినా లేకపోతే తనే అప్పుయిచ్చి, డబ్బు పోగుచేసి వెళ్లి మేనేజరుతో చెప్పాడు.

"నీ అయిడియా బ్రహ్మాండంగావుంది. కానీయ్" అన్నాడు మేనేజరు.

"మరి పి. ఎ. గారినీ పిలుద్దామా సార్."

"బాగుండదోయ్. మనమే చేసుకొందాం."

"అట్లాగేనండి. యిప్పుడే యిద్దరు ప్యూన్లను హోటలుకు పంపిస్తాను."

"అట్లాగే లే" అని నవ్వాడు మేనేజరు. యితడింత కష్టపడి యిదంతా ఎందుకు చేస్తున్నాడో మేనేజరు పసిగట్టాడు. యీరకంగానయినా పి.ఎ. గారి దృష్టిలో పడితే రోజుకో సారి అనవాయితీగా లభించే చీవాట్లు కొంచెం తగ్గుతాయేమోనని అతడి తాపత్రయం!...

తవరాక సందర్భంగా తనకు పార్టీ యిస్తున్నారని సీతాపతికి తెలిసింది. అతడికి, తనకు తెలియకుండానే, శరీరమంతా గర్వంతో నిండిపోయింది.

పార్టీ ఏర్పాటు చేసిన వెంకట్రావు వచ్చి చెప్పినపుడు, పెద్దరాజకీయ నాయకుడి పోజుపెట్టి విరక్తి ప్రకటిస్తూ "యివన్నీ ఎందుకండీ ?" అన్నాడు.

వెంకట్రావుకు వళ్లుమండింది. 'యిదంతా యితడి 'క్వాలిఫికేషన్' అనుకొంటున్నాడు పాపం!' అని లోపల అనుకొని "ఏదో సరదాగా చేసుకొందామండీ. మేనేజరూ వస్తామన్నారు" అన్నాడు.

సాయంత్రం పార్టీజరిగింది. అందరూ సీతాపతి ఆయురారోగ్య అభ్యున్నతులను కోరుతూ, టిఫిన్ తిని కాఫీతాగారు. ఆఖరున మేనేజరుగారు రెండుముక్కలు చెప్పారు. సీతాపతి సీటు చాలా ముఖ్యమయిందనీ, అతడికి పని తెలియకపోతే తనున్నాననీ యింకా సీనియర్ గుమాస్తాలున్నారని,

బంగారుపంజరం

వారినడిగి తెలుసుకొని సీటులో పని ఎప్పటికప్పుడు పూర్తిచేస్తాడని ఆశిస్తున్నానని ముగించారు.

సీతాపతి గదికి వెళ్ళి, స్నానంచేసి గుడ్డలు మార్చుకొని ఆఫీసులో తెలుసుకొన్న అడ్రసుప్రకారం పి. ఎ. గారింటికి బయలుదేరాడు. అతడిస్నేహితుడు సంగతి తెలుసుకొని "సీతాపతీ నామాట ఒక్కటి వింటావా ? ఆయన నువ్వు దగ్గరబంధువులు కారు. ఆయనేమో ఆఫీసరు. ఆ ఆఫీసులో నువు గుమాస్తావి. అంతగా పూసుకు తిరగటం మంచిది కాదేమో ?" అన్నాడు.

"యిందులో పూసుకు తిరగటానికేముందిగా ?..."

> మొదటివాడు — చాలా ఇబ్బందిగా ఉందిరా, బ్రదర్. ఓ పదిరూపాయలు ఉంటే సర్దు. నీకు ఆ జన్మాంతమూ ఋణపడి ఉంటాను.
>
> రెండవవాడు — నిజం చెప్పొద్దూ? నాభయం కూడా అదే.
>
> —అవ్వారు అనసూయ (దుర్గాపూర్)

"అవుననుకో. ఎందుకయినా మంచిది నేను చెప్పింది గుర్తుంచుకో."

"ఫరవాలేదులేరా! యీయన అటువంటి వాడుకాదు. నన్ను ఎంత అభిమానంగా ఆదరించాడనీ ఆయనకు బంధువులంటే మొదటినుంచీ అదోరకమయిన అభిమానం."

సీతాపతి పి. ఎ. గారింటికి చేరుకొనేసరికి ఏడున్నరయింది.

సీతాపతిని గుమ్మంలో చూడగానే ప్యూను "అయ్యగారు అరగంటనుంచీ మీకోసరం ఎదురుచూస్తున్నారు, పదండి" అన్నాడు.

సీతాపతిని చూడగానే పి. ఎ. గారు "ఏడింటికల్లా వస్తావని అరగంట ఆలస్యం చేశావేమోయ్. పంక్చ్యువాలిటీ మెయిన్ టెయిన్ చెయ్యటం నేర్చుకోవాలి" అన్నారు.

"నేను ఏడని చెప్పలేదండీ."

"పైగా యిదొకటి! చెప్పకపోతే నేను అబద్దం ఆడుతున్నానంటావా? పద. పద."

యింట్లోవాళ్లందరూ సీతాపతిని పలుకరించారు. పి.ఎ.గారికి యిద్దరుకొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. కొడుకుల్లో పెద్దవాడికి పాతికేళ్లున్నా, మనిషి అదోరకమయిన వ్యాధితో వంగిపోయి, సరిగా కళ్ళయినా కనబడక, జుట్టంతా నెరిసిపోయి, పుల్లలాంటి శరీరంతో వుంటాడు. రెండో కొడుకు శంకర్రావు బి. ఎ. చదువుతున్నాడు. యిద్దరు కూతుళ్ళు పెళ్ళిళ్ళయిపోయి అత్తవారింటి కెళ్లారు. ఆఖరికూతురు స్కూలుఫైనలు చదువుతోంది.

భోజనాల దగ్గర పి. ఎ. గారి భార్య సరస్వతి "ఏమండీ, యితనూ వాళ్లావిడ మన యింటి వెనక గదుల్లో వుంటారు. అవి మనకు ఎక్కువగావుపయోగించటం లేదుగా? పైగా అందరం కలిసి వున్నట్టుగానూ వుంటుంది. ఏమంటారు" అన్నది.

"అవునోయ్ సీతాపతీ! ఏమంటావ్ ?"

సీతాపతి ఏమనగలడు? మౌనం వహించాడు.

"అంతేనోయ్. మీ పిన్ని చెప్పిన ప్లాను బాగుంది. నువ్వు యింటికోసరం వూరంతా తిరిగి వెతక నక్కరలేదు. అందరూ కలిసివుండొచ్చు. అద్దె కింద ఏదో యిరవై రూపాయలు యిద్దుగానివిలే."

సీతాపతి 'అట్లాగే' అన్నట్టు తలవూపాడు.

సీతాపతి పి. ఎ. గారింట్లోనే వుండబోతున్నాడనే వార్త ప్యూను ద్వారా ఆఫీసులో పాక్కింది. యింకేముంది? యితడి అంతస్తు మరో మెట్టు పెరిగింది. సీతాపతిని అందరూ పి. ఎ. గారి పి. ఎ. గా భావించటం సాగించారు.

తను అందరికంటే గొప్పవాడయినట్లూ, తనలో ఏదో ప్రత్యేకత వున్నట్టూ భావించుకొని సీతాపతి సంతోషసాగరంలో మునిగి తేలుతున్నాడు. తన మామగారికి, భార్యను వెంటనే పంపమని వుత్తరంలో రాసేశాడు. మూడో నాటికల్లా అతడిభార్య కమల, సామానుతో సహా వచ్చేసింది. సీతాపతి పి. ఎ. గారింటివెనుక భాగంలో కాపురం పెట్టేశాడు.

* * *

పదిన్నరకు యింటి దగ్గిర భోజనంచేసి బయలుదేరి సీతాపతి ఆఫీసుకు చేరుకొనేసరికి పదకొండయింది. వెళ్ళి సీటులో కూర్చోగానే ప్యూనువచ్చి "మేనేజరుగారు పిలుస్తున్నారండీ" అని చెప్పాడు.

"యిప్పుడే వచ్చానో లేదో అప్పుడే పిలుపులు" అని కొంచెం గట్టిగానే విసుక్కుంటూ బయలుదేరాడు.

మేనేజరు సీతాపతిని చూడగానే ఒక టెలిగ్రాం అందించి "ఏమండీ యీ ఫైలు మీద గవర్నమెంటుకు రిపోర్టు రాయలేదూ" అని అడిగాడు.

సీతాపతి టెలిగ్రాం అందుకొని "చూసి చెబుతానండి" అని తనసీటు కొచ్చి ఆ ఫైలు దాదికి పట్టికెళ్లి "పంపించలేదండి. యిదెట్లా రాయాలో తెలియక వూరుకొన్నాను" అన్నాడు.

"అదేమిటండీ! తెలియకపోతే నన్నడిగితే చెప్పనా? ఆ ఫైలిట్లా యివ్వండి నేనే రాసేస్తాను" అని మేనేజరు ఫైలు తీసుకొన్నాడు. అదే మరే గుమాస్తా అయినా యిట్లా చేసివుంటే అతడికి ఆరోజు అన్నం నీళ్ళు సహించనంతగా చీవాట్లు సంప్రాప్తించి వుండేవి.

పి. ఎ. గారితో తనకు గల బంధుత్వం సన్నిహిత్వం తలచుకొని మురిసిపోతూ, సగర్వంగా వచ్చి సీటులో కూర్చున్నాడు సీతాపతి.

ఆ సాయంత్రం యింటికెళ్ళేసరికి కమల యింకా వంటచేస్తూనే వుంది. రోజూ తాను వచ్చేసరికి వంట పూర్తి చేసుకొని కూర్చునేది. సీతాపతి కారణం అడక్కముందే కమల చెప్పింది: "ఎంత ఆఫీసరుగారి పెళ్ళాం పిల్లలయితే మటుకు కొంచెం మంచి మర్యాద వుండక్కర్లేదుటండీ?"

"ఏం? ఏమైంది?"

"యివ్వాళ శుక్రవారమా? దీపారాధన చేయందే నేను వంటచేయనా? ఆసంగతి వాళ్ళకు ముందే చెప్పాను. అయినా సాయంత్రమయ్యేసరికి మీ పిన్నిగారూ, పిల్లలూ స్నానాలు మొదలు. ఖర్మ! వున్నది ఒక్కటే బాత్‌రూమయిపోయింది. వాళ్ళ స్నానాలు పూర్తయ్యేసరికి రెండుగంటలకు పైగా పట్టింది."

"ఏదో పోనీలేవే సర్దుకుపోవాలి, యిప్పుడు ఏం మునిగిపోయింది. మెల్లిగా వంట కానీయి."

"అది కాదండీ మొన్న నేమయిందను కొన్నారూ, వీళ్ళింటికెవరో వచ్చారు. యిక ఆవిడగారి గొప్పలు పనితీరాలి. మనం యిబ్బంది పడిపోతామేమోనని తనకు యిరుకైనా యీ రెండుగదులు మనకిచ్చారుట. యిక ఆయనగారేమో మీకు పని చేత కాకపోయినా అన్నీ సర్దుకుపోతున్నారుట. యిక వాళ్ళబ్బాయిని తన బొందిలో ప్రాణం వుండగా గుమాస్తాగిరి చేయనివ్వదుట. గుమాస్తా చేస్తూ మనం పడే యిబ్బందులు చూస్తుంటే ఆవిడగారికి పాపం, ఎంతో జాలిట. యింకా యిట్లా ఏదేదో ప్రతిదీ మనతో పోల్చి గొప్ప చెబుతూ అరగంట వాగింది. కోపం వచ్చి ఎడాపెడా రెండూ పెడదామనుకొన్నాను. కాని మీరు ఆయన ఆఫీసులోనే పని చేస్తున్నారు. అందుకని వూరుకొన్నాను. విసుగు పుట్టి యింటికొచ్చి తలుపేసుకొన్నాను."

"నే చెప్పానుకదూ? అన్నిటికి చూసీ చూడనట్లువూరుకోవడమే. నేను అట్లా క్లబ్బుకెళ్ళి టేబుల్ టెన్నిసు ఆడి యింకో గంటలో వస్తాను" అని సీతాపతి బయలుదేరాడు. యింతలో పి. ఎ. గారి రెండో కొడుకు శంకర్రావు ఎదురొచ్చి "అన్నయ్యా అట్లా బజారుదాకా పోదాం రా" అన్నాడు.


"క్లబ్బుకు వెళుతున్నాను శంకరం! టేబుల్ టెన్నిస్ ఆడుకోవాలి."

"కాదులే అన్నయ్యా బజారుకెళ్ళి వద్దాం రా, కొంచెం పని వుంది."

"పనుంటే నేనెందుకు! క్లబ్బుకొస్తానని ఒక ఫ్రెండుకు మాటయిచ్చాను."

"అయితే నువు రావన్నమాటేనా?" శంకర్రావు కంఠంలో కొంచెం ఆఫీసరుగారి కొడుకులో వుండే అధికారం ప్రతిధ్వనించింది.

సీతాపతి ఏదో జవాబు చెప్పేటంతలో దేవుడిగదిలోంచి పి. ఎ. గారు కొడుకు నుద్దేశించి కొంచెం గట్టిగా "శంకరం. వెళ్ళేవాడివి వెళ్ళరాదూ! అతడిని బలవంతం చేయటం ఎందుకు?" అన్నారు.



సీతాపతి వెంటనే "పద, శంకరం. బజారుకే వెళ్ళొద్దాం" అని బయలుదేరాడు. యిద్దరూ బజారునుంచి యింటికొచ్చేసరికి ఎనిమిదయింది. సీతాపతి యింట్లోకి వస్తూనే "ఇక జన్మలో ఎప్పుడూ పీడితో బజారు కెళ్ళకూడదు. దారిపొడుగునా వాళ్ళ గొప్పా, వాళ్ళ నాన్న గొప్పా చెప్పలేక చచ్చాడనుకో. అబ్బబ్బ వింటుంటే అసహ్యం వేసింది" అన్నాడు.

"మీరు ఒక్కసారికే అట్లా అంటున్నారే! మరి నేనూ రోజూ ఆవిడగారి అరిగిపోయిన గ్రామఫోను ప్లేటు గొడవ వినలేక ఎంతఅవస్థ పడుతున్నానో? ఒక్కరోజు తప్పించుకొందామని ఇంట్లోకెళ్ళి పడుకొన్నా పిల్చి మరీ తనసోది మొదలెడుతుంది" అన్నది కమల.

సీతాపతి ఏమీ మాటాడలేదు.

"అసలు బంధువుల ఇళ్ళలో ఉండనేకూడదండీ. అందులో ఆఫీసరుగారింట్లో, అసలు ఉండకూడదు. ఎక్కడున్నా ఇంకోయిల్లు చూడండీ."

"నీకేమన్నా మతిపోయిందా ఏమిటి? ఇప్పుడింకోయిల్లు చూసుకొని వెడితే ఇంకేమయినా వుందా? ఆయన మనస్సులో పెట్టుకుని ఏమయినా చేస్తాడు. ఎలాగో సర్దుకుపోవాలి."

"ఎంతకనండీ? మొన్న ఈఇంట్లో వుండటం వల్ల కొనాలంటే ప్యూనులచేత పని చేయించుకోవచ్చని మరిచిపోయ్యారా? మొన్న రాముల్ని బజారుకు పంపారా? ఆమధ్యాహ్నం ఎదురింటావిడతో ఈవిడ గొప్పలు చెప్పటం మొదలుపెట్టింది. ప్యూనులు వున్న సుఖం, వాళ్ళింట్లో వుండటంవల్లనే మనం పొందుతున్నాంట. ఒకటేమిటి. ఆవిడ రోజూ ఇదేరకమయిన వాగుడు వాగుతుంది."

మరునాడు పొద్దున సీతాపతి లేచి మొహం కడుక్కుంటున్నాడు. గంట ఏడున్నర అయివుంటుంది. పి. ఏ. గారు అప్పుడే పూజ అదీ ముగించుకుని సూర్యుడికి నమస్కారం చేయటంకోసం పెరట్లో కొచ్చాడు. వస్తూనే మొహం కడుక్కుంటున్న సీతాపతినిచూసి "ఇప్పుడే లేచావా? సీతాపతీ?" అన్నాడు.

"అవునండీ."

"రోజూ ఇదేవేళకు లేస్తుంటావా? ఏమిటి?"

"అంతేనండి. అయనకు మొదటినుంచీ ఇదే అలవాటు" అని లోపలనుంచి కమల జవాబు చెప్పింది.

"మాంచి అలవాటే. యీఇంట్లో అటువంటిది కుదరదు సీతాపతీ! అందరూ అయిదు గంటలకల్లా లేవాల్సిందే" అని ఆయన సూర్యుడికి నమస్కరించటంలో మునిగిపోయ్యాడు.

ఎదురుగా వున్న సీతాపతికి, లోపల కాఫీ

బంగారు పంజరం

కొస్తున్న కమలకు ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

కాఫీతాగి, నిన్నసాయంత్రం లైబ్రరీ నుంచి తెచ్చుకున్న కొత్తనవలను దీక్షగా చదువుతూ కూర్చున్నాడు సీతాపతి. ఇంతలో రాములొచ్చి "అయ్యగారు కొకసారి పిలుస్తున్నారండీ" అని చెప్పాడు.

ఎందుకో ననుకుంటూ పరధ్యానంగా పుస్తకంతోటే బయలుదేరాడు. గదిలో అడుగుపెట్టటంతోటే పి. ఏ. గారికి సీతాపతి చేతిలోని పుస్తకంపైనే కన్నుబడింది. "ఏమిటోయ్. పరీక్షకు చదువుతున్నావా ఏమిటి" అని చిరునవ్వుతో ప్రశ్నించారు.

"అబ్బే లేదండీ. యిది లైబ్రరీ పుస్తకం—"

"గ్లాసులో చేతులు కడగరాదు అని ఎందుకు వ్రాసిఉంచారండీ" అని ఒక పెద్దమనిషి హోటల్ యజమానినిఅడిగాడు.

"ఈ మధ్య అదే కాఫీ అని త్రాగేశారు కొద్దిమంది. అందుకని........" అన్నాడు ఆ హోటల్ యజమాని.

—మైనూరి నీలకంఠం (మద్రాసు)

"ఓహో! బాగుందా?"

"చాలా యింటెరెస్టుగా వుందండీ."

"నాకు తెలియక అడుగుతాను, యిటువంటివి చదవకపోతే ఏమిటి నష్టం? శుభ్రంగా పోయిన పార్టు కంప్లీటు చేసుకొని డిగ్రీ తెచ్చుకొంటే ఎవరయినా కాదంటారా? అసలు నువు నిద్రలేవటమే తెల్లగా తెల్లవారిన తరువాత. మా శంకరం చూడు. నాతో పాటే పొద్దునే లేస్తాడు. వాడి చదువేదో వాడి లోకమేదోగాని యిట్లా నవలలపిచ్చి, క్లబ్బులపిచ్చి వాడికిలేదు. యీ వయస్సులో చదువు ధ్యాసతప్ప మరేమీ వుండకూడదు. తెలిసిందా? యీక్లబ్బులూ, యీ టేబుల్ టెన్నీసులూ మనకు అన్నం పెడతాయోయ్? ఎప్పటికయినా చదువు, డిపార్టుమెంటు టెస్టులూ మనకి యింతఅన్నం పెడతాయి. అన్నట్లు బి. ఏ. పార్టు కంప్లీటు చేయటానికి చదువుతున్నావా?"

యీ వుపన్యాసంతో సీతాపతి ఒక్క చచ్చిపోయాడు. మెల్లిగా ఎలాగో "చదువుతున్నానండీ" అన్నాడు.

"ఏం చదువుతున్నావో, నాకేమీ కనిపించటంలేదు, నమ్మకమూ లేదు. పోనీ డిపార్టుమెంటు టెస్టులయినా చదివి ప్యాసుకా. యీ రకంగానయినా పైకిరావచ్చు, తెలిసిందా?"

"అట్లాగేనండి చదువుతాను."

"చదువుతానంటే కాదు. యీక్లబ్బులూ నవలలూ పూర్తిగా మానెయ్యాలి. ప్యాసయితే తప్ప లాభంలేదు అనే పట్టుదలతో చదవాలి. పట్టుదల వుండాలయ్యా దేనికయినా?... దగ్గిర పెద్దవాళ్ళు లేరు. చెప్పేవాళ్ళు లేక పోవటంమూలాన నీయిష్టం..."

మెత్తమెత్తగా చీవాట్లు తింటూ కూర్చున్నాడు సీతాపతి. తిరిగి ఏమయినా చెబుదామూ అంటే ఆఫీసరు. ఎంత బంధువయినా ఆఫీసరుహోదాలో చీవాట్లుపెడుతున్నాడు. ఏదయినా చెప్పబోతే ఆఫీసరుగానే తిడతాడుగూడా. ఆయనకోపం ఆఫీసులో చూస్తూనేవున్నాడు తను. గుమాస్తాలందరూ మేనేజరుతోసహా ఆయన పిలుస్తున్నాడంటే గుండె లరచేతుల్లో పెట్టుకు వెడతారు.

సీతాపతి మౌనంగానే కూర్చున్నాడు.

"ఆ! అన్నట్లు అసలువిషయం చెప్పటం మర్చిపోయాను. రాముల్ని తీసుకొని ఒక్కసారి బజారువెళ్ళి రావాలోయ్. చిన్న నసుగుతే లిస్టు యిస్తుంది. తీసుకువెళ్ళు. అసలు శంకరాన్ని పంపేవాడినేగాని వాడికి ఏదో అర్జంటునోట్సు రాసుకోవాలిట. పెద్దవాడు సరేసరి. ఎందుకు పనికిరాడు. వెళ్ళొస్తావు కదూ? ఒకగంట ఆలస్యంగా ఆఫీసుకొచ్చినా పరవాలేదులే. నేను మేనేజరుకు చెబుతాను. వెళ్ళిరా" అని ఆయన కాగితాల్లో మునిగిపోయ్యాడు. సీతాపతికి ఆయన్ను అమాంతం నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది కాని ఏం చేయగలడు?

ఆయన ఆఫీసరు!

తను ఏమీ చేతకాని, చేయలేని చచ్చు గుమాస్తా!!

చటుక్కున కుర్చీలోంచి లేచి చకచకా బయటికొచ్చి ఒక్కవిసురులో యింట్లోకొచ్చి పడ్డాడు. ఆయనింట్లోకి బజారునుంచి సామానులు నేను తేవాలిట. ఛీ! ఛీ! చెప్పేటందుకు నోరెట్లా వచ్చిందో దున్నపోతులాంటి కొడుకున్నాడు పంపించరాదూ? వెధవబుద్ధులూ, వెధవ మనుషులునూ. పైగా ఆవిడ్చే దేదోముందే ఏడవరాదూ? నాచదువూ, నా టేబుల్ టెన్నీసూ ఆయనకెందుకూ? బుద్ధి గడ్డితిని యిక్కడ చేరాను.

కమల వచ్చి "ఎందుకండీ ఆయన పిలిచారు?" అని అడిగింది.

"ఇంకెందుకు? నా చదువును గురించి, నా అలవాట్లను గురించి ఓ చిన్న లెక్చరిచ్చాడు. క్లబ్బులకు పికార్లకు వెళ్ళరాదుట. అస్తమానం పుస్తకం పట్టు కూర్చో

చుంటేనేగాని పైకి రాగట. ఖర్మ! మా నాన్నయినా నన్ను ఏమీ అనేవాడుకాడు. యిన్నాళ్ళకి యిక్కడికొచ్చి యీాయనచేత మాటలు పడాల్సివచ్చింది. అంతా చెప్పి చివరికి బజారువెళ్ళి వాళ్ళయింట్లోకి కావలసినవి తేవాలిట."

"మీరు తేవాలా? తేనని చెప్పక పోయ్యారా?"

సీతాపతి ఏదో చెప్పేలోపల రాములొచ్చి "పదండి బాబుగారూ. అమ్మగారు లిస్టు రాసిచ్చారు యిదుగో" అని ఒక అరఠావు కాగితం చేతికిచ్చాడు.

సీతాపతి కమలవేపొక చూపు చూసి రాములుతో "పద" అని బయలుదేరాడు. అరఠావు కాగితంలో రాసిన లిస్టు ప్రకారం అన్నీ కొనుక్కొచ్చేసరికి పదిన్నరయింది. పి. ఎ. గారి సతీమణి మాటలు రోడ్డుమీదకే విన్పిస్తున్నయ్. "మావాడికి ఈ గుమాస్తాగిరి చేసే ఖర్మ తప్పిపోవాలని వయ్యి దేవుళ్ళకు మొక్కుకొంటున్నాను, తల్లీ! అందుకే వాడిని ఈ బి. ఎ. పూర్తికాగానే ఎం. ఎ. చదివించెయ్యాలి... ఆయన చెప్పాగులే. మీ ఆయన ఆఫీసులోచేసే పనులకు—కొత్తకదుటమ్మ ఇంకా తెలీదు-ఆ మేనేజరు ఇంకోకళ్ళయితే దులిపేశేవాడు. ఈయన మొహం చూసి ఊరుకొంటున్నాడు..." ఆవిడ సీతాపతి రావటం చూసి ఆగింది. అప్పటిదాకా జైల్లో వుంటున్నట్టు వుంటున్న కమల 'అమ్మయ్య' అనుకొని ఇంట్లోకొచ్చేసింది.

"విన్నారుకదా? రోజూ అదేవరస. వినలేక నాప్రాణం పోతోంది. ఎరక్కపోయి ఇక్కడ యిల్లు తీసుకొన్నాం..."

"సరే. ఇక ఆపుదూ. అన్నం పెట్టు ఆకలి మండిపోతోంది" విసుక్కున్నాడు సీతాపతి. అతడికి అసలే ఇందాకటినుంచి వళ్ళు మండిపోతోంది. యిట్లా చాకిరి చేయించుకొంటుంటే అయినట్టే. కోపంతోనే లిస్టు ప్రకారం సామానులు కొని, మండిపడుతూ యింటికొచ్చాడు. దాంతో కమల ఏదో చెప్పేసరికి యిందాకటినుంచి లోపల అణగి వున్న కోపం పెల్లుబికి పైకివచ్చింది...

అన్నం తినగానే సీతాపతికి నిద్రవచ్చింది. రెండు గంటలు నిద్రపోయి లేచి కాఫీతాగి బయలుదేరాడు. తను ఆఫీసుకి ఎప్పుడెళ్ళినా ఫరవాలేదు. పి. ఎ. గారు యీపాటికే 'మావాడు కొంచెం ఆలస్యంగావస్తాడివ్వాళ' అని చెప్పివుంటారు. 'ఆ కొంచెం ఆలస్యా'నికి ఎంతయినా అర్థంవుంది. ఆ రోజంతా వెళ్ళకుండా సాయంత్రం అయిదు గంటలకు షికారు కెళ్ళినట్టుగా వెళ్ళి ఒకసారి కనబడినా 'ఆ కొంచెం ఆలస్యం'లో కలిసిపోతుంది.

సీతాపతి ఆఫీసుకెళ్ళి సరాసరి మేనేజరు గదిలోకి వెళ్ళి "గుడ్ మార్నింగ్ సార్" అని



'లేడీస్ ఫస్ట్'

చిత్రకారుడు — అయ్యగారి సుబ్రహ్మణ్యం (విలూరు)

విష్ చేసి అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేశాడు.

"అరె, తొందరగా వచ్చావోయ్. పి. ఎ. గారు ఇవ్వాళ మా వాడికి పనుంది కొంచెం ఆలస్యంగా వస్తాడని చెప్పారులే. యింకా ఆలస్యం అవుతుందేమో ననుకున్నా. తొందరగా వచ్చావే. గుడ్" అన్నాడు మేనేజరు.

"ఎందుకండీ! పనయిపోయింది వచ్చాను."

"గుడ్. యిందాక రెండు 'డి. ఓ' లు వచ్చాయ్. వెంటనే నేను వాటికి రిప్లయిలు రాసి పంపేశాను. పర్సనల్ రిజిష్టరులో ఎంట్రీ, వేసుకోండి."

"అట్లాగేనండీ" అని సీతాపతి తనసీటు దగ్గరకు వచ్చేశాడు.

సీతాపతి పర్సనల్ రిజిష్టరులో ఎంట్రీలు వేసుకుంటుంటే పక్కనున్న గుమాస్తా రామ్మూర్తి "అదృష్టవంతుడవోయ్, ఎట్లాగయినా" అన్నాడు.

"ఏమిటో ఆ అదృష్టం?"

"కాకపోతే మరేమిటి? యింకెవరిసీటులో నయినా డి. ఓలు వస్తే యీపాటికి ఆఫీసంతా ఓ యుద్ధకాండ అయిపోయివుండేది. అటువంటిది నీ సీటులో ఒక్కరోజులో రెండు డి. వోలు వచ్చినా మేనేజరు తనే అటెండయ్యాడు. దేనికయినా పెట్టిపుట్టాలి."

సీతాపతి పైకి గర్వంగా చిరునవ్వు నవ్వాడు. లోపల మనస్సు చివుక్కుమన్నది. తన ఖర్మకాలి పి. ఎ. గారింట్లో బంట్రోతులాగా చాకిరీచేసే యీ లాభం తనకు...

రాత్రి సీతాపతి భోజనంచేసి పేపరు తిరగేస్తున్నాడు. రాములొచ్చి "బాబూ అయ్యగారు పిలుస్తున్నారు" అని చెప్పాడు.

"యిప్పుడు పిలవటం ఏమిటోయ్ ఎందుకుట?" అని అడిగాడు సీతాపతి.

"నాకు తెలీదు బాబూ పిలుచుకు రమ్మన్నారు."

కమల వంటిల్లు సర్దుతోంది. "యిప్పుడే వస్తాను" అని ఆమెకు చెప్పి విసుక్కుంటూ బయలుదేరాడు. వరండాలో పి. ఎ. గారు వాలుకుర్చీలో కూర్చుని చుట్టకాల్చుకొంటున్నారు. ఒకమూల శంకరం కుర్చీలోకూర్చుని టేబుల్ మీదికి వంగి ఏదో చదువుకొంటున్నాడు. లోపల గదిలో వాళ్ళమ్మాయి కొంచెంగట్టిగానే చదువుకుంటోంది. వరండాలోనే ఒకమూల మంచంమీద ఆయన జ్యేష్ఠపుత్రుడు నిద్రపోతున్నాడు. గురక కూడ విన్పిస్తోంది. ఆయన జ్యేష్ఠపుత్రుడికి కీళ్ళవాతమో, మరేరోగమో వుంది. సరిగా నడవలేడు. నించోలేడు. తన పనులయినా తాను సవ్యంగా చేసుకోలేడు. యింకా పెళ్ళియినా కాలేదు. పన్నంగా తలంతా సగం పండిపోయి ముసలివాడిలాగా వుంటాడు. పి. ఎ. గారు అతని ఆరోగ్యం బాగుపడటం కోసం ఎన్నో మందులు వాడారు. ఎంతమందో డాక్టర్లకు ఎంత డబ్బో ఖర్చయింది కాని లాభం సున్న.

సీతాపతిని చూడగానే పి. ఎ. గారు "ఏం చేస్తున్నావోయ్" అని అడిగారు.

"పేపరు చదువుతున్నానండీ."

"యిది యింకోచెడ్డ అలవాటు. ఆ పేపరులో ఏముంటుందోయ్, అంత టైము వేస్టు చేసుకుని చదవటానికి?..."

"ఏవో వార్తలు అవీ..."

"ఆ సంగతి నాకు తెలీదనికనుకొన్నావా? ఆ వార్తలు అవీ చదివి నువ్వు ఏం నేర్చుకోవాలి. అసలు అవన్నీ నీకెందుకు? అవి తెలుసుకొంటే నీ కొచ్చేలాభం ఏమిటి? ఏదయినా బి. ఎ. పూర్తిచేసుకొంటే ఎప్పటికయినా లాభం. అదీ గాకపోతే ఏ ఎక్కౌంట్సు టెస్టుకో కట్టి ప్యాసయితే డిపార్టుమెంటులో పైకొస్తావు అంతేకాని యీ వార్తలు, యీపత్రికలు ఎందుకోయ్ నీకు? చెప్ప

టానికి మీ నాన్న గాని, యింకెవరయినా పెద్దవాళ్లుగాని దగ్గర లేరు. నేనయినా చెప్పలేదని నన్నంటావు. వెళ్లి ఆ బి. ఎ. పుస్తకాలు తెచ్చుకొని మా శంకరంతోపాటు చదువు. నాలుగురోజులు చదివితే ఆతరువాత అదే అలవాటవుతుంది."

సీతాపతి సగం బిక్కచచ్చిపోయి "అట్లాగేనండి" అని వెళ్ళబోతుంటే ఆయన పిలిచి "పోనీలే యివ్వాళ్టికి, ఆ ఎఫ్. ఆర్. కొత్త పుస్తకం వచ్చింది. కూర్చుని గట్టిగా చదువు. వింటాను. నీకు తెలుస్తుంది. కొత్తరూల్సు కూడా ఒక్కసారి తెలుస్తుంది. అర్థంకాకపోతే అడుగు చెబుతాను" అని "అమ్మాయి కొత్తదెండు పుస్తకం యిలా పట్టుకురా" అని కేకేశాడు.

తన దురదృష్టాన్ని నిందించుకొంటూ, లోలోపలే ఏడుస్తూ వాళ్ళమ్మాయి తెచ్చి యిచ్చిన పుస్తకాన్ని అందుకొన్నాడు సీతాపతి.

* * *

యిప్పుడు సీతాపతి 'దేవుడా' అంటూ అయిదున్నరకే లేస్తున్నాడు. లేవకపోతే పి. ఎ. గారు ఖచ్చితంగా లేపుతాడు. అతరువాత నిద్రమత్తు వదలేందుకని చన్నీళ్ళతో మొహంకడుక్కొని పుస్తకం పట్టుకొని శంకరంతోపాటు ఏడింటిదాకా చదువుకోవాలి. అసలు యింటిదగ్గరే చదువుకొనే రోజుల్లో ఎప్పుడూ ఏడింటికి ముందు నిద్ర లేచిన పాపాన పోలేదు సీతాపతి. యిప్పుడు తప్పనిసరి అయింది. యిదివరకు యింట్లో ఎప్పుడయినా తండ్రి ఏడింటికిముందు-అసలు సీతాపతి నిద్రపోతున్నప్పుడు-లేపితే ఆయన మీద విసుక్కునేవాడు. యిప్పటి పరిస్థితి వేరు. యిప్పుడు పి.ఎ. గారు అయిదున్నరకు నిద్రలేవకపోతే ఊరుకోకపోవటమేకాదు. ఆతరువాత చదువుతూ నిద్రతో జోగినా "అదేమిటయ్యా. అట్లాచదివితే అయినట్టే. యింకా తెల్లవారఝామునలేచి చదవటం అలవాటుకాలేదా!" అని అంటున్నా నోరు మూసుకొని చదువుకొంటున్నాడు.

సాయంత్రమూ అంతే! ఆరింటితరువాత ఎప్పుడయినా యింటికొచ్చినప్పుడు పి. ఎ. గారు చూసి "చీకటి పడ్డతరువాత కూడ ఆఫీ కొరగలేవిటోయ్. యివన్నీ నాకు నచ్చవయ్యా. యిక్కడున్నంతకాలం యివన్నీ మానుకోవాలి. సాయంత్రం ఆఫీసునుంచి యింటికిరావటం, స్నానంచేయటం, ఏదో ఒకగంట షికారుకెళ్ళటం, యింటికొచ్చి అన్నంతిని పుస్తకం పట్టుకోవటం, యిట్లా అయితేగాని పైకిరావటం కష్టం తెలిసిందా!" అనేవారు. సీతాపతి ఏమీ అనలేకపోతున్నాడు. మనస్సులో ఎంతకోపం కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్నా 'ఆయన అధికారి, తాను గుమాస్తా' అనే భావం అడ్డువచ్చి అతడిని నిస్సహాయుడిని చేసింది.

బంగారుపంజరం

భర్త అనుభవిస్తున్న మనోవేదన కమలకు తెలుసు. "ఎందుకండీ యింత చెర అనుభవించటం. ఇంకో నాలుగురూపాయలు ఎక్కువయినా సరే యింకోయిల్లు తీసుకోండి. ప్రతిదాంట్లో ఆయన 'అథార్టీ' ఏమిటి! మనం సరదాగా షికారుకెళ్ళి ఎన్నిరోజులయిందో గుర్తుతెచ్చుకోండి. ఏపనిచేయబోయినా ఆయనేమంటాడో అనే భయమయితే యిక మనం బ్రతకటం ఎందుకండీ" అనేది.

"ఎరక్కపోయి యీ చెరలో యిరుక్కొన్నాం. యిప్పుడు వెళ్ళిపోయామనుకో, ఆఫీసులో నాపరిస్థితి ఎంతఅధ్వాన్నంగా తయారవుతుందో తెలుసా? పి. ఎ. గారికి నాకు పోట్లాటవచ్చిందనుకొంటారు అందరూనూ. అదీకాక మనం వెళ్ళిపోతే ఆయనే నామీద మనస్సులో కోపం పెట్టుకుని ఏదయినా చేయగలడు కూడా."

ఆరోజు పి. ఎ. గారు క్యాంపు వెళ్లారు. అందుచేత సీతాపతి ఉదయం అయిదున్నరకు లేవాల్సిన అవసరం లేకపోయింది. అటువంటప్పుడే సీతాపతికి కంటినిండా నిద్ర వుంటుంది. కంటినిండా నిద్రఉంటే అతడు ఆఫీసులో నిద్రపోడు. లేకపోతే అతడు రోజూ మధ్యాహ్నం రెండుగంటలసేపు రికార్డురూములో హాయిగా పడుకోవటం అలవాటుచేసుకొన్నాడు. యీవిషయం అందరికీ తెలుసు. అయినా ఎవరూ ఏమీఅనరు. పి. ఎ. గారి బంధువు!... తెచ్చిపెట్టుకొన్న బద్ధకాన్ని తృప్తిగా అనుభవిస్తూ, ఏడుగంటలయినా ఇంకా పక్కమీదనుంచి లేవకుండా కళ్ళు తెరుచుకొనే పడుకొన్నాడు.

పెరట్లో పి. ఎ. గారి సతీమణి మాటలు వినిపిస్తున్నాయ్. "యీ మూడు రోజులూ ఏదోరకంగా కొంచెం వండిపెట్టు తల్లీ. మా అమ్మాయి వున్నదంటే దాని చదువేమో దానిదేగాని యితరవ్యాపకాలు లేవు. దానికి కాఫీకాయటంకూడా రాదు..."

"నాకు పెద్దగా వంట చేతగాదండీ. ఏదో మాయిద్దరికీ ఎట్లాగో కష్టపడిచేస్తున్నాను" అంటోంది కమల.

"పరవాలేదులేమ్మా. గుమ్మంఅవతల నేను వుండి అన్నీ చెబుతానుగా. నెమ్మదిగా చెయ్యి. అసలు వంటమనిషిని మాట్లాడుదామనుకొన్నాను. కాని వంటమనిషి చేస్తే యింట్లో ఎవరూ తినరు. ఆయన సరేసరి. వంటమనిషి వండిందంటే అసలు వంటింటివేపే రారు. ఎట్లాగో కొంచెం కష్టపడు తల్లీ."

"అట్లాగేలెండి" అని కమల యింట్లో కొచ్చింది. సీతాపతి మేలుకొనేవుండటం చూసి "చూశారా! యిదీవరస. ఆవిడగారు బయటవుంటే యింటిల్లిపాదికి నేను వండి పెట్టాలట. పైగా పిలిచి చెబుతోంది. నా అంతట నేనే వెళ్ళి 'వండిపెడతాలెండి' అంటే అది వేరు. మనమేదో వాళ్ళ నౌకర్లమయినట్టు చెబుతోంది చూశారా?" అన్నది.

సీతాపతి రెండునిమిషాలు మౌనంగావుండి 'పోనీ నావల్లకాదని చెప్పేసెయ్. ఏమయితే అదే అవుతుంది' అన్నాడు.

"అట్లా ఎందుకులెండి? ఆయన మిమ్మల్ని ఏమయినా చేస్తాడేమో? మూడురోజులేగా ఎట్లాగో అవస్థపడతాలెండి."

ఆరాత్రి కమల సీతాపతి వళ్లో తలదూర్చి బావురుమని ఏడ్చింది. "పోనీకదా అని వండిపెడితే, ఎంత అథారీ చేశారనుకొన్నారు. అతడికి తొమ్మిదిన్నరకల్లా వంటకాకపోతే కోపం వస్తుందిట. పదినిమిషాలు ఆలస్యం అయిందని ఆతల్లిదగ్గర ఎంత బ్రతిమాలించుకొన్నాడు. ఆవిడేమో మెత్తమెత్తగానే నన్ను నాలుగూ అన్నది. జీతంయిస్తున్న పనిమనిషినయినా అంటే వూరుకోదు. నేనూరుకోవాల్సివచ్చింది. యిక ఆఅమ్మాయి సంగతి సరేసరి. మధ్యాహ్నం వంటిగంటకు భోజనానికొచ్చింది. తిన్నకంచంకూడ కడుక్కోలేదుట. నాముందే అది బాగులేదని, యిది బాగులేదని వంకలు. కొంచెం బుద్ధిజ్ఞానమయినాలేదు. పైగా ఆవిడమాటలు చూడండి! 'అది దేంట్లో కొంచెం ఉప్పుకారం అటూ యిటయినా ముద్దనోట్లో పెట్టదమ్మా' అని సమర్థిస్తుంది. పైగా అదితిన్న కంచం నేనెత్తాలిట. నేనెత్తను, సాయంత్రం పనిమనిషిచేత ఎత్తించవచ్చులెండని ఖచ్చితంగా చెప్పాను.....అది కాదండీ. మనకీ చెరలో వుండాల్సిన ఖర్మ ఏమిటండీ. పోనీ యింకోవూరు బదలీ చేయించుకోరాదూ?"

"నేనూ అదే సీరియస్ గా ఆలోచిస్తున్నానే. యిటువంటి పోస్టాయనకొంటే అసలు ముందు యీ యింట్లో దిగేవాడినే కాదు. మా ఫ్రెండు ముందే అన్నాడు.

డ్రైవర్ను పరీక్షిస్తున్న బ్రేక్ ఇన్స్పెక్టర్ "కారు క్రింద కుక్క పడితే ఏమిచేస్తా"వని ప్రశ్నించాడు.

డ్రైవర్ - తోకపట్టుకొని రోడ్డు ప్రక్కకు ఈడ్చేస్తాను.

ఇన్స్పెక్టర్ - కోడి పడితేనో ?

డ్రైవర్ - అటు ఇటు చూచి బండిలో వేసుకొంటాను.

—టి. జి. మణి (విశాఖపట్టణం)

తెలుసుకోలేకపోయాను. యిప్పుడు మనం ఏ కారణం లేకుండా వెళ్ళిపోతే బాగుండదు. పోట్లాడి పోయినా మనకే దెబ్బ. ఏదో పరిస్థితులు తోసుకురావాలి. ఏదిన్నా పెద్ద వుపాయం ఆలోచించాలి."

సీతాపతి కోరుకొన్నట్టే పరిస్థితులు తోసుకొచ్చినయ్...

పి. ఎ. గారు పెద్దకొడుక్కి పెళ్ళి తలపెట్టారు. రేపు తనకేదయినా అయితే వాడి నెవరు చూస్తారు. అందుచేత తన స్వార్జితం ఆస్తిలో సగం రాసిస్తాననీ, వాడికి పెళ్ళి చేద్దామనుకొంటున్నాననీ నలుగురితో అన్నాడు. ఎదిగిన ఆడపిల్లల బరువుతో ఆలోచనా శక్తి హరించుకుపోయిన ఓ ఆడపిల్లల తండ్రి తన కూతురిని పి. ఎ. గారి జ్యేష్ఠ పుత్రుడికి యివ్వటానికి సిద్ధపడ్డాడు. యింకేముంది? ముహూర్తం నిశ్చయించారు. పెళ్ళి ఏర్పాట్లు జోరున సాగుతున్నాయ్.

సీతాపతికి యీ సంగతి తెలిసింది. వళ్ళు మండింది. ఆఫీసులో నలుగురిముందే "ఆ ఆడపిల్ల నిచ్చే తండ్రికయినా కొంచెం బుద్ధి జ్ఞానం వుండనక్కరలేదూ? చూసు చూసి తన కూతురుగొంతు కోయటానికి సిద్ధపడతాడా? బ్రూట్! పి. ఎ. గారి కయినా యింకో ఆడపిల్ల జీవితం నాశనం చేస్తున్నాననే ఆలోచన రానక్కరలేదూ? ఆ అమ్మాయి మటుకు తన కూతురులాంటిది కాదా? రేపు తనకూతురిని యిటువంటి రోగిష్టివాడికిచ్చి చేస్తాడా?..." అనేశాడు ఆవేశంలో.

ఆ మాటలు పి. ఎ. గారి దాకా వెళ్ళినయ్. ఆ సాయంత్రమే ఆయన సీతాపతిని పిల్చి "ఏమిటోయ్ నీ వ్యవహారం చాలా దాకా పోతోందే" అన్నారు.

"ఏమిటండీ?"

"ఏమిటండీ ఏమిటి? నేను చేసే పనులను కూడా నలుగురుముందు విమర్శించటందాకా వచ్చిందే వ్యవహారం? ఏదో చుట్టానివని దగ్గరకు చేరనిస్తే యిదే నువు చేసే ఘనకార్యం. అసలు నా కొడుకు పెళ్ళిసంగతి నీకెందుకు? నా కెవార్రు [illegible] రించి యింట్లో చేరనిచ్చినందుకు [illegible] ఫలితం! చాలా బాగుందోయ్. నిన్నని ఏం లాభంలే. నెత్తికెక్కించుకోవటం నాది తప్పు. ఎక్కడ వుంచాల్సిన వాళ్ళను అక్కడే వుంచాలి."

తలొంచుకొని వచ్చేశాడు సీతాపతి. యిన్నిమాటలు పడ్డ తిరువాతయినా ఒక్కముక్కయినా అతడి నోటివెంట రాలేదు. ఎప్పుడయినా తండ్రి 'రాత్రి పదకొండింటిదాకా ఆ తిరుగుళ్ళెందుకురా? కాస్త పెందలాడే యింటికి చేరుకోరాదూ' అని అంటే తండ్రి మీద ఎదురుతిరిగేవాడు. యిప్పుడిన్ని మాటలు పడీకూడ నోటిలోంచి మాటలు పెగలక తిరిగొచ్చాశాడు. వుద్యోగ మహిమ! ఏమంటే తన వుద్యోగానికి ఏం తంటా తెచ్చి పెడతాడో? ఆఫీసరుతో జాగ్రత్తగా వుండడం మంచిది... కాని యీ



దీపాలంకరణ


చిత్రకారుడు—అంకోలు శేషగిరిరావు (నూజవీడు)

నరకంలోంచి ఎలాగయినా తప్పుకోవాలి. ఎలా? ఏమీ మార్గం ఎంత ఆలోచించినా తోచలేదు. సాము చావరాదు. కర్ర విరగరాదు. ఏం చేస్తే వీలవుతుంది. ఆయనతో పోట్లాడినట్లు ఆయన అనుకోరాదు. తనకీ నరకంలోంచి విముక్తి కావాలి...

ఆలోచించి విసుగెత్తి ఆఖరికి సలహా కోసం తనకు మొదట ఆశ్రయం యిచ్చిన స్నేహితుడిదగ్గరి కెళ్ళాడు. అతడికి మటుకు యిటువంటి వ్యవహారాలేం తెలుస్తయ్. అతడు సీతాపతిని పదిహేనేళ్ళు సర్వీసున్న ఓ సీనియర్ గుమస్తా దగ్గరికి తీసికెళ్ళి అన్ని వివరంగా చెప్పి సలహా అడిగాడు.

ఆయన "ఓస్ యింతేనా?" అని నవ్వి "ఏముందండీ? మొదట పుట్టింటినుంచి వుత్తరం వచ్చిందని మీ శ్రీమతిని పంపించెయ్యండి. ఆ తరువాత ఒక్కడికీ యింత యిల్లెందుకని మీ ఫ్రెండ్ రూముకెళ్ళానని సామానులతో వచ్చెయ్యండి. ఆయన మీ మీద కోపంతో ఆఫీసులో ఏడిపిస్తే ఏ డాక్టరు దగ్గరయినా సర్టిఫికెట్టు పుట్టించి ఓ రెండు నెలలు సెలవు పెట్టండి. ఆటోమాటిక్‌గా మిమ్మల్ని యింకోవూరు ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు. అంతే" అన్నాడు.

సీతాపతికి వినుగక్కినంత సంతోషం కలిగింది. హుషారుగా యీల వేసుకుంటూ యింటికి బయలుదేరాడు. ★



మారెమ్మ గుడి

సి. వేణు

ఫోలేరుగుండ్లు దాటి, బొమ్మినాయుడు చెలిపు దాటి, మిన్నాలచ్చిమి కనుమ దాటి సింగారపు జొన్న చేల్లో అడ్డంగాపడి గారమాకులకొండ అందుకొంది గంగు. నచ్చు గుట్టను చుట్టి వంకరగా తిరిగి పరుగెత్తేకొండ వాగు గట్టెక్కి వెనుదిరిగి చూచింది. తను చాలదూరం వచ్చేసింది.

కొండదళిలో వడివడిగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయింది. అలికిడికి చెట్టుమీద "బెళగువ్వ" (అడవిపావురం) పటపట రెక్కలల్లార్చి పారిపోయింది. ఎండిన గెలుదుబ్బుల్ని తొలగదోసుకొంటూ జా[illegible]రిచెట్లలోయలో అడుగుపెట్టింది ఆ పడుచు.

సన్నని జలతారు పట్టుకుచ్చులు వ్రేలాడదీసినట్లు పూగుత్తులు మనోహరంగా పుష్పించి ఉన్నాయి. అడవిమల్లెలు కొల్లలుగా విరబూచి మత్తెక్కిస్తున్నాయి. అడివంతా చిగురాకుల చీర సింగారించుకొని మరులుగొలుపుతూ వుంది.

ఇసకదిబ్బలలో వనదేరి తేటరై తీయనైన సెలయేటి నీటియూటలో ఆ పాటలాధర గంగు వంగి చూచుకొని పాపటదీసి పాయలు మెలచి జడవేసుకొంది. నీటిలో తల తళుకు కొంటున్న సొగసులాడి అడవికోడి పొదల్లోకి పారిపోయింది. గంగు వెళుతూ నేవుంది. ఎఱ్ఱచీకి ఆమె నలభయ్యావ నంబరు అవిశపల్లె నగరి చీరను ముడేట్టుకొంది. చినిగిన చీరను కుచ్చెళ్లుపోసి నడుంలో చెక్కుకుంది. మేతకు పోయిన గంగిగోవులు మేస్తూవుంటే వాటి మెడపట్టెడలోని చిరుగంటల గవళిదూరంగా, సుదూరంగా గాలిలో వాలుగా తేలిపోతూ విన్పిస్తూవుంది.

అడివి చిగురుచెట్లలో, మంగచెట్లమాటున మరుగుపడుతూ, మరుగుపడుతూ దగ్గరకు వచ్చేసింది. అతడు తెగమూడలు మట్టి తినటం మరుగుతోయని "దుసారతీగ"లో "ముకుజంబరాలు" అల్లుతున్నాడు. చేతి గాజుల మంజుల మనోహరనాదము విన్పించనిరీతిగా ఎగదోసి అడుగులో అడుగువేసుకొంటూ సమీపించింది. పాదంక్రిందపడి విరిగిన ఎండుటాకుల సవ్వడికి అతడు తిరిగి చూచాడు. గంగు రాతిపేటు అంచునానుకొని క్రిందికి దిగజారింది. అతడు దిక్కులు పరికించి, పనిలో మునిగిపోయాడు.

గంగు మెఱుపు దమక్కులావచ్చి అతని కళ్ళు మూసింది.

"ఒకే! కిష్టిగా వదలా" అన్నాడు, అతడు.

"కాదు బావా! నేను" అంటూ ముందుకొచ్చింది ఆమె. ఆ పల్లెపిల్ల ముంగురులు చెదరి నుదురుపై నర్తిస్తున్నాయి.

అతడు లేచి అమాంతం ఆమెను వాటేసుకోబోయాడు. ఆ యువతి పరుగు లంకించుకొంది. అలసిపోయి సెలయేటిఒడ్డున చతికిలపడింది. యువకుడు ఎదురుగా కూర్చున్నాడు. గంగు వచ్చిమోదుగాకులు గిల్లి తెచ్చింది. జొన్నరొట్టెలు, ముద్దగావండిన గుత్తి వంకాయకూర వడ్డించింది. అతని కళ్లల్లో

[illegible]చింది. ముల్లోకాలను ఆకట్టి, ఆకర్షించి శాసించేలాగున్నాయి ఆ చూపులు. ఇలాంటి చూపులే తూపులంటారేమో. అతడు మూగవోయి, ఆరగించి లేచి నీటి యూటలో కడుపార నీరు త్రాగాడు. కొండగోగుపూలను గంగుజడలో తురిమాడు. ఆమె బుగ్గలు సిగ్గుదేలిన రావిచిగుళ్ళలా యెరుపెక్కాయి.

ఇనపకడ్డీల్లాగున్న చేతుల్లోకి ఆ చెలిమికత్తెను లాక్కున్నాడు. "వదులు బావా!" అంటూ గంగు నవ్వసాగింది. గట్టిగా మరింత గట్టిగా నవ్వుతూవుంది.

* * *

"ఒసేయ్! ఏమిటే ఆ నవ్వు నిద్రలో కూడా నవ్వేనా? బుల్లెమ్మా! గంగూ! నువ్వు, నీనవ్వు అవ్వ! ఏమే ఆ మిడిసిపాటు!" అంటూ తట్టి లేపింది వాళ్ళ అమ్మమ్మ.


గంగు తటాలున చాపమీంచి లేచింది. బిత్తరిచూపులు చూస్తూ ఒళ్ళు విరుచుకొంది. జడలో తడిమిచూచి కొండగోగులు లేనందుకు నవ్వుకొంది. చీరలో కొట్టులేదు. కల—మంచికల—ఆ పల్లెటూరి పడుచు అధరాలపై చిఱునవ్వు చిత్రంగా నర్తించింది. ఆ మగాడంటే తనకెందు కామోజా! ఏమో 'మల్లి' కాదు కాదు 'మల్లన్న'ంటే తన శరీరంమీద పులకాంకురాలు పుట్టుకొస్తాయి.

అతిశయమైన అడవికళ్లే పూగుత్తుల్లాగా ఆ జవరాలి మనసులో ప్రశ్నగుత్తులు పూస్తాయి. బద్ధకంగా లేచి, ఆవులించి పెరట్లోకి పరుగెత్తిపోయింది ఆ పల్లెపడుచు.

మూసినకన్ను తెరవకుండా మూడు రోజులు పట్టిన "ముసురు" తెరపయిచ్చింది. అనూరుసారథి రథచక్రం దిక్చక్రంపై కురికింది. పల్లెకుపల్లె నజ్జునజ్జై బురదమయమై చింతగింజ మునగని అంబలిలా తయారయ్యింది. తూరుపుదిశలో తేటగా పట మెగిరింది.

కొట్టములో పశువుల పలుపు పడలించి "మందబైలు"కు తోల్తున్నారు. కుమ్ముకోవటాలు, తుమ్ముకోవటాలు, అంబా యని పిలుచుకోవటాలు, లేగల కుప్పిగంతులు చితచితలాడే చిత్తడిలో తొక్కిడితో తొణికిసలాడే జీవకళతో ఆ ఉదయం సుప్రభాతను పిడి కనులు విప్పింది. చారికలు గట్టిన క్షీరధారలను తుడుచుకుంటూ, పాలునిండిన "పిళదుత్త"ల్ని యింటికి తెస్తున్నారు పాలేళ్లు.

ఇంతలో పూరు గుప్పుమంది. వీధుల్లో పారే నీళ్ళకు ఆనకట్టలు కడుతున్న పాపల్ని తల్లులు కొనరెట్టపట్టి అరుగులపైకి లాక్కెళ్తున్నారు. కొబ్బెరచిప్పల్తో వీధిమట్టిలో "కోడిగుడ్డు కొటారిగుడ్డు" అంటూ ఆడుకొంటున్న బుడతలు పారిపోతున్నారు. ఎక్కడివారక్కడ హెచ్చరికల్తో తప్పుకొంటున్నారు!



మారెమ్మ గుడి

రెడ్డోళ్ళ అబోతు పగ్గం తెంపుకొంది. ఒకటే కలకలం. అది అరకపై కాడిమోపి ఎరుగదు. కమాయించి, చిక్కి బలిసి కండ పుష్టితో నడయాడే తెల్లని మంచుకొండలా వుంటుంది. గంగడోలు కదిలించి, కాల్గీరి, ఖణిల్లుమని రంకెపెడితే గుండె గుభేలు మనాలి. అది ఎవర్నీ లక్ష్యపెట్టదు. పోట్ల గొడ్డు. బరితెగించి వీధుల్లో గస్తీ తిరుగుతుంటే దుడ్డుకఱ్ఱలతో అందరూ "తిన్నె" లెక్కి అదలిస్తున్నారు. అది తీవిగా కదలిపోతూవుంటే కాలిన గోపురంలాంటి మూపురం కదుల్తూ వుంది. అది అవతారమెత్తిన పుంభావం. రైతాంగవ్యవస్థకు మూలస్తంభం.

లావాలు క్రక్కే నిప్పుకొండలాగ బుసలు కొడుతూ మంచినీళ్ళగుంటవైపు పరుగు దీసింది అబోతు. నీటిబిందెలు చంకనెత్తి ఒయ్యారాన్ని వొలకబోస్తూ లోకాభిరామాయణాలు విమర్శించుకొంటూ వస్తున్న పల్లెపడుచులు దానికి అడ్డుతగిలారు. అది రెచ్చిపోయి నాలుగు పాదాలపై అమాంతంగా లేచి ప్రళయతాండవం చేసింది. చెవివరకు లాగి వదలిన చెంచువాని విల్లమ్ములాగ మల్లన్న వచ్చి వాలాడు. గట్టిగా అదలించాడు. అబోతు మల్లన్నను హేళనగా చూచి, మోకాళ్ళపై మండివేసి, భూమిలో కొమ్ములుగ్రుచ్చి, పదునెక్కించుకొని, కాల్గీరి సవాలుచేసింది.

మల్లన్న పొలికేకలు పెడుతూ ముందుకొస్తున్నాడు. ఆ పోతరాయుళ్ళు కలియబడతారనుకొన్నారు అంతా. తన్ను లక్ష్యపెట్టక, నిర్లక్ష్యంగా ముందుకొస్తున్న ఆ భీమబలుని కోరమీసం, గుండెనిబ్బరం, అతని పోతాల్లాగున్న అదలింపులు విని అబోతు వెనక్కు తగ్గింది. అతడు వెన్నంటి, మచ్చికచేసి, గంగడోలు నిమిరి ఆ నందీశ్వరుణ్ణి కొట్టంలో బంధించాడు.

ఆ ప్రళయాట్టహాసం, ఆ తెగువ కళ్ళార్పకుండా చూచింది గంగు. ఉక్కుతీగలా బిగిసిపోయే కండబలం, విలయంలోకూడా చెదరని గుండెబలం, కోరమీసాల సొగసు, గిరజాల శిరోజాలు, కండలుతేరి కాంతివంతమైన అంగాలు – యవ్వనప్రాదుర్భావంతో మనిషిని రెచ్చగొట్టే మగసిరి రాయని సురూపం ఆముద్దరాలు గంగు మనస్సులో చెరగనిముద్రలా నిలిచిపోయింది. అతడు తన హృదయాధిదేవత.

స్త్రీహృదయంలో మల్లెలు పూయించటానికి ఒక్క సంఘటన మాత్రమే చాలు. ఆమె హృదయపీఠిపై అతనిదే శాశ్వత స్థానం.

పొంగలాయి పొంగల్లాంటి మైసూరు మైలవన్నె కోడెలు కట్టిన టేకాకులబండి రోడ్డు మీద గుండుదొర్లినట్టు దొర్లుతూవుంది. గుంగురువదలి సొగసుగ కట్టినాడు తలపాగ మల్లన్న.

బంగారుపొన్ను బిగించిన జాటి ఛళ్ళుమంటే కోడెల మెడపట్టెడలోని గంటలు ఘల్లుమని బండెద్దులు పరుగు లంకించుకొంటాయి. ముగుద జానపదకన్నెల మనస్సులు ఝల్లుమంటాయి.

"మల్లన్నబావా!" ఆ పిలుపు గాలిలో తేలిపోతూ లీలగా విన్పించింది. బండి సాగుతూనే వుంది.

"ఓ మల్లూ! నిన్నే". ఈమాటు మల్లన్న పగ్గాలు లాగి బండి ఆపాడు. దూరంగా "వెన్నుపై గువ్వనడిచే" రాగిచేలకు ఆవల ఓయువతి నిలబడివుంది. ఆమె చేయివిసరి సైగ చేసింది.

ఆ యువకుని హృదయం రెపరెప లాడింది. ఎఱకలు కట్టుకొని ఎగిరిపోయింది. నొగలకు పగ్గాలు బిగించి పరుగెత్తి పడుచు దగ్గరకు వచ్చాడు మల్లన్న. ఆ అమ్మాయి "గంగు".

"ఏమే పిల్లా! పిలిచావా?"

"పిలిచాను. పిలిచాను వినపళ్ళా?"

"ఏం ఎందుకేంటి?"

"ఈ గడ్డిమోపు తలపై పెట్టు."

మల్లు గంగును పొరజూచాడు. నడుములో కొడవలి చెక్కింది. పైటచెరగు సన్నని నడుంచుట్టూ బిగించింది. బడలినా వాడని, సువాసనలు వీడని పూగుత్తిలా వుంది ఆ యువతి ముఖము.

మల్లు పెదవిపై ఇంద్రచాపంలా నవ్వు విరిసింది. గంగు సిగ్గుతో పెండ్లిపడుచులా తల వంచింది. అతడు నాలుకతో పెదవులు తడుపుకొన్నాడు. ఆమె గుక్కిళ్ళు మ్రింగింది.

బరువైన గడ్డిమోపు తలపై ఉంచేటపుడు ఆ యువతి నడుం జవ్వాడింది. ఇద్దరూ తడబడినారు. శరీరాలు పెనవేసుకపోయినాయి. వారి నవ్వులకు పిచ్చుకలు రచ్చజేస్తూ పచ్చని చేలల్లో ఉవ్వెత్తుగా ఎగిసిపోయినాయి. వారి మనసుల్లో మల్లెలు తూరుపెత్తాయి. హృదయాలు రాగరంజితాలయ్యాయి.

వంశానుసరణిగ గ్రామమునసబుగా పని చేసేవారిని రెడ్లంటారు. పెద్ద భూకామందు గ్రామవ్యవహారాలు పరిష్కరిస్తుంటే రెడ్డంటారు. అసలు రెడ్ల వంగడం కూడా కావచ్చు. ఈ మూడు యోగ్యతలుగల వ్యక్తి ధర్మారెడ్డి. పెద్ద యినప్పెట్టెలాంటి రాతి మిద్దె. దానిచుట్టు పగడసాల లాంటి పెంకుల పసువులశాలలు. వసారాలో బెల్లం నింపిన మేదరిగాదెలవరుసలు. ఇంటిముందు ధాన్యం పాతరలు. వంటగది ముందు కుదురుపై పదిలంగా పెటిన మజ్జిగకుండలో నల్లగా జిడ్డు వోడుతూవుంది.

సర్కసులోని మోటారు బైసికిళ్లలా పరుగులు తీసే తువ్వాయిలు, మూలకొట్టంలో అబోతు. వ్రేలాడదీసిన ఎండు మిరపకాయల గోతాములు పెరటిలో చేదబావి వద్ద "అకరటి" కుటుంబం, దాపునచిన్న తిప్పల్లాంటి గడ్డివాములు, నాలుగు తరాలుగా విడిపోని సమష్టి కుటుంబం. స్థూలంగా ధర్మారెడ్డి గృహావర్ణన యింత మాత్రమే.

ఆ యింటి పాలేరే మల్లన్న. బరితెగించి సాహసకార్యాలను తలపెట్టే ఆయువకుణ్ణి "మల్లు" అంటారు. మల్లు పాలేరుమాత్రమే కాదు. ఆయింట్లో వొకడు. గోతిపోతుకు తేరం చెప్పేవాడు. పాడిపసువుల పాలుడు రోగానికి మందూ మాకు ఇచ్చే ధన్వంతరి. అదును నెరిగి, పదునరసి పైరుపెట్టే రైతు. ఊర్పిళ్ళనాడు కూలీల నదలించి పనులు చేయించే మేస్త్రీ. ఎడ్లపందేల్లో సవాలుచేసే మొగరాయుడు. గ్రామకక్షల్లో రెడ్డిగారి శత్రువులకు గుండెల్లో ముల్లు మల్లు.

వల్లంలో చిల్లరడబ్బులు వేసి నడుంకు కట్టేవాడు. నాట్లకు వచ్చే యువతుల్ని చూచి మోచేత్తో వల్లంపై కొట్టాడంటే రూపాయలు ఘల్లనేవి. ముద్దరాండ్ర మూగహృదయాలు జలదరించేవి. అలాంటి రసికుడు మల్లుమనస్సులో గంగు స్థానం యేర్పరచుకొంది. గాజుల గలగలలు విన్పిస్తే గంగు తన్ను పెన్నాడుతుందని భావించి తిరిగి చూస్తాడు మల్లు.

భూకామందు రెడ్డికుమారుడు పట్నంలో

ఇల్లు తగులబడిపోతూ ఉండగా బయట కూర్చుని నెత్తి నోరూ బాదుకొంటున్నది భార్య. భర్త పరుగు పరుగున ఆమెదగ్గరికి వచ్చి—

"ఏమే, సగం కాల్చి పెట్టిన చుట్టముక్క ఎక్కడన్నా కనబడిందా" అని ఆమెను అడిగాడు.

—మైనూరి నీలకంఠం

(మైసూరు)

పై చదువులు వెలిగిస్తున్నాడు. పరీక్షలు తప్పటం అతనికి అలవాటైపోయింది. ఈ పర్యాయం కూడా తప్పాడు. రెడ్డికి కోపం వచ్చేసింది. కరణంతో అన్నాడు కరగా—

"పట్నంలో ఆ బడుద్ధాయికి ఎఱ్ఱని ఏగానీ కూడా పంపను" అని. అంతే నాగం తిరక్కముందే "రాకెట్"లాగు దూసుకొని వచ్చాడు సుపుత్రుడు రాఘవులు.

"అబ్బీ! యికపై నీకు డబ్బులు పంపను. నీవు నా బరాగా తయారవుతున్నావు. ఆ పరీక్ష యేదో యిక్కడున్నంతే గదివి వ్రాయి. నా పరువు వాపైన చదువు. లేకుంటే బద్దన కొండల బంజరుభూమి నీవే సాగు చేయాలి" అన్నాడు గట్టిగా, మెత్తగా.

అంతే అది సుగ్రీవాజ్ఞ. కీచిడి సంబా చెదల్లాంటి సన్నబియ్యపు అన్నం, గడ్డ పెరుగు వెండికంచంలో వడ్డించి ఏడుమారిన జీడి మామిడి వూరగాయముక్క పెట్టి ఆరగించమంటే రాఘవులుకు డోకువచ్చేది పాపం. అతనికి కల్తీలేని యీతగింజలు, చింతగింజలు కాఫీ సాయం కావాలి. సిగరెట్లతో పొగల మేఘాలు నిర్మించాలి. ఇంటివంటకాలు అతనికి వంటబట్టవు. మనవాగిణ పొగాగింటి పుల్ల గూర్చి గూర్చికొని చెప్పుడు?

ఇలువ చేసిన తెల్లని పాముకుబుసంలాంటి మల్లు పంచకట్టి, బొమ్మల స్లీకు ధరించి, ముఖానికి పౌడరు దట్టంగా పట్టించి, భూతద్దాల్లాంటి కళ్ళద్దాలు తగిలించి "పుస్తకం కూ సభూషణమ్మ"ని ఒక యింగ్లీషు "అపరాధ పరిశోధక" నవల (అతని దృష్టి నవలా పఠనంకూడా పరీక్షలో భాగమే) హస్తము కీలించి షికారుకు బయలుదేరేవాడు. మిఠాయి అంగడిని పల్లెటూరి అమాయికులు చూచినట్లు, అమ్మాయిల్ని రెప్ప వేయకుండా చూసాడు. కోతలకు, కలుపుతీతలకు వెళ్లే పడుచుల్ని వెన్నాడే వాడు.

చదువు అతనిలో సభ్యతను, సంస్కారాన్ని కలిగించలేకపోయింది. చదువును ఆకలికి వేసేశాడు. తాడువదలిన బొంగరంలాగా తయారయ్యాడు. అతను మబ్బు వదలిన యెండ.

ఒకనాడు పచ్చికసవు మోపు పాడియావులముందు వేసి వెనుదిరిగి పోంకంగా, తన వైపు వోరకన్ను విసిరి వెళుతుండే ఒయ్యారి భామ గంగు అతని కళ్లల్లో పడింది. జానపదాల ముగ్ధమోహనరసాధి దేవతలాగున్న గంగు అతని గుండెలు దోచేసింది. చిచ్చు రగిల్చేసింది.

నీరకేటి యసలెద్చి, పదును సుధనుపోసి యీ పుత్తడిబొమ్మను పద్మభవుడు చేశాడేమో అని ప్రబంధాల తెలివిని పోలికించాడు.

పిల్లతెమ్మెరకు ఫాలమున నర్తించే శిరోజాలు, పయ్యెదలో బిగించిన ఉరోజాలు, ఎవరో అజ్ఞాత శిల్పి ఎఱ్ఱని కావురాయిని రక్తిమతో పైదలిగా మలచి ప్రాణంపోసినట్లున్న గంగు రాఘవులు గుండెపై కుంపటి రగిలించింది.

"గంగు". నాన్ సెన్సు ఏంపేరు? "గంభ" అంటే ఎంత బాగుండేది. జలజ, వనజ, ప్రేమ, మనోరమ ఈ పేర్లు పెట్టుకొంటే యెంత సొబగుగా వుండేది అంటూ "గంగూ" నామస్మరణతో దినాలు యుగాలుగా గడుపుతున్నాడు.

"పాపం వానిమీద చిలుక లేజీరౌతు చిగురాకుబాకు మూశాడు" అంటారు అతని మిత్రుడు సోమసుందర్. అతడు భావకవి లే. అప్పుడప్పుడూ తన వచన పద్యాల బృహత్కావ్యంలోనుండి మధ్యకు కొన్ని గానంచేసి విన్పిస్తూ వుంటాడు.

తాడు తెగిన గాలిపటంలా పల్లెంతా తిరుగుతుంటాడు రాఘవులు. ఒక ప్రణాళికను రూపొందించుకొన్నాడు. తమ భూముల్ని సాగుచేసే కౌలుదారు "రంగయ్య" కూతుర్ని తనదాన్నిగా చేసుకొనటమే ప్రణాళికా గచవత్వేయము. ఆ లక్ష్యసాధనకై నిరీక్షిస్తున్నాడు.

ఒకనాడు మల్లన్న బలే హుషారుగా వున్నాడు. రాత్రి కంచంముందు కూర్చుంటే అన్నం రుచించినది కాదు. త్వరగా లేచాడు. పొగాకు మొట్టను వెలిగించి గట్టిగ ఒక్క దమ్ములాగాడు. ఆబోతుకు సజ్జదంటువేసి నీరు గాడు. భూకామందు పొన్నుకట్ట కౌలుపు రాళ్ళపై తాటించుకొంటూ వస్తున్నాడు, ఆ మసకచీకట్లో.

"మల్లన్నా!" అన్నాడు. మల్లు ముట్ట ఆర్పి "వస్తున్నా! బాబుగారూ!" అని తొందరగా చుట్ట ఆర్పి సమీపించాడు.

"ఒరేయ్! మాట" అని సమీపించాడు. కంఠం అదురుతూ వుంది. ఆవేశంతో శరీరం కంపించిపోతూ ఉంది రెడ్డికి.

"దుమ్ముగూడెంవాళ్లు రాత్రికి మన ధాన్యం పుర్లకు అగ్గి పెడతారని తెలిసింది. వారిగాడు కబురు తెచ్చాడు" అని చెబుతున్నాడు. మల్లన్నకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"మాలింట్లో తుపాకి తీసుకో, బాణాకఱ్ఱ, బళ్లెం తయారుగా వుంచుకో. సాయానికి బసవణ్ణి, మునిగాణ్ణి తీసుకెళ్లు. మానిని ఆ ప్రాంతంలో మసిలాడా కాకిని కాల్చినట్లు పేల్చేయి. నీ ప్రాణానికి నా ప్రాణం బయలు దేరు."

మాట పూర్తికాకముందే మల్లన్న ఇంట్లో ప్రవేశించాడు. దక్షాధ్వరధ్వంసానికి సురకత్తి వాలంబు, శూలంబు చక్రంబు కరవాల చేకత్తి ఖడ్గంబు పేరైన మొలబాకు జముదాళి పిడియంబుతో బయలుదేరిన వీరభద్రుడిలా బయలుదేరాడు.

వుంత మార్గం వదలి కంది చేలగట్లపై నడచి పోయాడు. బసవన్న, మునయ్య, మల్లయ్య

మార్గాన్ని అనుసరించారు.

తన యజమానిపలుకు వేదవాక్యంగా, శిలాశాసనంగా భావించి ఆచరించటం మల్లన్నలో ఉన్న ప్రత్యేకత.

మంత్రిగాని మనశ్శక్తికి బోరగిలబడిన నాగులాగ వంకరలు తిరిగి పారే ముగిలి పొదలవాగు దాటి కొండపేటు చేరుకొన్నాడు మల్లు. మసకచీకట్లో కళ్ళంలో ధాన్యపు ప్రోగులు అస్పష్టంగా కనిపిస్తా వున్నాయి. అక్కడికి

మారెమ్మ గుడి

రెండు మైళ్ల దూరంలో వుంది దుమ్ముగూడెం. పంచాయితీ యెన్నికల కారణంగా పెద్ద దొమ్మి జరిగింది. తుపాకులు, బాకులు, బల్లేలు స్వేచ్ఛగా వుపయోగించారు. కోర్టుల్లో కట్టలు కట్టలుగ కేసులు మూలుగుతున్నాయి.

పంచాయతి వ్యవస్థకు పునాదులు పరచిన భారతదేశపు జానపదాల దౌర్భాగ్యస్థిన నేడిలావుంది. చెఱుకుతోటలకు నిప్పుపెట్టటం, పండివొరిగిన వరిపంటను పొలాల్లో రాలగొట్టివేయటం. అరటిచెట్లను తెగనరకటం మొదలైన అత్యాచారాలు జరుగుతూవుంటాయి.

కల్లంలో కాలుపెట్టగానే మల్లుమనస్సు "జివ్వు"మంది. అరెరే గంగును "మారెమ్మ"

గుడిదగ్గరకు రమ్మన్నాడు. అది కచ్చితంగా వచ్చి యెదురు చూస్తూవుంటుంది. ఆ వేళంలో మూ-చిపోయాడు. అతనిహృదయంలో వగల పొగలు రగులుకొన్నాయి. కాని తన విధ్యుక్త ధర్మాన్ని విస్మరించటం అధర్మం. తన స్వేదంతో తడిసి రూపుదాల్చిన ధాన్య పు పురులు అగ్ని కాహుతికావటమా? అసంభవం అని యోచించాడు. మనస్సు రెక్కలు మొలచి నభోమార్గంలో విశృంఖలవిహారం చేస్తూవుంది. వెళ్లిపోదామా?—వద్దు—పోతే యేం?—పోరాదు. న్యాయంకాదు.

మనస్సులో భీషణమైన పోరాటంసాగి చల్లారింది. నిట్టూర్చాడు. మంచంపై దూర్చున్నాడు. అది కిర్రుమని మూలిగింది. తోడుగా వచ్చినవారు నిద్రాముద్రితులైనారు.

గాలి చెట్లలోనుండివీస్తుంటే అసహ్యంగా ఏదో మూలుగులా రోద వినిపిస్తూంది. అమె జాన్ అరణ్యంలాగా దిట్టంగా, దట్టంగా సెటాళం కొఱకు పెరిగివుంది. తీవ్రమైనగాలికి వాలిపోకుండా జడయల్లిక వేసి తను పైదండెం కట్టేస్తున్నాడు ఉదయం. కూలీల కనుగప్పి జొన్నచేని "గనిమ"పై కొళ్ళాడు. చాల రోజులుగా అతని కన్నుల్లో గంగు మెదులూ వుంది. అతని ఉల్లంలో ఇల్లుకట్టుకొంది.

గంగు అమార్గంలో పాలమెళ్ళాలి. పొంచి కూచున్నాడు. మరుగులోనుండి ముందుకొచ్చి ఆ పడుచుచేయి పట్టుకొన్నాడు. ఆమె లాగేసింది. పచ్చని గాజులు పగిలి నేల పాలైనాయి. రక్తం వచ్చిగా చేతికి తగిలింది. బెదురుతున్న ఆమెసుండెలలో తుపాను హోరు, సాగరతరంగఘోష వినిపిస్తుంది. చెమట బిందువుల్ని తుడుచుకొంది. ఫాలమునందున్న సింధూరతిలకము ధగధగద్యుతిలో దాగి, చెరగి, కళ తరిగిపోయింది.

ఇద్దరూ కొన్తసేపు పెదవి కదపలేదు. అతడే అన్నాడు.

“గంగూ! రాత్రి......”

“రాత్రికి, ఏంటే?”

“గ్రామం మాటుమణగినతర్వాత మా రెమ్మ గుడిదగ్గరకు...”

“రమ్మంటున్నావా బావా! అమ్మో గట్టైమగాడివే పెండ్లి కాని పడుచును రాత్రిలో రమ్మంటావు. పెద్దయ్యకు (ఫర్మా రెడ్డికి) తెలితే వుండు” అని దబాయించింది.

అతను కోపంగా చూచాడు.

“నేను రాలేను. నాకు భయం. నాన్నకు తెలిస్తే...”

“తెలిసేకదా? తెలియనీ తొందరగా పెళ్ళి చేసేస్తారు.”

“మా రెమ్మసాక్షిగా, ఈ పంట పొలం సాక్షిగా నువ్వే నా పెళ్ళాము. రాకపోయావా నామీదవొట్టు. పిల్లలకోడి నడినెత్తిమీదకొస్తే నేనక్కడ కొస్తాను. జాగర్త.”

గంగు తలూపింది బెరుగ్గా.

“నేనున్నానుగా భయమెందుకే!” అని దగ్గరగా జరిగి ఒద్దికగా గంగును ముద్దుపెట్టుకోదలిచాడు.

ఉలిక్కిపడి “అదుగో భూకామందు” అంది గంగు. అతను వదలిపేశాడు. గంగు నవ్వింది. అతను నవ్వలేక నవ్వాడు.

జొన్నకఱ్ఱలు కదిలాయి. అలికిడికి పిట్టలు ఎగిరాయి. ఏదో పొట్టేనక్క వెళుతుందని అనుకొన్నా, ఇప్పటికీ తన మనసులో శంకాహం ముల్లులా బాధిస్తూవుంది.

ఆ నవ్వు యింకా వినిపిస్తూనే వుంది. జొన్నకఱ్ఱలు కదుల్తూ, పిట్టలు ఎగురూ కన్పిస్తూనేవున్నాయి. ఉదయం జరిగిపోయిన విషయాలు మనఃఫలకంపై సాగిపోతున్నాయి. కళ్ళానికొచిల పచ్చికలో మూ తని పాదాలు, చీకటిదయ్యాలులా సాగివస్తున్నాయి. అతను తిరిగిచూచాడు. కళ్ళం చివర కట్టిన“దిష్టిబొమ్మ” సినిమాలో నాట్యంలా కదులుతూవుంది. ఒట్టి భ్రమ.

మధురమైన నిదురలో ప్రకృతి సుప్తావస్థలో నున్నది. కాని మల్లు మనస్సు మేలుకొన్నది. అంతులేని ఆలోచనలు పెట్టుకొని, కట్టకట్టుకొని వస్తున్నాయి.

దారితప్పిన పొట్టేనక్క కళ్ళానికి అడ్డం పడి పారిపోయింది.

తను గంగును కలుసుకోమని చెప్పటం తప్పు. అది వెళుతుంది. తాను లేకుండటం చూసి విసుక్కుంటూ యింటిదారి పడుతుంది. తాను చాల ఆత్రపడిపోయాడు.

మరల ఆలోచనలు వచ్చాయి. ఒకనాడు మబ్బుమాటున గంగుకోసం వాళ్ళింటికి వెళ్ళాడు. రెడ్డిగారు అక్కడ వున్నాడు. మాటలన్నీ ముగిసినట్లుంది.

“వచ్చేనెల్లో మంచి ముహూర్తాలున్నాయి. పెండ్లి జరిపించేస్తాం. మల్లన్నకు రెండెకరాలపుంజ, మూడెకరాలనంజ భూమి వ్రాసిరితర్వాతనే నీకూతుర్ని తీసుకుంటాంలే, రేపే రిజిస్ట్రేషను, పట్నంపోవాలి. నీకు సమ్మతమేకద రంగయ్యా!”

“పెద్దవారు. మీమాట కాదంటానా!” అన్నాడు రంగయ్య. మల్లుహృదయం ఆనందాతిరేకంతో పరవళ్లు త్రొక్కింది. ఆ విషయం చెప్పటానికే గంగును తను రమ్మంది.

నిదరకంటే మధురమైన సుఖం మరేదీ లేదు. ఈ లోకంలో, ఎదురుపడే బాధల్ని కొన్తమరచి నెమ్మదిగా జోకొట్టేమాతృమూర్తి నిద్ర. కష్టాలనంతిమొందించే మత్తుమందు నిద్ర.

పల్లెటూరు మాటుమణగింది. నల్లని చీకటి తెరలు దిశాంచలాలనుండి దిగజారి కావు కమ్మికప్పుకొన్నాయి. ఆ నీరవ నిశీధినీగర్భంలో స్తబ్ధనిశ్చల జడత్వం రాజ్యమేలుతూంది.

గువ్వగూటి ముందుకూడా నిశ్శబ్దం గూడుకట్టుకొంది. తమోభూతం తల విరయ బోసుకొని “తథిగిణతోం” అని గజ్జకట్టి ఆడసాగింది. మిణుగురు తన కాగడా విశ్రాంతికై నెళ్ళింది. కీచురాయి తన స పాఠశాలకు తాళం పెటింది. చీమ కూ నిదురించిందేమో? కాని గంగు కు మా కంటిపై రెప్పపడలేదు. గుండె బరుః కొట్టుకొంటూవుంది.



“లా వొక్కింతయు లేదు”

చిత్రకారుడు—డి. ఎస్. ఆర్. రా (ఏలూరు)

పెరటిలోనికి వచ్చింది. ఆ కాశం “పిల్లలకోడి” (కృత్తిక) అచూకీ క దలా. నల్లని చిగురుమబ్బులు అంత మంతా అవరించాయి. ఏదో తెలియ భయం, పాము విషంలా మనస్సులో ప్రాకసాగింది. గంగు యింట్లోకి పోయింది.

తన పెండ్లి పదిరోజులుకూడా లే అతని కెందుకింత ఆతురత. తనకు త ఆతురతే, ఎందుకు రమ్మన్నాడో యే ఒట్టుకూడా పెట్టుకొన్నాడు.

యౌవ్వన ప్రాదుర్భావంలో యువ యువకులు తమ విచేచన శక్తి నికో, తాగు. ఒక్క తప్పటడుగు చాలు జీవిత అధోగతి పట్టించటానికి, నైతికపతన నాంది పాడటానికి.

తీయని మాటలకు మోసపోయి బ్రతుకు నిప్పులు పోసుకుంటారు, ఈ ప్రే ఫలించి మంచిఫలితాల నివ్వవచ్చు.

ము ను ను చూ వ లే ని ఘోరపరిణామాలను ఊహించవచ్చు.

"రంగయ్య" ఇంటి పెరటిలో వెదురు తడిక కదిలింది. నల్లని ఆకారం బయటకు వచ్చింది. సీతాఫలం చెట్లనీడలో వడివడిగా నడుస్తూ పగ్గె దాటింది గంగు. రాగిమానురచ్చ దాటుతూవుంది. నిన్ననే యిక్కడ రాగి మానుకు వేపమానుకు శాస్త్రోక్తంగా పెండ్లి జరిపించారు.

మనుష్యులు నడయాడే అలికిడి అలించి పెడిగంట (పక్షి) జంటపక్షిని అదేపనిగా పిలువసాగింది. ఆమె చింతతోపులోకి వచ్చింది. మిణుగురులను మెక్కి మనుష్యులను చూచినపుడు కక్కి భూతం నిప్పులను కక్కుతున్నదనే భ్రమను కలుగజేస్తూ గూబ మూలుగుతూవుంది. నిప్పులు చల్లుతూ "లబ లబ" కొట్టుకుంటూ పసిపాపలా "కేరు" మంటూ గుడ్లగూబ భయపెడుతున్నా గంగు లక్ష్యపెట్టలేదు. తలపైకి చెంగు లాక్కొని ముందుకుసాగింది.

మారెమ్మగుడికి తూర్పుగా వల్లకాడు వుంది. దక్షిణంగా పంటకాలువ. దాని గట్టు మీద "కాశీకెలు"తోట గోడలాగవున్నాయి. పడమరగా పంట పొలాలు. ఉత్తరంగా చిట్టడివి వ్యాపించివుంది. పగలే మానిని మసలనివ్వని మారుమూల అది. అక్కడ జడముని శ్వరులు(జడలదయ్యాలు)వుంటారని గ్రామంలో కథలు చెబుతుంటారు.

గంగు గుడిప్రాంగణంలో అడుగుపెట్టింది.

మారెమ్మగుడి

ఏదో పొడవైన ఆకారం అస్పష్టంగా తన వైపే వస్తూవుంది. గంగు నరనరాలలో తెలియరాని అజ్ఞాతశక్తి భాగాలు గ్రుక్కుతూ వుంది.

పాపంలా పేరుకొన్న చీకటి; కాటుక పిరపినట్లున్న కటిక చీకటి. కన్నులుకానని కటిక-చీకటి.

ఉక్కుతీగల్లో బిగించినట్లు ఆ కౌగిలిలో తనపక్క టెముకలు నలిగిపోయేవి. విరిగిపోతాయేమో అని అనుమానం కలిగేది. ఊపిరి తిరిగేదికాదు. ఆవేగములేని దప్పని ...! కౌగిలి. అట్లాకాకుండా తాకీ తాకనట్టు నాజూగ్గా, బెదురూ, అదురూ, తడబడ్తూయీ చేతులు, తనను కౌగిలిలోకి తీసుకొంటున్నాయి. గంగుకు ఏదో అనుమానం వేసింది. విదిలించి వేసింది. గుప్పని సెంటువాసన తలకెక్కింది. అనుమానం సత్యమైంది.

"గంగూ! నేనే. ఎందుకో భయం?"

అమ్మో! ఆ కంఠం భూకామందు కొడుకు రాఘవులుది.

ఆమె తీవ్ర ఝంఝామారుతపాతకి ఆలంబనంలేని మాధవీలతలా కంపించి కుప్పగా కూలిపోయింది.

గంగు అతని పాదాలు పెనవేసుకొంది.

ఆవేశంతో గుండె పగిలిపోతుందేమో అని గట్టిగా అదిమిపట్టింది. మాటలు నోటినుండి వెలువడ నిరాకరించాయి.

"మల్లుబావ!"

అతను రాలేదు. కళ్లంలో ఉన్నాడు. ఆమె పారిపోజూచింది. పైటచెంగు అతని చేతికి చిక్కింది. ఆ యువతి యిసుకలో కూలిపోయింది.

కొంతసేపటికి గంగుకు స్మృతికలిగింది. తనమానం మంటకలిసింది. కన్యాత్వం కలుషితమయింది. తినిపారవేసినపులి విస్తరాకులా ఆ ముగుదకన్నెను నేలపాలుచేసి ఆ పశుప్రవృత్తిగల కర్కోటకుడు చీకటిలో ఎప్పుడో జారుకొన్నాడు.

గంగుకు తనశరీరం బరువుగా తోచింది. శిల్పిచే మలచినట్లున్న తన సుందర సుకుమార రూపం తనకే అసహ్యంగా కన్పించసాగింది. చెదరిన చీర సవరించుకొని బధిరాంగన లాగ ఆ చీకటిలో కలిసిపోయింది. పంటకాలువ గట్టుపై కూర్చుని "ఒరుడు" మోజరయితి దురాత్మ్య అని రోదించసాగింది. కాపుల చేరచే చుక్క తూరుపుదిశలో పొడిచింది.

పాశవిక శక్తులు పుడమిపై తమ ప్రళయాట్టహాసం విరమించే దెన్నడో! వేగుజామున గుడిలో పూజారి చెప్పే పూజామంత్రాలు లీలగా విన్పించసాగాయి.

కాకులు "కావుకావు" మని మేలుకొలుపులు పాడసాగాయి. పైరుగాలి కమ్మని సువాసనల్ని పులుముకొని వీవసాగింది. కల్లకపట మెరుగని పల్లెరైతు ఉల్లములా భళ్లన తెల్లవారింది. మల్లన్న ఒళ్లు వలగొట్టినట్లు బద్ధకంగా లేచాడు. కన్నులు కారంచల్లినట్లు మండుతున్నాయి. తల తిరగసాగింది. నా మొక్కినట్లు మత్తుగా వుంది.

"మరపగొట్టె"ల ఉన్నితో నేసిన కంబళి భుజాన వేసుకొని, కిర్రుచెప్పులు తొడుక్కొని, తుపాకి భుజాన తగిలించి, బరిసె ఊతకఱ్ఱగా గ్రామానికి బయలుదేరాడు. పీడకలలా రాత్రి గడిచిపోయింది.

పట్నంలో పెద్దపరీక్షలు వ్రాయటానికి చిన్నరెడ్డి రాఘవులు పెట్టె బెడ్డింగుతో ఎదురుపడ్డాడు. దూరంగా మల్లును చూచి గుండె జల్లుమంటే మరోమార్గంలో తప్పుకొన్నాడు.

"చిన్నబాబుగారూ! పరీక్షలు బాగా రాయండి. మారెమ్మ దయతలిస్తే కొమ్ములుతిరిగిన కోరపాట్టెలను కౌనుగ్గా యిచ్చుకొంటాంలే. తొరలో వచ్చేస్తారుకదా? మా పెళ్ళికి

రాకుండాపోయేరు. మీరే ముందుండి జరిపించాలి. పెళ్ళికొడుగ్గా మీరే నన్ను సింగారించాలి" అని మల్లు అమాయకంగా అన్నాడు.

"సరే మల్లూ! త్వరగా వచ్చేస్తాగా. నాన్నగారు అన్నీ చెప్తారులే. నీపై అయిదెకరాల భూమి రిజష్టరు చేయటానికి నాన్న పట్నం వస్తారులే."

"చిన బాబూ! ఒక్క మాట. నా పెళ్ళికి జరీఅంచు కాంచీపురం పట్టుకండువా కొనివ్వాలండి" అని కోరుకొన్నాడు.

"సరే!" అంటూ ముక్తసరిగా జవాబిచ్చి వంచినతల ఎత్తకుండా చిన్నబాబు ముందు సాగిపోయాడు. చినబాబుకు సాయంగా నాగిగాడు "స్టేషను" వెళుతున్నాడు.

మల్లు గ్రామంలో అడుగు పెట్టకముందే గంగు లేదన్నారు. అతడు నిరుత్తరుడై తల పైకెత్తి చూచాడు. కలుక్కుమని గుండెల్లో బరిసె దిగవేసినట్లు తల్లడిల్లి పోయాడు. గంగు రాత్రినుండి కన్పించటం లేదన్నారు.

మల్లు మారెమ్మ గుడివైపుగా పరుగెత్తాడు. ఎండిపోయి బీటలువారిన పంటకాలువ దగ్గరకు వచ్చాడు. ఇసుకలో నలిగి, వసివాడిన మల్లెపూలసరం కన్పించింది. పూలు తీసి హృదయానికి హత్తుకొన్నాడు. అతడికి అనుమానం బలపడింది. గంగు తనకోసం యిక్కడికి వచ్చింది.

అతడు మరింత ముందుకు వెళ్ళాడు. ధ్వజస్తంభము దగ్గర బలిపీఠంమీద పచ్చని పట్టు గాజులు పదిలంగా పెట్టబడి వున్నాయి. అవి గంగు చేతి గాజులే.

"మల్లుబావా! నన్ను క్షమించవా! క్షమించినానను బావా?" అని గాజులు పలికినట్లు తోచింది. అతని కన్నులు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

అనుమానం మరింత బలపడింది. దూరంగా ఎవరో వస్తున్నారు. వారుకూడా గంగును వెదకటానికే వస్తున్నారు.

బంజరు సాగు చేయించటానికి రెడ్డి తవ్వించిన బావి అక్కడికి దగ్గరగా వుంది. ఏడుమట్లు తవ్వినా తడిలేని బావి అది. ఒకే బండ చెమ్మలేని రాతిగుండును తొలచారు. కాని జల పడలేదు. వట్టి గొడ్డుబావని త్రవ్వటం మానుకున్నారు.

మల్లు అటే వెళుతున్నాడు. బావిలోనికి మల్లు తొంగిచూచాడు. రాతిగుండ్ల మధ్య గంగు.

అంతే "గంగూ!" అని గావుకేక పెట్టాడు. గుండె పగిలి పెళ్లలువారింది. బావిలోనికి జారిపోయాడు.

"పలుకురాయి" "గంగూ!" అంటూ ఉంది.

ప్రకృతి ఉసూరుమని నిట్టూర్చింది. ★



చిన్నారి పాప

టి. రామకోటీశ్వరరావు

తల్లిముఖమును చూచు వింత గలదంచో
గళ్ళు నులుముకొనును నేడ్చుఁ, గాలుకను త
నంత తాన ముఖంబున నలముకొనును
చెప్పరాని సంతోషాన చెలఁగి నవ్వు.

తల్లినొసట కుంకుమఁ గాంచి బుల్లి చేతి
తో చెఱపి, చేతికంటిన, తోష మొదవ
వ్రేలి నోటఁ బెట్టి చిఱునవ్వు బుడుతడు మ
నకుఁ దెలియని భాషనుఁ బల్కు నలరి యలరి.

పాలు త్రాగుచునుండి జ్ఞాపకమువచ్చి
నట్లు ముఖమెత్తి చూచి తనంత నవ్వు
తల్లి ముద్దాడఁ గేరుచు నల్లిబిల్లి
మాటలాడుచు తలయూచు మంకుఁ జూపు.

ఎట్టి సంతోషమో? దుఃఖ మెట్టిదొక్కొఁ
పాలబుగ్గల పసిడిఁ దాప, రతనాలు
వెలుఁగ బోసినవ్వు, జలజదళముపైన
నీటిచుక్కలఁ నేడ్పులో నింపు పాప.

కవితాకింకిణి
బహుమతి పొందిన కవిత

కొండపల్లి అంత అందంగా ఉంటుందని నా కిదివరకు ఎవరూ చెప్పలేదు. మా జీపు నారింజతోటల మధ్యనుంచి పాము బారలాంటి రోడ్డువెంట మెల్లగా పాకు తోంది. ముందుసీట్లో కూర్చొన్న సింగు కుడి భుజం జీపుముందు అద్దంలోంచి కన్పించే రోడ్డు సగం భాగాన్ని కప్పేసింది. లోప లంతా ఉక్కగా వుంది. రాళ్ళమధ్య, గతు కుల్లో పడి లేస్తూ నడుస్తోంది జీపు. బండి కుదుపుకంటె మనస్సు కుదుపు మరీ బాధ పెడ్తోంది నన్ను. ఉండుండి సింగు సిగరెట్టు వెలిగించాడు. లోపలంతా పొగ చుట్టేసి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

మనస్సుకు నచ్చని పని చేయిస్తోన్న సింగు మీద నాకు విపరీతమైన కోపం వస్తోంది. అప్పటికి ఆరు నెలలే అయింది నేను సెటిల్మెంటు ఆఫీసులో గుమాస్తాగా చేరి. నేను చేరిన మరి రెండు నెలలకే హైదరా బాదునుంచి బదిలీ చేయించుకుని ఆఫీసరుగా వచ్చాడు సింగు. మనిషి తరహా అంతా విచిత్రం. ఉద్యోగంలో పెద్దా చిన్నా ఏమీ పాటించకూడ దంటాడు. దండాలు పెట్ట డాలూ, చేతులుకట్టుకు నిలబడడాలూ అక్కరలేదని మొదటిరోజే చెప్పేశాడు. అందరూ అతని దగ్గరికి పోవచ్చు. అతను అందరితో కులాసాగా తిరుగుతాడు. అదీ ఇప్పటి పద్ధతి.

ఏభైమంది గిరిజనులకు కొండపల్లి ఖిల్లా ప్రాంతంలో సెటిల్మెంటులు నిర్మించాలంటే నన్నా పనికి నియమించాడు సింగు. అసలే విజయవాడ ప్రయాణంతో విసిగిఉన్న నాకు ఇది మరీ కంటకమయింది. ఓరోజంతా చెప్ప కున్నాను. అంతా విని బిగ్గరగా నవ్వుతాడు. "కొండపల్లి అంటే ఆటబొమ్మలే గుర్తులా వుంది నీకు-మంచి తోటల్నీ, కావల్సినంత ఆకాశాన్నీ, ఇంకా కావలిస్తే అందాన్నీ చూపిస్తాను పద" అని వెంటపెట్టుకు బయలు దేరాడు.

తీరా విజయ వాడ పొలిమేర లు దాటేసరికి సింగు చెప్పినమా ట వాస్తవ మనిపించింది.

"కథలు వ్రాస్తానంటావ్? ఆ మాత్రం పెర్స్పెక్టివ్ లేకపోతే ఎలా గోయ్!-ఈ నారింజతోటలు చూడు —మరి రెండు మైళ్ళు పోతేమామిడి తోపూ, కొండలూ బ్రహ్మాండంగా కనిపిస్తాయి" అంటూ సిగరెట్టుపొగ వదులుతున్నాడు సింగు.

ఇరవై యేళ్లు ఆంధ్రలోనే గడపడంవల్ల తెలుగు బాగావచ్చు నతనికి. ఇంకా కావలిస్తే కొందరు తెలుగు రచయితల గేయాలు కూడా చదువుతాడు. అయితే సిన్సియర్ గా ప్రతి మాటా చెప్పాలన్న తాపత్రయంతో మాటలు కృతకంగా వస్తాయి. ప్రతి చిన్న పదాన్నీ పంజాబీలోలాగా పట్టిపట్టి ఉచ్చరిస్తాడు—

"ఏంకి-మీ కవులకి నారింజతోటలు చాలవూ? ఇక్కడ కవిత్వం చెప్పలేనివాడివి విజయవాడ పందుల మధ్య, బజారు మనుషుల మధ్య ఏం చేస్తావ్?-సెటిల్మెంటు పని పూర్తయేసరికి పెద్ద కావ్యం తయారవాలి. కలెక్టరుగారికి అంకితం ఇప్పిస్తాను."

"నేను కవిని కాదు, రచయితని" అని ఉందామని వంగి చెప్పబోతే చుట్టపొగ గొంతుకి ఓ దగ్గుతో ఉక్కుతిప్పింది.

నవ్వు ప్రారంభించాడు నామాట విని—

"రచయితలంటే కథ



నిషాద

రాదు. జీవితంలో ఎందుకూ పనికిరాని వాడు రచయిత అవుతాడని మా భావంలో సామెతవుంది-నీ విషయంలో అది నిజంకా దనుకో-అదిగో, కొండపల్లి ఖిల్లా-ఆపవోయ్ జాన్!"-అని అరిచాడు డ్రైవరువేపు తిరిగి.

ఫ్లాస్కు భుజానికి తగిలించి, జీపు దిగి నడవడం ప్రారంభించాడు. నన్నూ దిగమన్నాడు. జీపుని ఖిల్లాముందుకు తీసుకు రమ్మని జాన్‌కు చెప్పాడు.

"మొదట ఇంత కాఫీ పుచ్చుకొందాం-లేకపోతే కడుపు సహాయనిరాకరణ చేస్తుంది" అన్నాడు-రాయిమీద కూర్చుని ఫ్లాస్కు తీశాడు.

ఖిల్లాదూరంగా కొండవేపు కన్పిస్తోంది. కొండపాదాలను తాకే నీలపునీరు - పక్కనే, ముదురు ఆకుపచ్చలో ఒత్తుగా పెరిగిన పిచ్చి చెట్లూ-పదిగంటల ఎండకి వెండిలా మెరిసే తెల్లటి మేఘం-తెలీని చిత్రకారుడి త్రివర్ణ చిత్రంలా వుంది.

"చాలా బాగుంది. ఇక్కడ కొన్నాళ్లుంటే నేను తేరుకుంటాను."

"అదిగో. అప్పుడే చుట్టూ చూసి మూర్ఛపోతున్నావ్. రచయిత తాను పొళ్ళు మరిచి పోకూడదు. ఇతరులలో ఆ భావాన్ని కలిగించాలి. మొదట కాఫీ సేవించు" అన్నాడు.

ఆఫీసరని ఎంతవినయంగా ప్రవర్తించడానికి ప్రయత్నించినా అవకాశం యివ్వడుసింగు. అతనిలోని సెన్స్ ఆఫ్ హ్యూమర్ విస్తుపోయేట్టు చేస్తుంది. మాటిమాటికీ - అదే ఆలోచిస్తూ నడుస్తున్నాడు—

"హైదరాబాదు చాలా అందమైన ఊరంటారే! (నేనెప్పుడూ చూడలేదు.) అక్కణ్ణుంచి వచ్చేశారేం?"

అదివిని సింగు ఒకటే నవ్వు-కాస్సేపటికి ప్రారంభించాడు. "ఎంతో అందమైనవన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయ్ భయ్యా!-ఉదాహరణకి కలువపువ్వూ, వెలయేరూ-ఇవా నేనెందుకు వచ్చేశానంటావా?-ప్రేమలోగుంజాటన పడడానికి విసుగేసింది ఒక్క రహస్యం చెప్తాను విను - ఎవరినయినా ప్రేమించుగాని, ...



యువతిని మాత్రం... పోనీ, ఎందుకంటే ఆ విషయం" నాభుజంమీద చెయ్యేసి కావాలని కుంటుతూ నడుస్తున్నాడు. నాకతని ప్రతీ మాటా వింతగా నే తోస్తోంది.

"అయితే మీకూ ప్రేమ..."

భుజంతట్టాడు. "ప్రేమలో ఉంటే తమాషాయే అది - దానిగురించి ఆలోచించి నంతసేపూ తెలిసుంది. ఆలోచించే తీరిక చిక్కేలోపల నీకు తెలీకుండానే ముంచే స్తుంది. నన్ను ముంచేయకుండానే హైదరాబాదు ప్రేమనుంచి విజయవాడ పందులమధ్య పడ్డాను-పెద్ద కాంట్రాక్టు"—జేబులోంచి నల్లద్దాల కళ్ళజోడు తీసితగిలించాడు.

ఇద్దరు సబార్డినేట్స్ దారిలో కలిశారు. ఎవరో పాతదేవుడి దేవాలయంతో ఊరు ప్రారంభమయింది. ఊరేం పెద్దదికాదు - వరసగా 60 గడప కనిపించాయి - పక్కకి తిరగగానే మళ్ళీ పెద్దఖాళీస్థలం...చివర అరటితోట - అక్కడి నీడల్లో కూర్చోవా లన్న ఆసక్తి కలిగించేట్టు-

గ్రౌండ్సుమధ్య మా జీపు కన్పించింది.

"మనజాన్‌కీ అందం పిచ్చి తలకెక్కు తుంది"-అన్నాడు సింగ్ జీప్‌నుచూసి-

జాన్ నీలిరంగు పాంటు ఎండలో కళ్ళు చెదిరిస్తోంది. మమ్మల్ని చూసి గ్రౌండ్సుకు మధ్యగా పరిగెత్తుకు వచ్చాడు.

మన క్వార్టర్స్ అటువేపుటసార్-అప్పుడే మీరు ఫర్లాంగుదాటి వచ్చేశారు"—అన్నాడు.

మళ్ళీ జీపు ఎక్కాం. ఎత్తు పల్లాల్ని చూడకుండా తీసుకుపోతున్నాడు జాన్ - మరో 20 నిమిషాలకి కాస్త విశాలమైన స్థలానికి చేరాం. ఎదురుగ్గా పాఠశాల, ఆ పక్కనే వరసగా పది గుడిసెలు, యిటు పక్క అన్నిటికంటె కాస్త ఎత్తుగా ఒక పసుపు పచ్చటిమేడ. పక్కన మట్టి యిళ్ళు ఓ యిరవై-యిదీ అక్కడ దృశ్యం—

ఎన్నాళ్ళగానో తెలిసినట్టు పసుపుపచ్చ మేడముందు నిలబడిన ముసలమ్మ నమస్కారం చేస్తోంది—

"ఇదేసార్-మన క్వార్టర్స్-" అన్నాడు జాన్—

మేడకు ముందు సన్నజాజి పందిరా, రెండు పక్కలా బంతిమొక్కలూ- ఓపక్క మరీమూలకి నైట్‌క్వీన్-చిన్న రైలుపెట్టెలా వుంది మేడ అంతా.

"ఈ ఊరులో ఈ మేడ సుఖానికి సింబల్ లాగ వుంది. నువ్వు చాలా అదృష్టవంతుడివి-ఖర్చు లన్నీ గవర్నమెంటుకి జమ అయ్యేట్టు చూస్తాడే" అంటున్నాడు సింగు-

మేడ బాగానే వుంది-ముందు తోటలో చిన్న సిమెంటుబెంచీ, ఓపక్క చేరబడడానికి, ఎవరో ముసలివాళ్లుకూర్చోడానికి వీలుగా ఎత్తు దిమ్మలూ, వేశారు. మెట్లెక్కగానే ఎవరిదో పెద్దఫోటో హాలులో కన్పిస్తోంది. కొండపల్లి బొమ్మల వర్తకం చేసే యజమాని చిత్రపట

నిదురపోయే సెలయేరు

మది. కొన్నాళ్ళ క్రితం జరిగిన రైలు ప్రమాదంలో అతను మరణించాడని తర్వాత అక్కడి వాళ్ళు చెప్పారు. ఇంత పెద్ద మేడలో నే నొక్కడినే ఉండాలేమోనన్న బెంగపట్టు కుంది. ఆగలేక సింగుని అడిగేశాను.

"రచయితలంత పిరికివాళ్లు మరొకరుండ రోయ్-ఈపనిమనిషి నీకు తోడు"అన్నాడు.

డెబ్బై దాటిన ముసలి శరీరాన్ని చూసే సరికి జుగుప్స కలిగింది—ముఖమంతా నవ్వు చేసుకుని గోడకి ఆనుకు నిలబడ్డది ఆమె.

పెండ్లి చూడడానికి పొరుగూరికి వెళ్లుతున్న అబ్బాయి టైమ్ అయిపోవడంచేత పరుగు పరుగున రైల్వేస్టేషన్ చేరుకొన్నాడు. అప్పుడే బండి కదులుతున్నది.

ఆ అబ్బాయి తొందరగా "సార్, టిక్కెట్ పోతోంది. రైలు ఇవ్వండి సార్" అని కేక వేశాడు.

"ఈ సందులో పట్టదండి" అన్నాడు బుకింగ్ గుమాస్తా నవ్వుతూ.

—యాగంటి రెడ్డెన్న (నరసింగాపురం)

వంగిన నడుంని వినయం మరికాస్త వంచింది. నా చికాకుని గమనించి—"పోనీ ఈమె వద్దులే, మంచి అమ్మాయిని ఏర్పాటు చేయిస్తాను"—అనేశాడు సింగు.

ముసలామెకు విన్పించదుకూడా కొబోలు చెవులకి చెయ్యి అడ్డం ఉంచుకుని సగంమాటల్ని అర్థం చేసుకుంది. "ఉద్యోగం తీసేయకండి బాబూ! పదివేళ్ళనుంచీ యీ మేడలో పనిచేస్తున్నాను" అంది-సింగు విన్పించుకోలేదు. మేడ మెట్లు ఎక్కుతున్నాడు.

"రేపట్నుంచీ దాని అమ్మాయి వస్తుందిట సార్, పనికి. ఇవాళ కొండవేపు పుల్లలు ఏరుకు రావడానికి వెళ్లిందట"- అన్నాడు జాన్ బాల్కనీలో నిలబడ్డమాదగ్గరికి వచ్చి.

"నాకేం అభ్యంతరం లేదు ఏమంటావ్?"

అన్నట్టు నావేపు చూశాడు. "ఎవరో ఒకరు రానీయండి" అన్నాను-భుజానికి అయిన దుమ్మున్ని దులుపుకొంటూ—

అక్కడికి మేం యిళ్ళు కట్టించాల్సిన స్థలం మూడు ఫర్లాంగు లుంటుంది. మేడమీద నిలబడితే దూరంగా ఎవరిదో మసీదూ, ఆ పక్కనే ఖాళీస్థలం కన్పిస్తూంది. జేగురురంగు ఆకారంలో కొండలూ - దుబ్బుగా పెరిగిన చెట్లూ—

ముగ్గురు ఉద్యోగుల్ని నాకు అప్పగించేసి ఒక్కరోజు ఉండమన్నా వీలుండదని సాయంకాలమే వెళ్లిపోయాడుసింగు. ఓపక్క ఊరు ప్రశాంతత బావున్నా, ఏదోపిరికితనం మనస్సును పీకుతూ నేవుంది. ఆ మేడలో గదు లేవీ లేవు—అన్నీ హాలులే. మీద బాల్కనీలో కుర్చీ వేయించుకు రాత్రంతా గడిపాను—

లేచేసరికి వొళ్లంతా మంచులోతడిసి ముద్దయింది. కాలుకదపబోతే నరాలు తిరుగుబాటు చేస్తున్నాయి. ఇక్కడ పడుకోవడం మంచిదికాదని ఎవరూ చెప్పలేదు. తీరా ఫలితం అనుభవించాక అక్కడి అందరిమీదా విసుగేసింది—

తెల్లవారుఝామున మంచినీళ్లకని లేచి వెలిగించిన కొవ్వొత్తి నీరుకారి బల్లనిండా పాకి తెల్లటిచారకట్టింది. దగ్గరికి వచ్చి కత్తితో చారని తొలగించబోతే రెక్క తెగిన పురుగులు రెండు చచ్చికన్పించాయి—

కాఫీ తాగాలనిపించింది. తల దిమ్ముగా ఏపని చేయడానికీ తోచడంలేదు. అక్కడెవరి పేరూ తెలీదు. జాన్ సింగును తీసుకు విజయవాడ వెళ్ళిపోయివుంటాడని తెలిసి కూడా 'జాన్!'అని అరిచాను. హాలంతా ప్రతిధ్వనిస్తోంది. నిజంగానే తలచుట్టూ మఫ్లర్ తిప్పుకొంటూ జాన్‌వచ్చేసరికి విస్తుపోయాను.

"వెళ్ల లేదూ విజయవాడకి?"

"వెళ్లి అరగంటక్రితమే వచ్చేశానుసార్-టాప్‌స్పీడ్. మీరిక్కడ మొహమాటపడతారేమోనని సింగ్‌గారు తొందరగా పంపేశారు సార్ —మొహంకడుక్కోండిసార్— మంచి టీ రెడీ చేయిస్తాను" — హుషారుగా బయటికి పరిగెత్తుతున్నాడు-

"టీ వద్దుకాని—కాఫీ దొరుకుతుందేమో చూడు."

"ఆల్‌రైట్ సార్ —"అని గదిబైటికివచ్చి 'పంకజం'అని అరుస్తున్నాడు.

"ఎవరా పంకజం?"

మొహం చేటంత చేసుకొని మళ్లీ గదిలోకి వచ్చాడు. "నిన్నటిముసిల్ది లేదుసార్-దాని కూతురు. మాభలేచురుగ్గా పనిచేస్తుంది-కాఫీ పంపిస్తానుండండి" మెట్లన్నీ మూడుఅంగల్లో దిగాడు.

కళ్లింకా విడడంలేదు. మళ్లీ పరుపు పరు

ముకు వడుకుం టేశావున్ను. అయినా కాఫీ తాగితే కాస్త స్వస్థిమితం చిక్కుతుందనే ఆశ ఉండిపోయింది. బ్రష్పట్టుకుని, తువ్వాలు భుజంమీద వేసుకొని కిందికిదిగబోతే కింద మెట్లమీద ఏదో పాటగొణుగుతూ తుడుస్తున్నారెవరో—

వంగపువ్వు రంగుకోక, ఎర్రగా బిగుతుగా బుజాల్ని పట్టుకున్న రవికా, ముక్కు కన్పించకుండా పెద్దనత్తూ, చేతికున్న రెండు గాజులు శబ్దమయ్యేలాగు చీపురు తిప్పుతూ ఒక్కొక్కమెట్టే ఎక్కుతోంది—

నేను అయిదుమెట్లు దిగేసరికి అప్పుడే పదిమెట్లు ఎక్కేసింది. పొరపాటున బ్రష్ జారి మూడుమెట్లుకింద పడితే, ఒక్కసారి చెదిరి తలెత్తింది. విశాలమైన నుదురునీడలో పొడుంరంగుబొట్టూ, ముక్కు తళతళమని మెరుస్తూ తెల్లనిజిగి, మెడలో ఎర్రటి పూసలు సన్నటిమెడచుట్టూ రక్తంగీతలాగ— ముఖ్యంగా పెదాలు—అంత ఆశ్చర్యంలోనూ క్రిందపెదవిని నొక్కిపెడితే పెద్దఆరిందాలాగా కన్పించింది. అంతలో భయపడి గోడకి ఆనుకు నిలబడి నాకు తోవచేస్తూ—

మరీ అంత నలుపుకాని ముఖాన్ని చూస్తూ ఆగిపోయాను—మెడమీద రెండు ముడుతలూ శంఖంమీద చారల్లా కన్పించాయి—ఎంతకీ మాట్లాడదు. జాన్ చెప్పిన పేరు గుర్తుంది.

"ఎంత టైమయిందిప్పుడు?"

మాట్లాడదు. అసలు నావేపే చూడడం లేదు. గోడకి అంటుకు నిలబడి నాకు దారి చేసింది. రంగుచీరెతో గోడకి అంటుకుంటే సీతాకోక చిలుక వాలినట్టుంది—నవ్వొచ్చింది. ఇంకా నేనక్కడే నిలబడితే "ఎంతసేపు యిట్లా?" అన్నట్టు భయంగా చూస్తోంది.

అరగంట గడిచాక నేను మేడమీదకి వస్తే బాల్కనీ గోడకి చేరబడి కూచొని తదేకంగా బయటికి చూస్తోంది. టేబులుమీద కాఫీ చల్లారిపోయింది—నాకంతా పంకజం మీదే దృష్టి. ఎండవెలుగు స్తంభంమీద పడి కదులుతోంది—అద్దంలో పంకజం నల్లటి ముఖంమీద సూర్యుడివెలుగు వింతరంగు దిద్దినట్టనిపించింది.

"చల్లారితే కాఫీ మూతపెట్టలేకపోయావ్?"

మాట్లాడదు.

ఆమెవేపు నడవబోతే కాలిలో బలంగా గాజుపెంకు దిగి రక్తం చిమ్మింది. నేలమీద చూస్తే ఏదో ప్రకృతి చిత్రపటం విరిగి ముక్కలయి పడివుంది.

పంకజం యిటు తిరిగింది—నా కాలు రక్తం చూసి కూర్చొని పిచ్చిగా ఏడుస్తోంది. నేను దిమ్మరపోయాను.

"నాకు దెబ్బతగిలితే నువ్వు ఏడుస్తావేమిటి?" అంటే వినదు. స్తంభానికి చేరబడి ఒకటే ఏడుపు.

జాన్ పరుగెత్తుకువచ్చాడు: "ఏమయింది సార్" అంటూ.

"నాకు కాలిలో గాజుపెంకు దిగింది— అదిసరే, ఆ అమ్మాయి అట్లా ఏడుస్తుందేం?- ఊరుకోమను—"

దగ్గరికివెళ్లి సంజ్ఞ చేస్తున్నాడు జాన్, ఏం జరిగిందని.

"మాట్లాడదేం? ఎంత అడిగినా?"

నవ్వుతాడు. "దానికి మాటలావుటసార్- —నాకూ యింతకుముందు తెలీదు. ఇప్పుడే వాళ్లమ్మ చెప్పింది."

నేను నిర్ఘాంతపోయాను. పంకజం యింకా ఏడుస్తూనేవుంది. రక్తంమీద హీమోగ్లోబిన్ పొర పేరుకుంది.

జాన్ ఆమె ఎదురుగా చదికలబడ్డాడు— ఏదో సంజ్ఞలు చేస్తోంది. నేలమీద గీతలు గీసింది. మళ్ళీ ఏడుస్తోంది. ఊరుకోమ్మని నోరుమూశాడు జాన్. యింకా ఏడుస్తోంది. రెక్కపట్టుకుని బయటికి పంపించేసివచ్చాడు.

"ఏమయింది?"

"పటాలు తుడుస్తూంటే ఇది కిందపడి పగిలిందట. మీరేమైనా అనుకుంటారేమోనని భయపడి నిలబడిపోయింది ఇంతలో మీకాలి దెబ్బచూసి భయపడి ఏడ్చేసింది-పిరికిమనిషి."

నేలన కూచుని తడిగుడ్డ తెచ్చి గాజుపెంకుల్ని పోగుచేశాడు జాన్.

"అయితే మాటలావా జాన్?"

"సందేహంలేదు సార్ ఏమో-చురుకు మనిషి అనుకున్నాను-బొత్తిగా ధైర్యం లేదండి"-ఇంకా నవ్వుతున్నాడు.

కాఫీ తాగిన కాస్సేపటికి మత్తంతా వదిలిపోయింది. నలుగురు ఉద్యోగులూ పదిగంటలకు వచ్చి పని మాసుకు వెళిపోయారు. ఇంజనీరు వచ్చి 'ప్లాను చూడడానికి వస్తారా?' అన్నాడు. "సాయంకాలం వస్తాను. ఆరోగ్యం బాగుండలేదు. ఈలోగా పని ప్రారంభించండి" అన్నాను.

పదెకరాల మేరలో అప్పుడే కూలీలు పని చేస్తున్నారు నేను వెళ్ళేసరికి. నా అజమాయిషీలో ఉంచిన ఉద్యోగులలో ఒకడైన విఠలరావు ఎన్ని యిళ్ళు లేచేదీ, ఎక్కడ షెడ్లు లేచేదీ చెప్తున్నాడు. స్థలానికి కుడివేపు పెద్ద సెలయేరు. ఇళ్ళు లేచాక సెలయేటి అందం పెరుగుతుం దనిపించింది. ఇప్పుడంతా బోసిపోయినట్టు, సరుగుడు చెట్ల గాలిని పంచుకొంటూ నిద్రపోతోంది - మందంగాపోతూ మరీ అంత పెద్దవికాని రాళ్లని దొర్లించడం, యింకా జాగ్రత్తగా పరీక్షిస్తే చిన్న గలగలలు ఆహ్లాదం కలిగించేవిగా ఉన్నాయి. ఎడమవేపు వరసగా పాతిన సర్వే చెట్లు. ఆ పైన తెల్లగా పాపిటలాగు పొడావు పాటి యిసుకబాట. అడపాతడపా బస్సులు

కారంటుపోయినప్పుడు విపరీతంగా దుమ్ము లేస్తుంది. ఎదురుగ్గా కొండపాదాల్ని ఒరుసుకొంటూ సెలయేరు మలుపు తిరిగి—

చేతిలో ఉన్న ప్లాట్లు చూడాలనిపించడం లేదు. వాటినలాగే పట్టుకుని దూరాన ఒక రాతిమీదకు వచ్చి కూచున్నాను. జీపు ముందు డోర్‌కు చేరబడి కూచొని ఆసాయం కాలాన్ని అతనే పాలిస్తున్నట్టు సిగరెట్టు కాలుస్తున్నాడు జాక్, పని చేసే కూలీలతో పిచ్చాపాటీ సాగిస్తూ.

ఒడ్డుదాకా గెంతుతూ వెళ్ళి నీటిలో

నిదురపోవే సెలయేరు

రెక్క తడుపుకొంటోంది కొక్కి.

బాగా చీకటి పడడం నాకు తెలీదు—

“లెవేటరీలు కుడివేపు వరసగా వేయిస్తే బావుంటుంది. సెలయేటినీరు అక్కరకు వస్తుంది. ప్లాటు కనిపించదేమో-కొవ్వొత్తి తీసుకొచ్చాను” అంటూ విమలరావు వచ్చి నా చేతిలో కాగితాలు అలానే ఉండడం చూసి విస్తుపోయేడు.

“అవును, కుడివేపే బావుంటాయి. సెలయేటినీటిని అలా వుపయోగించడం బావుండదు. బంతిమొక్కలు తెప్పించండి. ప్లాట్లు బావున్నాయి”అని అబద్ధం చెప్పేశాను. నా పరాకుని అంత సులువుగా అర్థం చేసుకోడు విమలరావు. అందుకని అబద్ధాన్ని ఆసరా చేసుకోవడం తప్పనిసరయింది. విమలంవు వెళ్ళిపోయాడు—

దీపం పట్టుకుని ఎవరో కూలీ వచ్చాడు. అటు తిరిగితే దీపం నీడలో మరెవరో వ్యక్తి కూడా కనిపించారు. ఎర్రటి కెంపు రంగుచీరె తెలుస్తోంది—

ఎవరన్నాను.

"చెప్పు" అని నీడలో ఉన్న వ్యక్తిని ముందుకు తోస్తున్నాడు. దీపం వెలుగులోకి వస్తే పంకజాన్ని గుర్తుపట్టి ఆశ్చర్యపోయాను.

ఇంకా తడబడుతోంది. "ఏం?" అన్నాను. కాని వెంటనే ఆమెకు అర్థంకాదన్న విషయం స్ఫురించింది—

"మీ కేదో ఉత్తరం వచ్చిందటండి—మా కియ్యమంటే యివ్వదు. మీకే యిస్తానంది."

ఇంకా అలాగే నిలబడి తటపటాయిస్తోంది.

"నూరయ్యా!" అని అరుస్తున్నాడు కంట్రాక్టరు.

"నేను వస్తా బాబూ—రోజు డబ్బులు పుచ్చుకోవాలి" అని దీపం వదిలి పారిపోయాడు కూలీ.

"కూచో" అని సంజ్ఞ చేస్తే ఆమెకు బోధపడలేదు.

కొంగులోంచి తీసి ఓ టెలిగ్రాం ఇచ్చింది—సింగు మధ్యాహ్నం పంపాడు. ఇంత త్వరలో టెలిగ్రాం ఎందుకో అని ఆశ్చర్యమేసింది. తీరా చూస్తే నన్ను ఉత్సాహపరచడానికి ప్రయత్నం — మాంచి ముక్కజొన్నకండెలూ, ఓ పాతిక పుస్తకాలూ పంపుతున్నాడట. నిరుత్సాహపడకు — అని వ్రాశాడు. నేను బిగ్గరగా నవ్వుతూంటే వింతగా చూస్తోంది పంకజం.

చేయిపట్టుకు ఎదురుగ్గావున్న రాయిమీద కూచోపెట్టాను. త్వరత్వరగా మూగవాళ్ళతో మాట్లాడడం నేర్చుకోవాలనిపించింది. మొదటిపాఠం ప్రారంభించాను.

"నీపేరేమిటి?" అన్నాను వీలయినంతవరకు సంజ్ఞలను ఉపయోగిస్తూ.

మొదట చెప్పడానికి సిగ్గుపడింది. ఏదో అనబోయింది— నా కింకా అర్థంకాకపోవడం చూసి రాతిమీద వేలుతో పేద్ద అక్షరాలు రాసింది. "పం...క...జం".

ఒక్కసారి మాట్లాడిస్తే ఏవేవో చెప్తోంది— ఉత్తరం తీసుకురావడానికి చాలా అలసిపోయాను అంటున్నట్టుంది బహుశా—వింటూ కూచున్నాను.

"ఇక పోదామా సార్ — చీకటి పడింది" అంటూ వచ్చాడు జాన్.

"జీప్‌లో వస్తావా?" అన్నాను లేచి.

అర్థంకాలేదు — సంజ్ఞ చేశాను.

"ఇదెందుకు సార్ — వాళ్ళ మావ ఎవడో ఉన్నాడు. వాడితో పోతుంది" అంటున్నాడు జాన్.

"పరవాలేదులే. ఇటువేపు తీసుకురా జీప్‌ను" అని నడిచాను.

జీప్‌లో కూర్చున్న దగ్గర్నుంచీ ఒకటే హడావుడి చేస్తోంది పంకజం. వెనకసీట్లో పక్కనే ఒదిగి కూచుంది. బండ గతుకుల్లో లేచి పడినప్పుడల్లా పక్క ఊచని పట్టుకుని తుళ్ళిపడుతోంది. ఉండుండి రోడ్డుమీద పోయేవాళ్ళని పిలిచి, పెద్ద కేకలుపెట్టి పలకరిస్తోంది. అంతా విచిత్రంగా చూస్తున్నాను. ఆమె అరుస్తున్నకొద్దీ జాన్ మరీ గతుకుల్లో పోనిస్తున్నాడు జీప్‌ను.

మలుపు తిరగడంతో తూలి భుజానికి ఆనుకుంది. తలలో పిచ్చిపువ్వులు ముఖానికి రాసుకుంటున్నాయి. పువ్వుల్లో సువాసనలేదు — పచ్చిఆకులవాసన బుర్రంతా వ్యాపించింది— మౌనంగా బయటికి చూస్తూ కూచున్నాను— ఉండుండి లోపలలైటు వెలిగించాడు జాన్. అంత వెలుగు చూడలేక ఒక్కసారి కళ్ళుమూసుకొని జారిపోయిన పమిటను వెదుక్కుంటోంది. నావేపు వింతగా చూస్తోంది. ముఖానికి గుచ్చుకొంటున్నాయని తలలో పువ్వులు తీసేశాను. లేత కనకాంబరం రంగు వెలుగులో ఒలిసినట్టు కనిపించింది.

దీపం ఉంచవద్దని జాన్ భుజంమీద కొట్టింది. వాడు నవ్వుతున్నాడు. కాస్సేపటికి ఆర్పేశాడు. ఇంక అల్లరి చెయ్యలేదు పంకజం—

నా వీపుకు వెనక 'రెయిల్' గుచ్చుకొంటోంది. అంతయిరుకులో తప్పించుకోవడం సాధ్యంకావడంలేదు. కొద్దిగా లేవబోతే బండ గతుకులో పడింది. తూలిపోయి పక్కకి జారబోయాను. పంకజం ఆపింది. మెడమీంచి ఎడమ భుజంమీదికి చెయ్యి వేసింది. వీపుని వెచ్చనిశ్వాస కాలుస్తోంది. రొమ్ము బలంగా భుజాన్ని ఆనుకుంది. బండి నడిచే శబ్దంలో గాలి రివ్వుమంటూంది. లేవాలనిపించడంలేదు—నుదుటికి చిన్నదెబ్బ తగిలి జివ్వుమంటోంది. పంకజం చీకటలో దొంగలా మాట్లాడ్డంలేదు. కుడిభుజం చెమటపట్టి నావీపంతా తడిసింది. తప్పించుకోకుండా భుజంమీద చెయ్యివేసి దగ్గరగా అదుముకున్నాను. పెద్ద అపాయంనుంచి తప్పించుకోనెందుకు అవకాశం దొరికినట్టు ఒదిగిపోయి - యింకా కుంచుకుపోయి - చేతుల్లో యిమిడిపోయింది పంకజం

మేడముందు జీప్ టాప్‌లైటు వెలిగించాడు. పంకజం వెలుగులో ముఖం చూడలేకపోతోంది. పువ్వులకోసం తల వెదుక్కుని నా చేతిలో చూసి నవ్వుకొంది. ముణుకుల మధ్య తల ఆనించుకు యింకా అలానే కూచొంది.

"జీప్ ప్రయాణం బాగా వంటపట్టినట్టుందే! దిగు" అని చెయ్యిపట్టుకొని లాగుతున్నాడు జాన్. వాడివేపు చురచురా చూస్తూ ఉన్నట్టుండి ఒక్కసారి చెంపమీద కొట్టి గెంతు గెంతి పారిపోయింది. నివ్వెరపోయాడు జాన్—

నాకు ఒకటే నవ్వు —

పెద్దమనిషి—ఏరా, రాముా, మీ నాన్న ఏడీ?

రాము—జపానికి వెళ్ళారు.

పె. మ.—అదేమిటిరా? నిన్న సాయంత్రం చీకటిపడేదాకా మాట్లాడుకున్నాము. మరి మీ నాన్న మాటవరసకైనా నాతో విదేశయాత్రకు వెడుతున్నట్లు చెప్పలేదేం?

రాము—జపాన్‌కి కాదండి జపానికి.

—మోహన్ (విజయనగరం)

ఆ తర్వాత చాలా విషయాలు త్వరత్వరగా జరిగిపోయాయి; పంకజం యిరవై నాలుగు గంటలు యిక్కడే మేడలో ఉంటుందనీ, కొత్తగా వచ్చినాయన దాన్ని తనతో తీసుకువెళ్తాడంట, అంటూ చాలామంది ఊళ్ళో గుసగుసలు ప్రారంభించారని జాన్ చెప్పాడు. నేను నిర్ఘాంతపోయాను. ఆలోచించినకొద్దీ భయమేసింది.

క్రోటన్సు మొక్కలకి నీళ్ళు పోస్తోంది పంకజం. ఈ విషయమంతా చెప్పేసి "నువ్వేమంటావ్?" అని అడగాలని వుంది. ఒక్కసారిగా బెదిరిపోయి ఏడుస్తుందేమో — ఇన్ని విషయాలు ఎలా చెప్పాలో తెలీదు నాకు. కుర్చీమీద ఎండపడి నుదుటిని కాలుస్తోంది. "కాఫీ కావాలా బాబూ" అంటూ ముసిల్ది వచ్చింది.

"ఇదిగో చూడు" అని పిలిచానే కాని ఏం చెప్పాలో తోచలేదు.

"పంకజం గురించి ఊళ్ళో చాలా మంది ఏవేవో అనుకొంటున్నారట."

మొదట తెల్లబోయింది వృద్ధురాలు.

"ఎవరు బాబూ!"


"పోనీ నాగురించి—అనుకుంటున్నారా?"

"ఏ విషయం బాబూ!"

విసుగేసింది, అంతా చెప్పడానికి— "ఇదిగో— అమ్మీ వాళ్ళేమనుకున్నా నాకనవసరం— రేపట్నుంచి పంకజాన్ని యిక్కడ పనిచెయ్యవద్దని చెప్పు. నువ్వే పనిలోకి రా —"

మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఆలోచిస్తే ఉదయం తొందరపడ్డానేమో ననిపించింది. పంకజానికి ఆ విషయాలన్నీ తెలిస్తే బాధపడవచ్చు. కాని అప్పట్లో యిక అంతకంటె మరో గత్యంతరం లేదు. ప్రభుత్వఉద్యోగిగా యిట్లాంటి విషయాలు ఉద్యోగానికి భంగం కలిగిస్తాయి—


పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్
రోజంతా హాయిగా మరియు సువాసన
వెదజల్లుతూ ఉండేలా ఉంచుతుంది
పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్కం పౌడరును ఒళ్లంతా జల్లుకొంటే తీక్షణ
మైన ఎండలుగల వాతావరణములో కూడ మీకు చల్లగా, హాయిగా
ఉంటుంది. దీనిని జల్లుకొని ఉత్సాహమును మరియు పూల పరిమళపు
హాయిని రోజంతా అనుభవించండి!
POND'S
DREAMFLOWER TALC
DREAMFLOWER TALC
POND'S
DREAMFLOWER TALC
DREAMFLOWER TALC
పెద్ద మరియు మధ్యమ రకపు రెండు అనువైన సైజులలో లభిస్తోంది
JWT-P 2699
చీస్‌బ్రో - పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఏ.లో సంస్థాపితము)

మళ్లీ సాయంకాలానికి 'మంచిగా నేజరిగిందని' సిమితపడ్డాను.

అటు తరువాత మరి పదిరోజుల వరకు పంకజం కన్పించలేదు. ఇళ్లపనికూడా ఓ కొలిక్కి వచ్చింది. పునాదులుపూర్తయి సగం గోడలు లేచాయి. రెండుపూటలా అక్కడికి వెళ్లి వస్తున్నాను.

ఓసాయింకాలం జీప్ పాడయిందన్నాడు జాన్ "స్పేర్ పార్ట్లు తెచ్చుకోవాలి, విజయవాడ వెళ్లివస్తాను సార్" అన్నాడు. వెళ్ళమన్నాను.

మర్నాటిసాయంకాలం పని జరుగుతున్న చోటికి వస్తూంటే దారిలో ముసిల్ది కనిపించింది. పంకజానికి జ్వరంగా ఉందట. ఎవరో బంధువును పిలుచుకు పోవడానికి వెళ్తున్నానంది.

నే నాశ్చర్యపోయాను. మరి నాతో చెప్పలేదేం?–"మీకు కోపం వస్తుందని భయపడ్డాను బాబూ –ఆరోజునుంచి అటువేపు వెళ్ళొద్దని దానికి గట్టిగా చెప్పాను"–

"నేను వస్తాను పద" అని యింటికివెళ్లాను.

గుడిసెరాటకి చేరబడి నీరసంగా కూచొని వుంది పంకజం. చూసేసరికి భయమేసింది. నల్లటిచీర మీద తెల్లటి చుక్కలు దీపం వెలుగులో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

నన్ను చూసి తన కళ్లను తానే నమ్మలేక విస్తుపోతోంది. ఎట్లా పలకరించాలో తెలీలేదు. అరుగుమీద కూచున్నాక నవ్వాను.

అంతలో ముఖం పక్కకు తిప్పుకు ఏడుస్తోంది–

"ఏమిటిరోగం?"

"తెలీదండి– నీరసంగా ఉంటుంది– మాట్లాడదు, అడిగితే ఏమీ బదులు చెప్పదు."

అమ్మని పిలిచి అంతలో ఏదో చెప్తోంది పంకజం – ముక్కు మీద వేలేసి చూపుతూ 'తప్పు' అంటోంది ముసిల్ది.

"ఏం చెప్తుంది?"

"పిచ్చిది–దానికేం తెలీదు బాబూ!"

ఇంకో ఏడుస్తోంది నిశ్శబ్దంగా–

"ఊళ్లో అన్నమాటలు విన్నాక దాని మనస్సుపాడయింది బాబూ–మిమ్మల్ని వెళ్ళిపొమ్మని చెప్పమంటోంది" మనస్సు కలుక్కుమంది.

మెల్లగాలేచి మంచంమీద తల ఆనించి పడుకొంటోంది.

"నేనువెళ్తాను – ఏంరోగం ఉన్నట్టు లేదులే" అని వచ్చేశాను– గుమాస్తాలంతా వెళ్ళిపోయారు. అంత చీకటిలోనూ తెల్లటి దారి పాముపొరలా కనిపిస్తోంది.

పంకజానికి మాటలాడడం వస్తే బావుణ్ణు అనిపించింది. నిశ్శబ్దానికి అర్థం ఒక్కొక్కప్పుడు మనస్సుని మించి పెరిగిపోతుంది. పంకజం మౌనానికి అర్థం చెప్పగలయంత్రాలే వుంటే పెద్దసృష్టిరహస్యం బయటపడేది.

నిదురపోయే సెలయేరు

ఆకళ్లలో దైన్యం;నిస్సహాయత యింకా మరుపురావడం లేదు. బంగళాకు రావచ్చునని వాళ్ళ అమ్మతో చెప్తే బాగుంటుందేమో?– ఏం చెయ్యడానికీ శక్తిచాలడంలేదు. ఇంత చిన్న ఊరులోనూ ఓసంఘం అంటూ ఏర్పడింది. ఆ సంఘం చాలు మామంచిచెడ్డలను చేరిజు వెయ్యడానికి–

తలవొంచుకు నడుస్తున్న వాడినల్లా రాయి తన్నుకు పడబోయాను. కాని చీకటిలో ఎవరినో అనుకున్నాను. రెండు పక్కలా దట్టంగా చెట్లు– అప్పుడే లేచే చతుర్దశి చంద్రుడి వెన్నెల చారలు–

"కళ్లు కన్పించవురా నీకు?" అంటున్నాడా వ్యక్తి. జవాబు చెప్పకుండా, పక్కకి తప్పించుకు నళ్లిపోబోయాను– వెనకనుంచి పిలిచాడు.

"ఒకే–యిలారా."

నివ్వెరపోయాను గొంతులో గరుకుతనానికి గుండె వణికింది—అసంకల్పితంగా వెనక్కు నడిచాను.

"నువ్వేనా ఆ యిల్లు కట్టిస్తున్నది?"

"అవును. ఏం?"

"పెత్తనం అంటే నువ్వేనా?"

"నేను కాదు."

"పోరలే—యీళ్లంతా ఎదవలు. అళ్లకి యిల్లిత్తే రేపు నిన్నూ నీ పెత్తన్నీ తంతారు. నీకెరిక?"

"అది నా కనవసరం"—నడవబోయాను.

"ఒకే—మాటవినిపించుకోయేస్"

"ఏఁటి చెప్పు?"

"పంకి సెరుగుదువా?"

"ఎవరో?"

"ఇదిగో, ఏ సా రె య్య కు—ఒక్కటి చెప్తాను విను. పంకితో నువ్వు మాట్లాడానికి వీల్లేదు. మాణిక్యంగాడిసంగతి నీకు తెలీదు. గుర్తుంచుకో" అన్నాడు.

అంత శరీరాన్ని చీకటిలో చూడడానికి భయంగా నేవుంది. చవకబారు కల్లువాసన భరించరానిదిగావుంది. ఏం జవాబు చెప్పకుండా నడిచాను—

వెనక వాడు నవ్వుతున్నాడు.

* * *

ఉదయాన్నే కంట్రాక్టరు వచ్చాడు—యిళ్ళదగ్గరికి బయలుదేరడానికి.

"మాణిక్యం అనేవాడిని తెలుసా మీకు?"

మొదట నన్ను ఆశ్చర్యంగా చూశాడతను. "అసలు వాడిపేరు ఎలా తెలిసింది మీకు?"

"చెప్పండి."



చిత్రకారుడు—కలువకొలను సదానంద
(పాకాల)

"వాడోవిధంగా ఈ ఊళ్ళో రాజ్యం ఏలుతున్నాడండి. వెనక అయిదుమంది జైమా జెట్టేలు మధ్దతున్నారు. నాలుగేళ్లక్రితం ఓ దొమ్మీకేసులో రాత్రికి బొమ్మల కంపెనీ మేనేజరు మేనల్లుడ్ని సఫా చేసేశారు. సబ్ ఇనస్పెక్టరు ఇద్దరు పోలీసుల్తో పరిశోధనకు వస్తే ఊరు పొలిమేరల్లోనే వాడికి బుద్ధిచెప్పి తగిలేశారు. రెండు నెలలు తిరక్కుండానే ఆ సబ్ఇనస్పెక్టరు తెలంగాణాకు బదిలీ చేయించుకున్నాడు. తెలిసి వాడితో ఎవరూ నోరు కలపరండి—రెండు బుజాలూ రెండు ఆయుధాలు వాడికి—"

అంతే. ఆతర్వాత మాణిక్యంగురించి అడగలేదు. కాని పంకజం ప్రస్తావన వాడెందుకు తీసుకువచ్చాడో అర్థంకావడంలేదు. పునరావాసాలు కట్టడం వాడికి యిష్టం లేనట్టుంది. అయినా ఏ విధంగానూ నేను ఆపలేను—కాకపోతే పంకజంతో మాట్లాడడం మానుకోవడం తప్ప. కాని మాణిక్యం అంత భయపడవలసిన వ్యక్తా? ఆలోచన పెరిగినకొద్దీ చికాకు ఎక్కువయింది. మరోసారి మాణిక్యాన్ని కలిస్తే బావుణ్ణనిపించింది.

(ఇంకా ఉంది)



ప్లాస్టిక్ పేపరుతో హేండ్ బాగ్

ప్లాస్టిక్ పేపరుతో హేండ్ బ్యాగ్ తయారుచెయ్యడం కొంత శ్రమతో కూడినదైనను చాల చక్కగానుండును. దీనిని తయారు చేయుటకు ఓర్పు, నేర్పు రెండు అవసరము. ఏమైనను స్వహస్తములతో చేసిన వస్తువులు మనస్సునకు ఆహ్లాదమును కలుగ జేస్తాయి. ఇటువంటి హేండ్ బ్యాగ్ లు పిక్నిక్ వెళ్లేటప్పుడు, ఫంక్షన్సులో గాని, షాపింగుకు వెళ్లేటపుడు తీసుకొని వెళ్లడానికి బాగుంటాయి.

వీటిని తయారు చేయుటకు కావలసిన వస్తువులు : ప్లాస్టిక్ పేపరు (తెల్లనిది)- 1 గజము. సిల్కు బట్ట - 1/4 గజము. రంగు బటన్లు-14. పైపింగు - 1 గజము. జిప్పు-6 అంగుళములు.


ప్లాస్టిక్ పేపరు సాధ్యమైనంతవరకు తెల్లనిదే తీసుకోవాలి. పేపరు దళసరిగా నుండాలి. అలాగనని మరీ దళసరి పేపరు తీసుకోరాదు. సమమైన దళసరిలో నుండాలి. పేపరు అందముపైనే బ్యాగ్ అందము ఆధారపడియుండును. లోపలవేసే సిల్కు బట్ట రంగుదై యుండాలి. నీలపురంగుదైతే తెలుపు ప్లాస్టిక్ పేపరుపై అందముగా కనబడుతుంది. లేనివారు తెలుపు ప్లాస్టిక్ పేపరుకు మేచ్ అయ్యే రంగు సిల్కు బట్టనే కావాలి. బటన్సు విషయములో కొంత శ్రద్ధ, ఓపిక వహించాలి. ఈ బటన్సు పేపరుకు లోపల సిల్కు బట్టకు మేచ అయ్యేవిగా నుండాలి. మొత్తము బ్యాగ్ కు 14 బటన్సు కావాలి. ఈ 14 బటన్సులో రెండేసి ఒక్క రంగులోవి బట్టకు పేపరుకు మేచ్ అయ్యేవి తీసుకోవాలి. ఇక్కడ మనము పేపరు తెల్లనిది, బట్టనీలముది వాడాము కనుక బటన్సు రోజ్, లేతఆకుపచ్చ, లేతనీలము, ముదురుఎరుపు, లేతఎరుపు, ముదురు ఆకుపచ్చ, ముదురునీలము, రెండేసిచొప్పున తీసుకోవాలి. ఈ 14 బటన్లలో 7 బటన్లు ఒకవైపు ఏడు పువ్వులపైన మిగతవిడు మరియొక్క ప్రక్క ఏడుపువ్వులపైన వచ్చును. ఇక పైపింగువిషయములో గోల్డన్ కలరైతేనే మంచిది. జిప్పు 6 అం. తీసుకొనవలయును. ఇక్కడితో వస్తువులను సమకూర్చుకొనుట పూర్తి అయినది.


మొట్టమొదట ప్లాస్టిక్ పేపరును తీసుకొని ఒకవైపునుంచి $4\frac{1}{2}''$ పొడవు $2\frac{1}{2}''$ వెడల్పుతో దీర్ఘ చతురస్రాకారపు ముక్కలు 14 కత్తిరించాలి (1 వ బొమ్మను చూస్తే తెలుస్తుంది.) ఈ కత్తిరించే విషయములో పేపరు మధ్యనుంచి కత్తిరించ కూడదు. మధ్యనుంచి కత్తిరిస్తే పేపరు గజము కాదు కదా 2 గ. కూడా సరిపోదు. ఒకవైపు నుండి కత్తిరిస్తే పేపరు సరిపోవుటయే కాక

కుమారి
పులిపాక అంజనాదేవి

మిగులుతుంది కూడా. ఈ కత్తిరించిన దీర్ఘ చతురస్రాకారపు ముక్కలను తీసుకొని సాఫైన బల్లపై పరచి కుచ్చెళ్ళు పోస్తూ రావాలి. అనగా ఈ దీర్ఘ చతురస్రాకారపు ముక్కను రెండు చేతి, రెండు వేళ్ళతోను దగ్గరగా మడుస్తూరావాలి. మడుస్తున్నప్పుడు కుచ్చెళ్ళు జారిపోకుండా జాగ్రత్తగా చెయ్యాలి. కుచ్చెళ్ళు పోసిన తరువాత జాగ్రత్తగా దాని మధ్యభాగాన్ని రెండు వేళ్ళతో గట్టిగా పట్టుకొని కుచ్చెళ్ళు జారిపోకుండా సూదితో చిన్న కుట్లు వెయ్యాలి. 2-వ బొమ్మచూస్తే అర్థమవుతుంది. కుట్టిన తరువాత ఈ కుచ్చెళ్ళను సమముగా చుట్టూరా పువ్వులాగ సర్దాలి. 3-వ బొమ్మలో కుచ్చెళ్ళు సర్దిన తరువాత పువ్వులాగ కనపడే విధము. ఇటువంటి పువ్వులు 14 తయారు చెయ్యాలి. తరువాత ఒక తెల్ల కాగితమును తీసుకుని దానిమీద $3\frac{1}{2}$ అం॥ వ్యాసార్థముతో ఒక సర్కిల్ గీసి దానిని కత్తిరించాలి. ఈ కత్తిరించిన తెల్లకాగితమును ప్లాస్టిక్ పేపరుపైన పెట్టి అదే షేప్ లో రెండు సర్కిల్స్ కత్తిరించాలి. తరువాత సిల్కు బట్టపై పెట్టి అదే ఆకారములో రెండు కత్తిరించాలి. తరువాత $1\frac{1}{2}$ అం॥ పొడవు 1 అం॥ వెడల్పుతో దీర్ఘ చతురస్రాకారపు ముక్కలు సుమారు 100 కత్తిరించాలి. వీటన్నిటికంటే ముందుగా అనగా, మొట్టమొదట గజము ప్లాస్టిక్ పేపరులో ఏవియు కత్తిరించకుండానే $1\frac{1}{2}$ అడుగు పొడవు 2అం॥ వెడల్పుతో నాలుగు ముక్కలు కత్తిరించి పెట్టుకోవాలి. ఇవియే సంచీయొక్క తాడును అల్లుటకు ఉపయోగపడును.

గుండ్రముగా కత్తిరించి పెట్టుకొన్న ప్లాస్టిక్ పేపరును, కత్తిరించి పెట్టుకొన్న రంగు సిల్కుబట్టపై పెట్టి చుట్టూరా గట్టి కుట్టుతో పేపరును బట్టకు అతకాలి. ఇదే విధముగా రెండవ పేపరును, రెండవ రంగు బట్టతో అతకాలి. ఇప్పుడు పేపరు, సిల్కు బట్ట అతికినవి రెండు వచ్చినవి. ఈ రెంటిని మరలా ఒకటిగా గట్టి కుట్టుతో చుట్టూరా అతుకుతూ ఒకప్రక్క మాత్రము 6 అం॥ మేర ఓపెన్ వదలి కుట్టాలి. ఇప్పుడు సంచీలో ఒకభాగము తయారైనది. మొట్టమొదట తయారుచేసిన పువ్వులలో ఒక పువ్వును సంచీపైభాగములో పెట్టి దాని మధ్యభాగములో రంగు బటను పెట్టి పువ్వు కదలిపోకుండా కుట్టాలి. ఈ విధముగా నే మిగత ఆరు పువ్వులను కుట్టాలి. కుట్టేటపుడు చుట్టు ఆరు పువ్వులు మధ్యన ఒక పువ్వు రావాలి. 4-వ బొమ్మలో చూస్తే బోధపడుతుంది. ఇదేవిధముగా మరియొకప్రక్క మిగత ఏడు పువ్వులు (చుట్టూరా ఆరు మధ్యన ఒకటి) మధ్యన ఏడురకముల బటన్సు పెట్టి కుట్టాలి. బటన్సు పెట్టేటపుడు ఒకవైపు ఏ ఏ రంగులవుతే ఉపయోగించామో అదే రంగు బటన్సు రెండవ వైపు కూడ ఉపయోగించాలి. దీనితో పువ్వులు అతకడము అయిపోవును. $1\frac{1}{2}$ అం॥ పొడవు 1 అం॥ వెడల్పున కత్తిరించుకున్న 100 ముక్కలను ఒక్కొక్కటి ఈ ప్రక్కన 5-వ బొమ్మలో చూపినట్లు (చుక్కలు పెట్టినచోట మడవాలి) మొగ్గవలె మడవాలి.


(1)
4½"
2½"
(2)
(3)
(5)
1½
1"
(4)
(6)
(7)
1
2
3
4
(8)



ప్లాస్టిక్ పేపరుతో హేండ్ బాగ్

ఈ ముగ్గులను సంచీ చుట్టూరా పెట్టి కుట్టాలి. ఈ విధముగానే రెండవ ప్రక్క కూడ చుట్టూరా కుట్టాలి. కుట్టేటపుడు ఒకవైపు 50 ముగ్గులు, రెండవవైపు 50 ముగ్గులు వచ్చేటట్లు కుట్టాలి. 6వ బొమ్మలో ముగ్గులు కుట్టిన తరువాత కనపడే విధము. ఇక మిగిలిపోయినది తాడును అల్లుట, జిప్పు, పైపింగు వేయడము.

తాడును అల్లే విధము:— తాడును అల్లేటపుడు చాలా జాగ్రత్తగా అల్లాలి. లేనిచో తాడు అసహ్యముగా కనపడుతుంది. 1½ అడుగు పొడవు 2 అం॥ వెడల్పుతో కత్తిరించి యుంచుకొన్న నాలుగు ముక్కలను తీసుకొని ఒకకొన గట్టిగా నాలుగింటిని కలుపుతూ ముడివెయ్యాలి. తరువాత ఈ నాల్గు తాళ్ళను (ప్లాస్టిక్ పేపర్లను) నేలపై సమముగా సర్ది అల్లుట మొదలు పెట్టాలి. 7వ బొమ్మలో చూపినట్లు 1 నం॥ తాడును 2వ దానిమీదను, 2 వది 3 వదానిమీదను, 3 వది నాలుగవదానిమీదను, 4 వది తిరిగి 1వదానిలోంచి లాగాలి. లాగేటపుడు 1, 4 కుడిచేతితోను 2, 3 ఎడమచేతితోను లాగాలి. ఇదేవిధముగా చివరంటా అల్లి చివరకు ఈ నాలుగు కలిపి ముడివెయ్యాలి. ఇక్కడితో త్రాడును అల్లే విధము పూర్తి అయినది. 7వ బొమ్మ చూస్తే త్రాడును అల్లుట సులభముగా అర్థమవుతుంది.

తరువాత ఓపెన్‌గా 6 అం॥ మేర వదలిన భాగములో జిప్పును గట్టికుట్టుతో అతకాలి. జిప్పును అతికిన తరువాత త్రాటిని సంచీకి అతకడమే. తరువాతవిషయము పైపింగు. గోల్డన్ కలరు పైపింగు అయితే తెల్ల ప్లాస్టిక్ పేపరు, నీలపురంగు సిల్కు బట్టపై చాలా అందముగా కనపడుతుంది. ఈ పైపింగును ముగ్గులకు అడుగుభాగములో కుట్లు కనపడకుండా కుట్టాలి. పైపింగు కుట్టేటపుడు పైపింగు ఏ రంగులో ఉంటుందో అదేరంగు దారం వాడాలి. దీనితో సంచీ కుట్టడము పూర్తి అయినది. 8వ బొమ్మలో సంచీ పూర్తి అయిన తరువాత కనపడే విధము. కాస్త శ్రమ అయినమాట వాస్తవమేకాని, శ్రమకు తగిన ఆనందాన్ని కలుగజేస్తుంది. ★

పాకశాల:

సమోసా

కావలసిన సామానులు : 1 పావు గోధుమపిండి, సవాసేరు బంగాళాదుంపలు, ఒక పెద్ద ఉల్లిపాయ, పచ్చి బటానీలు ½ సవాసేరు, పచ్చి మిరపకాయలు 2.

చేయువిధము : మొదట బంగాళ దుంపల్ని బాగా కడిగి ముక్కలు తరిగి ఉంచవలెను. పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయ సన్నగ తరిగి వేరుగ ఉంచవలెను. తరువాత పొయ్యిమీద కళాయిగిన్నె పెట్టి దానిలో నూనె బాగా వెయ్యాలి. తరువాత పచ్చి బటానీలు వేసి మూతపెట్టాలి. ఐదు, పదినిమిషముల తర్వాత, తరిగి ఉంచుకొన్న బంగాళదుంపలు ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలుకూడ వెయ్యాలి. దానిపై నీళ్ళతో ఒక గిన్నె పెట్టి బాగా మాగనియ్యాలి. ఉప్పు, పసుపుపొడి కారం కావలసినవాళ్లు కారప్పొడి కూడ వేసి బాగుగ కలియబెట్టాలి.

ఇంతలో పావుసేరు గోధుమపిండిని ఉప్పువేసి తడిపిఉంచాలి. కూర అయిపోగానే పొయ్యిమీద నూనెపెట్టి ఉసిరికాయంత

వనితా వాణి



అసదృశం

28-9-60 వ లేదీ పత్రికలో కె. సత్యవతి గారు వ్రాసిన 'అందం అంటే' అన్న వ్యాసం సర్వజనాకర్షణీయంగా వుందంటే అతిశయోక్తి కాదు. వీరందులో సౌందర్యంలో గల వివిధభాగాలను వివరిస్తూ హృదయ సౌందర్యంయొక్క ఉత్కృష్టత నుల్లేఖించారు. 'భగవంతుని అనంత సౌందర్య రసస్ఫోరక విశ్వసృష్టిలో ప్రతిజీవి ఒక్కొక్క సౌందర్య కణ'మనియు, 'యే జీవి అందం ఆజీవిదే'ననియు, 'ఈ అనంత సౌందర్యాన్ని గ్రహించేశక్తిగల హృదయంయొక్క సౌందర్యమే సౌందర్య'మనియు చివరకు చక్కగా తేల్చారు.

వ్యాసంలోని భావాలను మించి పదవిన్యాస మెంతైనా మెచ్చుకోదగినది. వ్యాసము మొదటినుండి మంచిభావాలతో, లలితమైన పదాలతో, చక్కటి జాతీయాలతో నడిచింది. తేనె లూరెడు అచ్చతెనుగు పదాల మాధుర్యం, లాలిత్యం, సోయగం, సౌకుమార్యం— ఈ వ్యాసము చదివినవారికి తప్పక అవగతమగును. తెలుగుభాష తెన్నతనాన్ని చాటి చెప్పడాని కిలాటి వ్యాసాలు, కథలు చాల అవసరం. సత్యవతిగారు సమయోచితంగా, నేర్పుగా 'బ్యూటీక్రీము'వంటి ఆంగ్ల పదాలు కొన్నిటి నచ్చతెనుగు పదాలుగా వాడారు. నిజంగా అక్కడా పదాలు పడకపోతే ఆ అందంలేదు. వ్యాస మింత చక్కగా తయారుకాదు. రచయిత్రిగారందించిన ఉపమలు, రూపకాలు, ఉత్ప్రేక్షలు మెచ్చదగినవి. అలంకారయుక్తంగా చక్కటి పదజాలంతో సుబోధకమైన భాషలో వ్రాయబడిన వ్యాసమది. అసలది వ్యాసంకాదు. ఒక కళాఖండం. తెలుగుమాత బిడ్డలంతా ఇంకా ఇలాటి కళాఖండాలను సృజించి ఆంధ్రపత్రిక ద్వారా పాఠకుల కందజేసి ఆంధ్రభాషలోని సరళత, మధురత, సుకుమారత, చక్కదనం సాటి యాంధ్రులకు తెలియబర్చి మన భాష గొప్పతనాన్ని కనీసం మన ఆంధ్రులైనా గుర్తించునట్లు చేయగలరని ఆశిస్తున్నాను.

"వైట్ రోస్" (విజయనగరం)

* * *

దయచేసి సోదరీమణు లెవరికైనా కేకులు ఫ్రూట్ కేకులు తయారుచేయడం వచ్చినచో వనితావాణిద్వారా తెలియజేయాలని కోరుతున్నాను.

ఎం. ఆర్. లక్ష్మి (మదరాసు)

* * *

వనితాలోకం శీర్షికలో అనేకమంది వనితలు తమ సందేహాలను ప్రచురించి సందేహ నివృత్తు లగుచున్నారు. అట్టే నాయీ సందేహాన్ని కూడా సోదరీమణు లెవరైనా తీరుస్తారని ఆశిస్తున్నాను.

గద్వాల్ చీరెలను వుతుకుతే రంగుపోతుందని అన్నారు. మరి వాటిని వుతకవలసివస్తే ఏమి చేయాలి? వుతకవచ్చునంటే ఎలా వుతకాలి? ముఖ్యంగా తెల్లని అంచు కోరా రంగులోవుండు చీరెలను ఎలా వుతుకుతారు! వుతుకుతే అంచు రంగు చీరకు అంటుతుందా? వాటిని ఏవిధంగా వుతకాలి? నా ఈసందేహాలను దయచేసి సోదరీమణు లెవరైనా తమ స్వానుభవమువలన తెలిస్తే, 'సచిత్ర వారపత్రిక' ద్వారా తెలియచేయుమని మరీ మరీ కోరుచున్నాను.

వి. యిందిరాదేవి (విజయవాడ)

* *

గోధుమపిండిని ముందుగ పూరీలా ఒత్తాలి. తర్వాత దానిని మొదట క్రిందినుంచి తర్వాత ఒక ప్రక్కనుంచి మడవాలి. దానిలో ఈ చేసిన కూరపెట్టి పైనించి మడవాలి. ఇలా మడిచి, తర్వాత కొనలు తెరుచుకోకుండా చూచి నూనెలో వెయ్యాలి. ఇది చూడడానికి ముక్కోణంగా ఉంటుంది. బాగా కాలింతర్వాత తీసి వేరే పళ్ళెంలో ఉంచాలి. ఇలా ఒకటి కాలేలోపల ఒకటి చేసు పిండి అంతా అయిపోయేవరకు చేయాలి. ఇది మధ్యాహ్నం, టిఫినుకు చాల బాగా ఉంటుంది.

"శ్యామల మాధవన్".



బెడ్‌షీట్ మూలలకు

చిత్రకారిణి—ఓలేటి కామేశ్వర్మ (మామిడిపల్లి)

పత్రావళి

పిన్నలూ, పెద్దలూ

ఆకుండి శారదాంబగారు వ్రాసిన "పిన్నలూ పెద్దలూ" వ్యాసం వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది - ఆవిడ పేర్కొన్న అవలక్షణాలు, వాటికి మూలకారణాలు, ప్రతీ కుటుంబంలోనూ ఎదురుచూస్తూ ఉంటాము - పిల్లలనేరు పెట్టి ఇది చెయ్యలేదని, అది చెయ్యలేదని కక్షసాధించే అత్తగార్లూ, ఆడబడుచులూ, లేకపోలేదు- ఆ "యితర పెద్దల" మీద ఆగ్రహం పిల్లలమీద చూపి, పిల్లల దృష్టిలో "రాక్షసులు" గాను "అమ్మవార్లు" గాను ("యితర పెద్దలు" పెట్టే పేర్లు సుమండీ !) తయారైన తల్లులూ లేకపోలేదు- అందుచేత పిల్లల బాగోగులకీ, పెద్దల ప్రవర్తనకీ అవినాభావసంబంధం ఉండక తప్పదు - "పిల్లల్ని పెంచి పెద్దచేసే తరుణంలో తలిదండ్రులు, యితర పెద్దలూ జాగరూకులై ఉండాలి." నిజమే ! కాని ఎలా సంభవమో అన్నది కొన్ని కుటుంబాలలో సమస్యగా తయారై కూర్చుంది.

ఏ. వి. యస్. (విశాఖపట్టణం—4)

" * *

నాటి అత్తలూ

28-9-60 వ వారపత్రికలో పి. సుచరిత గారు వ్రాసిన "నాటిఅత్తలు-నేటికోడళ్ళూ" అనే వ్యాసము బాగానే వ్రాశారు కాని కథలో రచయిత్రిగారు అత్తగారి లోపాలే ఎక్కువగా కనపరిచారు. పొరపాటున సాధారణముగా లోకములో అందరు అత్తలు చెడ్డవారని- కోడళ్లు మంచివారని చెప్పలేము కదండి. వారిలో మంచివారున్నారు-వీరిలో కూడా మంచివారున్నారు. రచయిత్రిగారు, కొడుకు కోడలు బాగుంటే సహించలేని అత్తవారుకూడ వున్నారని వ్రాశారు మరి. భర్తతో తన అత్తమీద లేనిపోని అపవాదులు వేసి వేరుకాపురములు పెట్టేంతవరకు భర్తను సాధించి వేధించిన వారినికూడ మాను. లోకములో మంచి- చెడు-ఎవరిని నిర్ణయించలేము గదండి. యింతకి వ్యాసము బాగుంది. రచయిత్రి పి. సుచరితగార్కి నా అభినందనలు.

శ్రీమతి టి. లీలాదేవి, టి. సుధాకరరెడ్డి (చెన్నపట్నం)

* * *

సోదరీమణులకు—"తాజ్ మహల్" డిజైన్ మీలో ఎవరివద్దనైన ఉన్న ఎడల ఆంధ్ర వారపత్రిక ద్వార పంపించమని ప్రార్థన.

గాదంశెట్టి పద్మావతి (బరంపురం)

మధురా పర్వం - 5

ఏవం రాజా విచింత్యాథ
నిష్క్రమ్య స్వగృహోత్తమాత్
ప్రేక్షాగారం జగామాశు
మంచానా మవలోకకః॥

—హరివంశము.

అంధకుడు దిగ్భ్రాంతి చెందినాడు. ఇది యేమి ప్రార్థన? ఇది యేమి యాజ్ఞ? మధురేశ్వరునకు తాను ఇప్పుడు పోయి చెప్ప గల విశేషము ఇక్కడ ఏమి కలిగినది? అది అంధకునకు అర్థము కాలేదు. ఇప్పుడు తాను ఏమి చేయవలయునో గూడ అంధకునకు అర్థము కాలేదు. ఆయన అచ్చట, అటులనే నిలుచుండి పోయి నాడు. ధనుర్భంగోదంతాన్ని మధురేశ్వరునకు నివేదించుటకు కాబోలె, ధనురాగార పాలకులు కోలాహలసంగా రాచనగరు వైపునకు పరుగులు పెడుతున్నారు. కొందరు ఆ ధనుర్భంగకారి రాజద్రోహులను వెదుకుటకు కాబోలును, నలుదిక్కులకు బయలుదేరిపోతున్నారు. అంధకునకు వారిని చూడగా నవ్వు వచ్చినది. తనలో తాను నవ్వుకున్నాడు. ఆ నవ్వు అతని చెవులకు తన్ను ఎకసక్కెం చేస్తున్నట్లు వినిపించింది. తనకు భగవంతుడు ఇచ్చిన ఆజ్ఞ ఏమి? తన యీ ఆలస్యమేమి? అంధకుడు గూడ రాజమందిరముల దిక్కు బయలుదేరినాడు. కంసునకు, యాదవకులజులైన రాజులకు పడుట లేదు. మధురారాజ్యంలో యాదవగణాన్ని రూపుమాపాలని పెట్టుకొని కంసుడు పనిచేస్తున్నాడు. ఎందుకో తెలియదు? ఇప్పుడు వసుదేవునిసంతానమువలన తన ఆత్మకు కీడు రాగా, కంసుడు ఈ జతనమునకు దిగినాడనుకొనుట ఇచ్చట పొసగుటలేదు. యాదవుల యందు కంసుని ఈ అకారణ వైరము మొదలై చాలకాలమైనది. ఇప్పుడు అది అందుల ఉద్దీపకమైనది. అంధకుడు ఆలోచన చేసినాడు. మొన్న సభలో అంత అయినతర్వాత తిరిగి కంసుడు తన్ను చూడనిచ్చగించునా? ఇప్పుడు తానే పోయి అతనిని చూడవలసి వున్నది. అది భగవంతుని ఆజ్ఞ. మరి ఆయన తన్ను ఎందునిమిత్తము కంసుని చూడుమని కోరెనో, ఏమి చెప్పవలసినదని కోరెనో, అంధకునకు అర్థమగుట లేదు.

అంధకుడు కంసుని మందిరములదిక్కు ముఖుడై నడచినాడు. కంసుడు మహావీరుడు. మహాధానుష్కుడు. అట్టివాని విల్లు నేడు విరిగిపోయినది. ఈ ఆలోచన రాగా అంధకుడు హఠాత్తుగా అడుగులో అడుగై నిల్చిపోయినాడు. అతనిముఖము విప్పారినది. అతని మనస్సు, విశదమైనది. అతని ఆత్మ తేలికపడినది. తేలికగా అడుగులుగా అంధకుడు కంసుని మందిరములను దరిసినాడు. అప్పటికే కంసధనురాగారపాలకులు రాజుతో జరిగినది విన్నవించికాబోలు తిరిగివస్తున్నారు. అంధకుడు వారివంక చూడలేదు. తేజస్వంతము లయిన కన్నులతో, ఎక్కడో దృష్టిని లగించి, ముందుకు పోతున్నాడు.

"తాత! అంధక!"

"ఎవరువారు? నన్ను పల్కరించుచున్నారు?"

"తాత! నేను మధురేశ్వరుడను. కంసుడను."

"ఓహో! నీవా! నీవు కంసుడవా, కాలనేమివా!"

"కంసుడు ఆ మాటలు విని అదిరిపడినాడు. వికటముగా నవ్వినాడు.

"అంధక! అంధక! నీవు గ్రుడ్డివి అనుకున్నాను. నీవు గ్రుడ్డివి అనుకున్నాను. అవును! అవును! నేను కాలనేమిని."

"అవును! అవును! నీవు కాలనేమివి. నీ కాలము నేమి రహితం అవుతున్నది. నేమిరహితం అవుతున్నది."

కంసుడు తిరిగి వికటంగా నవ్వినాడు.

"తాత! అంధక! నీకు పిచ్చి యెత్తినదా! నేను కంసుడను. ప్రేక్షాగారం చూడబోతున్నాను. నాతో గూడా రా! రేపు నియుద్ధపు యేర్పాట్లు ఎట్లా జరుగుతున్నానో చూద్దువుగాని!"

అని కంసుడు అంధకుని చేయిపట్టుకొని తనవెంట తీసికొని పోయినాడు.

ప్రేక్షాగారం చేరేవరకు వారు ఒకరితో ఒకరు మాట్లాడు కొనలేదు. ఎవరి ఆలోచనలలో వారు వున్నారు. కంసుని మనస్సులో రంజకవధ, సుదామునకు వరప్రదానము, కుబ్జోన్నమనము, తుదకు ధనుర్భంగము- అన్నీ ఆడుతున్నవి. రంజకుని భార్యలు వచ్చి తమ భర్తను ఒక నల్లనిగొల్లడు, కుఱ్ఱవాడు, ప్రమందించిన విధమును ఏడ్పులుగా, పెడబొబ్బలుగా చెప్పుకొని పోయినారు. సుదాముని వృత్తాంతము, కుబ్జవృత్తాంతము తాను చారులవలన విన్నాడు. ధనుర్భంగము సంగతి ధనురాగారపాలకులే వచ్చి చెప్పినారు. తాను ఆ ధనుర్భంగవేళ కల్గిన నాదాన్ని విశ్రుతుడు గూడ అయినాడు. ఆ ధనుర్భంగ నినదం తనకు ఎట్లా వినిపించింది? పూర్వము దేవకికి కలిగినదని శంకించిన స్త్రీసంతానమును, యోగమాయను, తాను ఆకాశములోనికి విసరగా, నది శక్తిరూపిణియై వికటనాట్యం చేస్తున్నప్పుడు, ఆశక్తి పాదమంజీరములనుండి పుట్టిన భీకర విచిత్ర నినదాన్ని పోలివున్నది. శ్రీకృష్ణ జన్మవేళ — అప్పుడు, శ్రీకృష్ణుని ఆగమన వేళ-ఇప్పుడు, కాళికాదేవి తన జీవితసరస్వమును హద్దులలో పెడుతున్నదివోలె కంసునకు భాసించింది. అతడు భయపడినాడు. ఆ భయముతో ప్రేక్షాగార సందర్శనము పేర బయలుదేరినాడు. దారిలో తనకు ఈ అంధకదర్శనము.కంసునకు ఇదే విచిత్రమనిపించింది, ఈ అంధకుడు తన్ను కాలనేమియని సంబోధించడము.

అంధకుని ఆలోచనలు అంధకునివి. అతడుగూడా ఈ సంఘటనలను గురించి ఆలోచించినాడు. తాను ఇప్పుడు కంసునకు చెప్పవలయు విశేషములు చాలగానున్నవి. వానిని ఎట్లు చెప్పవలయునో తెలియుటలేదు. కంసుడు ఏదియో ఆలోచనలో వున్నాడు. తాను ఇప్పుడు అతనిని పల్కరించటము దేనికి?

కంసుడు ప్రేక్షాగారమువైపునకు నడచినాడు. అంధకుడు

హరివంశము

అతనివెంట నడచినాడు. ఆ ప్రేక్షాగారం వివిధ విధములైన మంచము లతో, తిమగములతో ఒప్పుమిగులుతోంది. రాజులకు వేరు, బంధువులకు వేరు, అమాత్యులకు వేరు, భృత్యులకు వేరు, పౌర శ్రేణులకు వేరు, విలాసినులకు వేరుగా మంచములు, తిమగములు నిర్మితములై, వేరువేరు శ్రేణులుగా విర్భరించబడి వున్నాయి. దృఢరమ్యరచనములైన మహాస్తంభములపై ఉన్నతములైన ఉపరిగృహాలు నిర్మించబడినాయి. కొన్ని ఒంటి స్తంభపు మేడలనుపోలి, కొన్ని ఆరు స్థంభములు ఆధారముగాచేసి కట్టిన క్రీడా కూడవులనుపోలి విచిత్రంగా వున్నాయి. ఈ ఉన్నతములైన తిమగములన్నియు వలభాలుకల్గి, సుఖారోహణములు, సుసంఘటితములు అయిన సోపానమార్గములుకల్గి, ప్రత్యగ్రకల్పితములైన విచిత్ర శిల్పములుకల్గి, ఆలోకనీయములైన వితానయవనికా తోరణప్రముఖ ములతో అలంకృతమై ఉల్లసిల్లుతున్నాయి. రంగస్థలం సర్వత్రా పౌరనిరూవ్యవ్యూహమై, స్వాయతమై, సుప్రతిష్ఠితమై ఒప్పు మిగులు తోంది. నానాదేశాగతులయిన రాజులనిమిత్తం కట్టిన మంచ శ్రేణి పరిక్షిప్తమై, వ్యాప్తమై, పెండ్లి పందిరినిపోలి, సంచారపథ సంకులమైవుంది. అంధకుడు వెంటరా కంసుడు ఈ ప్రేక్షాగారశ్రేణు లను కలయతిరిగినాడు. శిల్పులనుపిల్చి మాట్లాడినాడు. శ్రేష్ఠశిల్పులను ప్రశంసించినాడు. అప్పటికి సూర్యుడు అస్తాంబుధిలో పడు వేళ అయినది. అప్పుడు రంగస్థల మధ్యస్థితమైన వేదికను దరిసి, శిల్పులను రాబంచినాడు. ఆ శిల్పులు రాగా, వారితో ఇట్లా అన్నాడు: "రేపు తెల్లవారువేళకు రంగస్థలం సిద్ధంకావాలి. చిత్రములతో, పుష్పతోరణ ములతో, పతాకలతో అలంకృతముకావాలి. కుసుమపరికీర్ణస్థలము, అభిరూప ధూపవాసితము అయి సుఖంగావుండాలి. నపుష్పాంతము లైన, చిత్రపుసుపాదియుక్తములైన మహాస్తరణాలు తెచ్చి యథా స్థానాలలో వుంచాలి. రేపు ఇక్కడ మల్లయుద్ధం జరుగుతుంది. వారికి స్వేదానమార్జనార్థం శుష్కగోమయచూర్ణం అవసరం అవుతుంది. ఆ చూర్ణాన్ని తెప్పించి రంగవాటంలో రాశులుగా పోయించవలసి వుంది. ప్రేక్షకులకు నీరువట్టుఅయితే తీర్చేందుకు యథాక్రమంగా పానకుంభాలు ఏర్పాటుచేయించవలసి వుంది. మల్లు లకు కషాయరసములు అవసరం అవుతాయి. వాటినిగూడా సిద్ధం చేయించవలసివుంది. ఈ అన్నింటికి మించి జరగవలసిన కొరగం ఒకటి వుంది. యుద్ధధర్మవిశారదులయిన ప్రాశ్నికులను కబురుపెట్టి రప్పించ వలసివుంది. వారితోపాటు యుద్ధసాక్షులుగూడా అవసరం అవు తారు. వారినిగూడా మీరు రప్పించాలి. ఇది నా అజ్ఞ."

అని కంసుడు అంధకునిదిక్కు గల్లున నవ్వినాడు. అంధకునకు నవ్వు రాలేదు. అతని మనస్సులో దాగుకొనివున్న రమ్యమైన శిల్పవిద్య, ఈవిధంగా ఈ ప్రేక్షాగారరూపంలో అవతరించడం చూచి అంధ కుడు అప్రతిభుడైనాడు. ఆ రంగస్థలం దేవదానవ క్రీడాగారాన్ని పోలివుంది. కంసుడు అట్టి రంగస్థలాన్ని నిర్మింపచేశాడు. అది అతని శిల్పవైభవము సర్వమును వ్యక్తంచేస్తూ, అతని అకృత్రిమ రాజసము నకు చిహ్నమై ఒప్పు మిగులుతున్నది.

"కంస! తాత! నీవు మహాశిల్పివి" అన్నాడు అంధకుడు.

కంసుడు మాట్లాడలేదు. ఇద్దరు తిరిగి రాజమందిరములదిక్కు బయలుదేరినారు. అస్తమిస్తున్న సూర్యుని కిరణములలో వారినీడలు దీర్ఘములై వారి దేహానుషులను అంటి ప్రయాణం చేస్తున్నాయి. కంసుడు నడుస్తూ, నడుస్తూ, ఒక్కసారి తన నీడవంక చూచు కున్నాడు. చూచుకున్నంతలో అతని ముఖము వెలవెలపోయినది. "తాత! అంధక! ఈ నీడనుచూడు" అన్నాడు. అంధకుడు ఆ నీడను చూచినాడు. అతనికి అందులో విచిత్రమేమియు కన్పించలేదు. అన్ని నీడలను పోలి, ఆనీడయు ఉన్నది. "తాత! కంస! నీఆజ్ఞను పాలించి నాను" అన్నాడు అంధకుడు.

"అంధక! ఈ నానీడ నీకు ఎట్లా కన్పిస్తున్నది?"

"అందరినీడలవలెనే మామూలుగా సాయంవేళ గనుక దీర్ఘమై కన్పిస్తున్నది."

"అదికాదు. ఆనీడకు శిరస్సు వున్నదా?"


అంధకుడు తిరిగి కంసుని నీడను పరిశీలనగా చూచినాడు. ఆ నీడ దీర్ఘమై, సాంగమై సశిరస్కమై వున్నది.

"కంస! ఆనీడకు శిరస్సు వున్నది."

"ఇదే విచిత్రము. తాత! అంధక! ఆ నీడను నేను చూడగా, శిరస్సు కన్పించుటలేదు."

అంధకుడు దిగ్భ్రాంతిచెందినాడు. దిగ్భ్రాంతిచెందిన యంతలో తిరిగి అతని మనస్సులో భగవంతుని అజ్ఞ అవభాసించినది.

★



(గతవారం తరువాయి)

ఉషాకన్య వెంటపడిన మగరాయడు గండరగండడు. ఆ గండరగండడు ఉషకు పెద్ద గండమైనాడు. ఇంటిదారి పట్టిన ఉషను పట్టి విడువని జగజెట్టి అయినాడు. 'ఇదెక్కడి ఖర్మ' - పరాయి మగవాడు నావెంటపడ్డాడు. అమ్మలు గనుకచూస్తే 'అమ్మ బాబోయ్' యింకేమన్నా ఉందా,' అనుకున్న ఉష అపట్టున ఆగిపోయింది. ఆ రాకుమారుడూ అగిపోయాడు. ఆమె కదుత్తే కదలిక కదలకుంటే కదలక పోవటం, ఆమెనీడలా ఆమె నే వెన్నంటి వస్తాడు. ఉష నవ్వుకుంది. ఎంతో పొదుపుగా ఒడుపుగా నవ్వుకుంది. కోటిముత్యాలురాలి నేల పాలుకాకుండా, నవ్వు వెన్నెలలు కాసి అడవిపాలు కాకుండా - పైపెచ్చు తనమనోభావం అతగాడికి తెలీకుండా, అంత అందమైన నవ్వు- ఒక తెల్ల గులాబీపువ్వు - ముల్లులేని ఆ పువ్వుని మూచూడాలనిపించింది. ముల్లున్నానరే ముద్దిడుకోవాలనిపించింది.

"సుందరీ......"

ఆపై చుక్కలమేరా అతను మరేం అనలేదు. ఆ చుక్కలు అయిపోయిన తర్వాత ఈ చక్కని చుక్క పక్క మెల్లిగా చేరాడు.


ఉషాకన్య ఒడలంతా ఏదో గడబిడపడిపోయింది. తనని అడక్కుండానే ఆమె తనువు పులకరించింది.

బెజవాడ సదానందం

తనమాట వినకుండా అక్కడే ఆగిపోయింది.

'ఎవరు నువ్వు సుందరీ' అన్నాడు అతగాడు. ఓరచూపు చురుకులోంచి దోరవయసు బెరుకు చూపి ఒక్కసారి నీలి కళ్లు నిమీలించి వినయంగా నవ్వుకుంది.

ఆ క్షణం అతనికి తన ఆత్మకథ రాసుకోవాలనిపించింది. అందమైన చిలకముక్కు పాళీగా, నెమలి ఈక కలంగా, అమృతం సిరాగా కలం పట్టి, నునులేత అనటి మొవ్వ కాగితాల మీద తన ఆత్మకథ రాసి ఆమెకే అంకితం ఇచ్చి పుచ్చుకోమని ఆమె పాదాలను అడగాలనుకున్నాడు.



'మీ రెవరు?' నట్టడవిలో నవనవలాడే నవరసకన్నడ స్వరలక్ష్మి వీణ తీగలమీద కాలుజారి కావాలని పడి కమ్మనిరొద చేసినట్టు అడిగింది ఉష.

ఆ సరిగమల ఘుమాయింపు లోంచి ఎట్టాగో బైటపడి "హాఁ... నేను నిన్నడుగుతే నువ్వనన్నడుగు తావా? ప్రశ్నించింది నేను. బదులు చెప్పాల్సింది నువ్వు" అన్నాడు అతడు. 'బదులు చెప్పేంత వదులుగా లేదు నానాలిక' అంటూ కొంటెగా వెక్కిరించి పక్కుమని నవ్వుకుని పారిపోయింది ఉష. కాని నీడ ఊరుకుంటుందా! పైగా గుర్రం కూడా ఎక్కి దౌడాయించింది వెంబడిపడి.

మళ్లీ ఆగింది ఉషాకన్య. 'నిన్ను బట్టి నీ నీడానూ' అంటూ పరిహాసం ఆడుతూ గుర్రం దిగాడు కుర్రదొర. 'ఇదేం పితలాటకం' అన్నట్లు చూసి రుసరుసలాడుకుంది ఉష. 'ఇష్షు' అన్నాడుఅతడు.

(54-వ పేజీ చూడండి)

సౌందర్యదేవత

'రమ్యశ్రీ'

పూర్వము గ్రీసుదేశాన్ని పాలించిన ఒక రాజుకు ముగ్గురు కుమార్తెలు ఉండేవారు. వారు ముగ్గురూ చాలా అందమైనవారు. అందరికంటే ఆఖరి అమ్మాయి చాలా అందంగా ఉండేది. అందువల్ల ఆ రాజ్యంలోని ప్రజలందరూ ఆమెను 'సౌందర్య దేవత' అని పిలుస్తూ, నిజమైన సౌందర్య దేవతగానే భావించి, పూలమాలలతో అలంకరించి, ఆమెకు పూజలు చేస్తూవుండేవారు. ఆమెకు తలిదండ్రులు పెట్టిన పేరేమిటో ఎవరికీ తెలియదు. ఆమె ప్రజలలో సౌందర్య దేవతగానే ప్రసిద్ధి కెక్కింది.

ఇలా ఉంటూఉండగా కొన్నాళ్ళకు నిజమైన సౌందర్యదేవతకు విలువ తగ్గి, ఆమె నెవరూ ప్రార్థించి కానుక లర్పించేవారే లేకపోయారు. తన ఈ అవమానానికి కారకురాలైన గ్రీసురాకుమార్తెమీద పగ తీర్చుకోవాలనుకుంది సౌందర్య దేవత. అనుకున్నదే తడవుగా తనకుమారుడైన మన్మథుణ్ణి పంపి, రాకుమార్తె-దిక్కుమాలిన - ఒక కురూపియైన భిక్షుగాడిని ప్రేమించేలా చేసి రమ్మంది.

మన్మథుడు తల్లి ఆజ్ఞప్రకారం తన తూణీరాలతో రాకుమార్తె ఉన్నచోటికి వచ్చాడు. తన బాణాలను విసరి ఆమె ఒక కురూపిని ప్రేమించేలా చెయ్యడానికి మారుగా అతడామెసౌందర్యానికి ముగ్ధుడై, తనే ఆమెను ప్రేమించి, తన బాణాలతో తనకే గాయపరచుకున్నాడు. ఆమెను ఓడించబోయి తనే ఓడిపోయాడు. కానీ — ఇంత జరిగినా ఇవేమీ రాకుమార్తెకు తెలియదు.

ఆమె అక్కగార్లు యిద్దరూ, రూప,గుణ,యౌవన, శక్తి సంపన్నులైన ఇద్దరు రాకుమారులను పెళ్ళిచేసుకున్నారు. కానీ, ఆమె సౌందర్య దేవతగా పరిగణింపబడడంవల్ల పూజ్యురాలని-ఏ రాకుమారుడుగానీ ఆమెను పెళ్ళిచేసుకోవడానికి ముందుకు రాలేదు. అందువల్ల ఆమెకు పెళ్ళికాలేదు. అప్పుడు రాజు చింతించి, సౌందర్యదేవతేమైనా ఆమెమీద కోపగించుకుని ఉందేమోనని తెలుసుకోవడానికై జ్యోతిష్కులను పిలుచుకురమ్మన్నాడు.

జ్యోతిష్కులు వచ్చిన తర్వాత, రాజు వారి నీ విషయమై ప్రశ్నించాడు. వారు సౌందర్యోపాసన చెయ్యగా దేవి వారికి — "రాజుగారి చిన్నకుమార్తెను అలంకరించి, పెండ్లిబట్టలు కట్టబెట్టి, ఆమెను తీసుకుని పోయి, ఎత్తుగాఉన్న ఒక కొండమీద ఏకాంతంగా వదలిపెట్టిరావలసినదనీ, అది దైవశాసనమనీ, అలా చెయ్యకపోతే రాజ్యం శత్రువుల పాలపడమేకాక, రాజ్యంలో ప్రజలందరూ దుస్థితి పాలు కావలసి ఉంటుందనీ" అగోచర రూపంలో వచ్చి చెప్పిందట.

దైవజ్ఞులమాటలు విని, రాజుకు దుఃఖం పొంగుకొచ్చింది. కన్నబిడ్డను చేతులారా అంత దురవస్థకు పాలు చెయ్యడంకంటే, కసాయివాడి కప్పగించడం మేలనుకున్నాడు. కానీ, ప్రజాక్షేమంకోరి అయినా ఆవిధంగా చెయ్యక తప్పలేదు.

ఈ విషయా లేవీ చెప్పకుండా, రాకుమార్తెను బాగా అలంకరించి, నమ్మకమైన రాజభటులు కొందరు, ఒకరోజు రాత్రి ఆమెను తీసుకువెళ్ళి దూరంలోఉన్న ఒక పర్వత శిఖరం మీద వదలి వచ్చేశారు.

వాళ్ళు తననక్కడ చీకటిలో ఒంటరిగా వదలి, వెనుదిరిగి వెళ్ళిపోతూండడం చూచి, రాకుమార్తె భయంతో బిగ్గరగా ఏడుస్తూ పిలిచింది. కానీ, వాళ్ళు వినిపించుకోకుండా వెళ్ళిపోయారు.

రాకుమార్తె ఒకపెద్ద బండరాయి మీద కూర్చుని, దిక్కులు చూస్తూ, ఏ క్షణంలోనైనా తనని విపరీతాకారముగల పెద్ద రెక్కలరాక్షసులు ఎత్తుకొనిపోయి చంపివేయవచ్చునని భయపడసాగింది. ఆ చల్లనిగాలిలో,

భయపడనక్కరలేదనీ, కొంతసేపటిలోనే మేలు కలుగుతుందనీ ఎవరో తన చెవిలో మెల్లగా చెప్పినట్టయి ఆమె తిరిగిచూచింది. కానీ, అచ్చట ఎవరూ ఆమెకంటికి కనుపించలేదు. తను భ్రాంతిపడ్డానేమో అనుకుంది. కానీ - అది భ్రాంతికాదు. సమీరకుమారుడే ఆమెచెవిలో ఆమాటలన్నాడు.

చల్లని ఆ పిల్లగాలికి మైమరచి రాకుమార్తె త్వరలోనే నిద్రపోయింది. కొంతసేపటికి మన్మథుడు ఒక రెక్కలరాక్షసుని రూపంలో వచ్చి, ఆమెను మనోహరమైన పచ్చటి కొండల సందుకు మోసుకుపోయి, అచ్చట ఒక కొలనుగట్టున యిసుకమీద విడిచాడు.

మన్మథుడు మోసుకు వస్తుండగా ఆమెకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి ఆ భయంకరరూపాన్ని చూచి- కేకకూడా వేయలేక కిక్కురు మనకుండా మరుక్షణంలోనే కళ్లుమూసుకుంది ఆమె.

ఉదయం నిద్రలేచి తనముందున్న మనోహరమైన తోటను చూచి, రాకుమార్తె తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. "రకరకాల చెట్లతో ఏపుగా పెరిగిన ఈసుందరమైన తోట ఎంతో మనోహరంగా ఉంది. దీనిలో కొంతసేపు విహరిస్తాను" అని అచ్చటికి వెళ్ళేసరికి ఆమె కా తోటలో- పదిగజాల దూరంలో - ఒక దివ్యమైన భవనం కనిపించింది. ఆభవనం ముందు జలయంత్రాలు నీళ్ళను చిమ్ముతున్నాయి. ఆమ భయపడు



సౌందర్య దేవత

తానే ఆ భవనంలోకి ప్రవేశించి, గదులంతా తిరుగసాగింది. ఆ భవనపు గోడలను, స్తంభాలను బంగారుతో నిర్మించి, వాటిమీద వెండి చిత్రాలను చెక్కించి ఉన్నారు. విశాలమైన ఆ బంగరుభవనంలో ఆమె అన్నీ పరికించి చూడకముందే, ఒకటి రెండుసార్లు ఏవో కొన్ని మధుర కంఠస్వరాలు వినిపించినట్టయి నలువైపులా చూచింది. కానీ, ఎవరూ కనుపించలేదు. అది భవనం ముందున్న జలయంత్రం చిమ్ముతున్న నీటిసవ్వడి కావచ్చుననుకుంది. మరొకగది తలుపుతీసి, ఆ గదిలో బల్లముందున్న కుర్చీలో కూర్చుంది. అప్పటికామె చాలా ఆకలితోనూ, అలసటతోనూ వుంది. ఆమె అలా కూర్చుని ఉండగానే, ఆమె ముందున్న బల్లమీద రుచిగల పదార్థాలూ, భోజనమూ ఒక బంగరుపళ్ళెరంలో ఏ అదృశ్య వ్యక్తులో తెచ్చి పెట్టారు. ఆమె భోజనం ముగించింది. ఆ తర్వాత ఆమె కట్టుకోవడానికి ఎక్కువ విలువైన సన్నని చీనాంబరాలు తెచ్చి పెట్టారు. కానీ, అవంతా చేస్తున్నవారెవరో ఆమెకు కనుపించలేదు. అందువల్ల ఆ భవనం కామరూపులైన ఏ రాక్షసులదో అయివుంటుందనీ, వాళ్ళే యిలా చేస్తున్నారనీ ఆమె భయపడసాగింది. అప్పుడామెకు: "ఓ సౌందర్య రాకుమారీ! భయపడనక్కరలేదు. వాళ్ళు రాక్షసులు కారు. నీ చెలికత్తెలు. నీవేమి చెప్పినా నీ ఆజ్ఞప్రకారమాచరిస్తారు. ఇది నీ స్వంతయిల్లులా భావించి, ఇక్కడ సంతోషంగా కాలం గడుపు" అన్న మాటలు వినిపించాయి. అయినా అప్పటికీ ఆమె హృదయంలోని భయం పూర్తిగా తొలగిపోలేదు. సూర్యుడస్తమించి క్రమక్రమంగా చీకటి పడుతూరాగా ఆమెకు మరీ భయమెక్కువ కాసాగింది. ఎందువల్లనంటే అంత పెద్ద భవనంలో ఆమె ఏకాకిని. చెలికత్తెలున్నా వాళ్ళు కనుపించరు. అదృశ్య వ్యక్తులు.

గడచిన రాత్రి తనను కొండ శిఖరంమీదనుంచి మోసుకునివచ్చిన భయంకరమైన రెక్కల రాక్షసుడు, మళ్ళీ ఈరాత్రిగూడా వస్తాడేమోనని భయపడసాగింది. ఇంతలో ఏదో రెక్కలతో వచ్చి అక్కడ వాలిన చప్పుడు వినిపించింది. అంతేకాకుండా ఆ ఆకార మామెను సమీపించి: "సౌందర్య రాకుమారీ! నీవు నా భార్యగా ఉండడానికి సమ్మతించినట్టయితే, నేను ప్రతిరోజు రాత్రి యిచ్చటికి వస్తాను. అయితే ఇక కొంతసేపట్లో సూర్యోదయమవుతుందనగా యిచ్చటినుంచీ వెళ్ళిపోతాను. నీవు నా ముఖాన్ని చూపించమని అడగడంకానీ, నేనెవరినో తెలుసుకోవాలని ప్రయత్నించడంకానీ ఏమీ చెయ్యకూడదు. నామాట నమ్మి నన్ను ప్రేమిస్తే నీకు శుభం కలుగుతుంది" అని అన్నది.

రాకుమార్తె సమ్మతించింది. ఆ వింతవ్యక్తి ప్రతిరోజు రాత్రి వచ్చి, ఆమెతో సౌఖ్యంగా గడిపి పోతూ వుండేవాడు. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు ఆమె తన ఉద్యానవనంలో పూలను కోస్తూ, తనను రాజభటులు ఏ పర్వతంమీద అయితే వదలి వెళ్ళారో ఆ పర్వతంమీద తన అక్కగార్లు ఇద్దరూ కూర్చుని గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ ఉండడం చూసింది. ఆ కొండమీద ఉన్న రాక్షసుడు తనను మింగేసి ఉంటాడని భావించి, వాళ్ళు తన కోసమే అంతగా దుఃఖిస్తూ ఉన్నారేమోననుకుంది. ఆ రోజు తన ప్రియుడు రాగానే ఈవిషయం చెప్పి, తను బ్రతికే ఉన్నదన్న విషయం తన అక్కగార్లకు తెలియజేసి,

ఐన్‌స్టీన్‌కు చదవడం రాదు!

ప్రఖ్యాత విజ్ఞానశాస్త్రవేత్త ఐన్‌స్టీన్, ఓ రోజు న్యూయార్కులో ఓ పెద్ద హోటల్లో భోజనానికని కూర్చున్నప్పుడు ఓ నీగ్రో వెయిటర్ 'మెనూ' కార్డు ఆయనకిచ్చాడు. 'మెనూ' కార్డులో చిన్న అక్షరాలు చదవటానికని కళ్ళజోడుకోసం చూసుకొంటే జేబుల్లో కనపడలేదు. ఆయన కళ్ళదగ్గరగా పెట్టుకొని కిందనుండిమీదకు వెనక్కు ముందుకూ చూసి అక్షరాలు సరిగ్గా కనపడకపోవటంతో "ఏదీ, అబ్బాయ్, నువ్వే మెనూ కార్డు చదువు...విని ఏది కావాలో ఆర్డర్ చేస్తాను" అన్నారు. వెయిటర్ కూడా కార్డును కిందకూ, మీదకూ, వెనక్కూ ముందుకూ చూసి ఐన్‌స్టీన్ దగ్గరగా వచ్చి మెల్లగా రహస్యంగా చెప్పాడు... "సార్...నాకూడా మీలాగే చదవటం రాదండీ..." అని!

ఎమ్. వి. ఎస్. రావు
(భువనేశ్వర్)

వారిని పిలుచుకు రావలసినదిగా ప్రార్థించింది. కాని, అతడు మొదట సమ్మతించలేదు. చివరికి సమ్మతించి ఆ మరునాటిరోజు వారిని ఎత్తుకుని వచ్చి, తన ప్రియురాలిముందు విడిచాడు.

వాళ్ళు తమచెల్లెలు నివసిస్తున్న సుందరమైన ఆ స్వర్ణ భవనాన్ని చూచి ఆనందించడానికి మారుగా, ఆమెకు కలిగిన సంపదకు అసూయ పడి, తమ అసూయను కనబరచకుండా ప్రేమను నటిస్తూ, ఆ రెక్కల వ్యక్తిని గురించి ఆమెను ఎన్నో ప్రశ్నలడిగారు. కాని, ఆమెకు మాత్రం ఏం తెలుసు? ఆమె ఏమీ చెప్పలేక పోయింది. వాళ్ళిద్దరి మనస్సుల్లోనూ దురభిప్రాయాలూ, దురాలోచనలూ చెలరేగుతున్నాయి. తమ చెల్లెలి ఆనందాన్ని పాడు చెయ్యడానికి వాళ్ళు తెలివిగా ప్లాను వేశారు. ఆమె ప్రియుణ్ణి గురించి, అతడొక రెక్కలుగల భయంకరమైన సర్పమనీ, ఎప్పుడో ఒకరోజు తప్పకుండా ఆమెను మ్రింగివేస్తాడనీ, అతడిప్పుడు ఆమెమీద దయ కనబరుస్తూ, తన సమయంకోసం వేచిఉన్నాడనీ, అలా కాకపోతే అతని రూపాన్ని ఆమె చూడడానికిగాని, అతడు పగటివేళ ఆమెకు కనిపించడానికిగాని ఎందుకు ఒప్పుకోడనీ, కాబట్టి అతను నిద్రపోతున్నపుడు బాకుతో పొడిచి చంపి, ఆమె ప్రాణాలను భయంకరమైన చావునుంచి తప్పించుకోవలసినదని చెప్పి, వాళ్లు తమ చెల్లెలి చేతికొక బాకునిచ్చి వెళ్ళిపోయారు.

ఆమె భయపడసాగింది. తన యిద్దరు అక్కగార్లు చెప్పిన మాటలవల్ల ఆమెకు తన ప్రియునిమీది నమ్మకమంతా నశించిపోయింది. 'తను అతణ్ణి చూడడానికి అతడెందుకు సమ్మతించలేదు? అతనికి రెక్కలు ఎందుకున్నాయి? ఇవి తప్పక కనుక్కోవాలి' అనుకుంది. ఆ రోజు రాత్రి ఆమె ప్రియుడు నిద్రిస్తున్నాడు. ఆమె దీపం వెలిగించి, బాకు చేతితో పట్టుకుని, మెల్లమెల్లగా అతడు నిద్రిస్తున్న గదిలోకి వెళ్ళింది. దీపపు కాంతి అతని ముఖంమీద పడింది. ఆ వెలుగులో ఆమె అతని ముఖాన్ని చూచింది. అతని ముఖం చాలా అందంగా వుంది. అతని తెల్లటి రెక్కలు భుజాలమీద ముడుచుకుని ఉన్నాయి. ప్రక్కన ఒక విల్లు, అమ్ములపొది పడిఉన్నాయి. వాటిని చూడగానే ఆమె, అతడు మన్మథుడని తెలుసుకుంది. రెప్ప వెయ్యకుండా కొన్ని నిమిషాలపాటు అతణ్ణి చూచింది. ఉన్నట్టుండి చేతులు వణకనారంభించడంతో ఆమె చేతిలో వున్న బాకు జారి క్రిందపడిపోయింది. ఆమె అతని ప్రక్కన ఉన్న అమ్ములపొదిలోంచి ఒక అమ్మును తీసి దాని వాడిమొనతో తన వ్రేలిమీద గుచ్చుకుంది. దాని స్పర్శ తగులంగానే ఆమెలో, అతణ్ణి చంపాలన్న భావన తొలగిపోయి, అతణ్ణి మరింత గాఢంగా ప్రేమించసాగింది. దీపాన్ని అతనిముఖానికి చేరుగా ఎత్తులో పెట్టబోతూ ఒకమారు మళ్ళీ అతనిముఖాన్ని పరీక్షగా చూచింది. ఆ సమయంలో దీపంలోంచి ఒకచుక్క కాగిన నూనె కారి అతనిముఖంమీద పడింది. వెంటనే అతడు మేలుకుని ఆమెను బాగా తిట్టి, ఆ రాత్రిలోనే రెక్కలు విప్పుకుని వెళ్ళిపోయాడు. అతడు వెళ్లిన మరుక్షణమే ఆ బంగారుభవనం కనబడకుండా మాయమైపోయింది. రాకుమార్తె అక్కడ ఒంటరిగా మిగిలిపోయింది.

వానా, వానా

క. వస సీతారామానుజం

వానా వానా
మళ్ళీ రా.
మబ్బుల తల్లీ
మళ్ళీ రా.
పిల్లా జెల్లా అంతా
అల్లిబిల్లిగ తిరగంగ
పిల్లల ముచ్చట తీర్చంగ
చల్లనిగాలి వీయంగ. వానా.
రైతులు నాగలి పట్టంగ
గొడుగులు నాట్యం చేయంగ
కప్పలు గంతులు వేయంగ
జీవికి జీవం పోయంగ. వానా.
ప్రకృతి శోభతో పండంగా
చెరువులు జలముతో నిండంగా
చేపల కోర్కెలు తీర్చంగా
వేగం వేగం రావమ్మా. వానా.
వానా వానా
మళ్ళీ రా.
మబ్బుల తల్లీ
మళ్ళీ రా.

ఆమె చాలా సేపటివరకూ దుఃఖించింది. ఆ తర్వాత ప్రియుడైన మన్మథుణ్ణి వెతుకసాగింది. అయినా అతడెక్కడా కనుపించలేదు. చివరికామె సౌందర్యదేవత ఆలయాన్ని చేరుకుని, తన ప్రియుడు తనకు దొరికేలా అనుగ్రహించవలసినదని దీనంగా ప్రార్థించింది. సౌందర్యదేవత జరిగిన విషయాలన్నీ యింతకుమునుపే సముద్రపుకాకి వల్ల వినివుండడంవల్ల రాకుమార్తెమీద మునుపటికంటే ఇప్పుడామెకింకా ఎక్కువ కోపం కలిగింది. సాధించలేనిపనులు చెప్పి రాకు

సౌందర్య దేవత

మార్తె కిప్పుడు శిక్ష విధించాలను కుంది: "ఈ నాలుగు పనులనూ నీవు సాధించుకువచ్చినట్లయితే నీ ప్రియుడు నీకు దొరికేలా అనుగ్రహిస్తాను. నా తేరు క్రింద పావురములు, ఊరపిచ్చుకలు తమ ఆహారం కోసం తెచ్చుకుని తింటున్నప్పుడు రాలిన రకరకాల ధాన్యపు గింజలున్నాయి. వాటిని రకంవారీ వేరువేరుగా నీవు రేపు సూర్యోదయమయ్యేలోపుగా పర్చరచి ఉంచాలి. ఇది నీవు చేయవలసిన పనులలో మొదటిది" అన్నది.

మర్నాడు సూర్యోదయమయ్యేలోపుగా ఆపని చేయడానికి సాధ్యం కాదని రాకుమార్తె అధైర్యంతో తలనువాల్చి దుఃఖిస్తూ కూర్చుంది. కొంతసేపటిలో అక్కడికి కొన్ని ఎఱ్ఱచీమలు వచ్చి బారులుపెట్టకుని, తేరుక్రింద ఉన్న ధాన్యపు గింజలన్నిటిని రకంవారీ ఈడ్చుకు వచ్చి, చూస్తుండగానే ప్రోవులుపెట్టాయి!

సూర్యోదయమవగానే సౌందర్య దేవత కనుపించి, రకంవారీవున్న ధాన్యపుగింజల కుప్పలను చూచి, ఆశ్చర్యపోయింది. "ఈపని దానికంటే కష్టతరమైనది. ఈరోజు సూర్యాస్తమయానికి ముందే నా బంగరు గొఱ్ఱెలలో ఒకదాని వెంట్రుకలను కత్తిరించుకు వచ్చి, రేపు ఉదయం నేను కనుపించినప్పుడు నాకు అప్పగించాలి. ఇది రెండవ కార్యం" అని మాయమైపోయింది.

సౌందర్య దేవత బంగారు వెంట్రుకల గొఱ్ఱెలగుంపు, ఆ సమీపపర్వత ప్రాంతంలో ప్రవహిస్తున్న ఒక నది కవతల ఉన్న పచ్చికమైదానంలో మేస్తున్నాయి. రాకుమార్తె నేరుగా అక్కడికివెళ్ళి నదిలో దిగబోయింది. అప్పుడు నదిఒడ్డున వున్న రెల్లుగడ్డి, ఇప్పుడా బంగారు వెంట్రుకల గొఱ్ఱెల వద్దకు వెళ్ళవద్దనీ, పగటివేళలలో అవి చాలా రోషంగా వుంటాయనీ, కాబట్టి సూర్యాస్తమయ వేళకు వెళ్ళి, అవి నిద్రిస్తున్నప్పుడు పొదల చాటుననుంచీ కొన్ని వెంట్రుకలు సేకరించవలసినదనీ ఆమెకు చెప్పింది.

రెల్లుగడ్డి చెప్పిన ప్రకారం రాకుమార్తె సూర్యాస్తమయమయ్యే వరకూ అచ్చట ఆగి, ఆతర్వాత నదలో సిద్ధంగావున్న నావనెక్కి, అవతలిగట్టు చేరుకుని, బంగారు వెంట్రుకల గొఱ్ఱెలలోనుంచీ కొన్ని వెంట్రుకలను జాగ్రత్తపరచుకుని, మళ్ళీ అదేనావలో యివతలిగట్టు చేరుకుంది.

ఆ మరునటి ఉదయం ఆమె సౌందర్య దేవతకు వాటిని సమర్పించింది. ఆమె ఆ బంగారు వెంట్రుకలను చూచి, రాకుమార్తెతో: "నీవు రెండు కార్యాలను సాధించుకువచ్చావు. నీకు దేవతలు సాయపడుతున్నారు. అయినా ఫరవాలేదు. ఇదిగో! ఈ చిన్న బంగరు గిన్నె తీసుకువెళ్ళి, ఆ ఎత్తుగా కనబడుతున్న పర్వతశిఖరంమీద ప్రవహించే ప్రవాహంలోని, స్వర్ణ జలాలను దీని నిండుగా తీసుకురా. ఈదినం నీవు చేయవలసిన కార్యమిది" అని ఒక బంగరుగిన్నెను ఆమె చేతికిచ్చి, ప్రవాహమున్న పర్వతశిఖరాన్ని చూపి, మాయమైంది.

ఎత్తుగావున్న ఆ పర్వత శిఖరం మీద పుట్టిన ఆ ప్రవాహం, నున్నని ఒక పెద్ద బండరాయి మీదుగా ఝుల్లున ప్రవహిస్తోంది. దాని కిరువైపులా రెండు గుహలున్నాయి. ఆ రెండు గుహలలోనూ రెండు భయంకరమైన సర్పాలు నివసిస్తున్నాయి. రాకుమార్తె సౌందర్య దేవత యిచ్చిన స్వర్ణపాత్రను తీసుకుని పర్వతం వద్దకు వచ్చింది. ఇక ముందుకు అడుగు వెయ్యడానికి వీలులేకుండా, అచ్చట ఒక లోతైన గొయ్యి చాలా దూరం వరకూ వ్యాపించి, ఆమెను అటుక

పంచశీల

మా స్కూలులో కృష్ణసింగ్ అనే కుర్రాడుండేవాడు. అమాయకుడు. సోషల్ మాస్టారు చెప్పినవన్నీ గుర్తుంచుకునేవాడు. ఒకనాడు డి.ఇ.ఓ. మా స్కూలుకొచ్చాడు. మా క్లాసులోకి వచ్చేటప్పటికి మా సోషల్ మాస్టారు పాఠం చెబుతున్నారు. పాఠం ఆపించి ప్రశ్నలడగడం మొదలెట్టారు. మా కృష్ణసింగ్‌ను పంచశీల గురించి నీకు తెలిసిందేమిటో చెప్పమన్నారు. కంగారుపడిపోయి మా సోషల్ మాస్టారు చెప్పినది ఇలా చెప్పాడు: "దీనిని నెహ్రూగారు రచించారు. నెహ్రూగారు, చౌఎన్‌లై కలిసి దీనిమీద సంతకాలు పెట్టారు. చౌఎన్‌లై భారత భూభాగంపై దండెత్తి ఆక్రమించుకోవటంవల్ల ఆయన పంచ తీసుకొనిపోయినట్లైంది. ఇక మన నెహ్రూగారికి తన 'శీల' మిగిలింది." క్లాసంతా ఒక్కసారిగా గొల్లుమని నవ్వింది.

—కొత్తగుంట సుదర్శనం
(వడిపాడు)

పరచింది. దానినిచూచి, అంత వరకూ వున్న ఆమె ఉత్సాహ మంతా నశించిపోయింది. "నే నా శిఖరప్రవాహాన్ని ఈ జన్మలో చేరుకోలేను" అని చింతతో దుఃఖించ సాగింది. అప్పుడు ఒక పెద్ద 'రాబందు' వచ్చి, ఆమెచేతిలోని బంగరుగిన్నెను తన్నుకుపోయి, పర్వతశిఖరంమీది ప్రవాహపు స్వర్ణజలాలను గిన్నె నిండుగా ముంచుకునిముక్కుతో పట్టుకునివచ్చి రాకుమార్తెచేతి కిచ్చింది.

ఆమె సంతోషంతో ఆ స్వర్ణ జలాలను తీసుకునివచ్చి, సౌందర్య దేవత కిచ్చింది. కానీ ఆ స్వర్ణజలా లను చూచి సౌందర్యదేవత సంత సించలేదు. "ఇదిగో! ఈ భరిణెను తీసుకుని పాతాళలోకానికి వెళ్ళి, ఆలోకపురాణి చేతి కిచ్చి, ఆమె సౌందర్యరసాన్ని దీనిలో నింపమని తీసుకురా. ఇది అన్నిటికంటే కష్టతర మైన కార్యం. ఇదే కడపటిది కూడాను" అని ఒక బంగరుభరిణెను యిచ్చింది.

ఆమాటలు విని రాకుమార్తె చాలా నిరాశపడింది. తను పాతాళ లోకానికి ఎలా వెళ్ళగలదు? ఆమె చాలా దూరం పోయిపోయి చివరికి ఒక ఎత్తైన గోపురాన్నెక్కి అక్కడ నుంచీ క్రిందికి దూకి ప్రాణాలను వదలాలనుకుంది. అప్పుడా గోపు రపు రాళ్లు ఆమెమీద జాలిపడి "రాకుమారీ! ఇదిగో—మామాట విను. మేము నీకు సాయంచేస్తాం! నువ్వు ఇక్కణ్ణుంచి పడి ప్రాణాలు పోగొట్టుకోవాలనుకున్న ఆలోచన మానివెయ్యి. ఈ రెండు రొట్టె ముక్కలు, రెండు బంగారు నాణాలు తీసుకుని, ఆ కనుపిస్తున్న పెద్ద కొండ గుహావద్దకు వెళ్లు. అక్కడ నీవు కొన్ని మెట్లు ఉండడం చూడగలవు. వాటిగుండా వెళ్ళితే తిన్నగా అవి నిన్ను పాతాళలోకానికి తీసుకు పోతాయి. అక్కడ ఒక భయంకర మైన నది అడ్డంగా ప్రవహిస్తూ ఉం టుంది. ఆ నదిని దాటించడానికి ఒక పడవవాడు ఉంటాడు. వానికి ఒక బంగారునాణెమిచ్చి, నదిని దాటి ఒడ్డు చేరుకుంటే అచ్చట పాతాళలోకపు రాణి అంతఃపురం కనిపిస్తుంది. ఆ అంతఃపురద్వారంవద్ద మూడుతలలు కలిగి భయంకరంగావున్న ఒకపెద్ద కుక్క కావలికాస్తూ వుంటుంది. దానికి ఒక రొట్టెముక్క వేసి, తప్పించుకుని లోపలికి వెళ్ళి; పాతాళ లోకరాణిని ఆమె సౌందర్యంలో కొంతభాగం నీవద్దనున్న భరిణెలో నింపమని ప్రార్థించు. ఆమె అలా చేసినతర్వాత భరిణెను భద్రంగా మూతవేసి, వెనుదిరిగి ద్వారంవద్దకు వచ్చి రెండవ రొట్టెముక్కను కుక్కకువేసి, అచ్చటినుంచీ తప్పించు కుని బయటపడి, రెండవ బంగారు నాణాన్ని పడవవాని కిచ్చి, నదిని దాటి ఆ గుహామార్గంగానే ఈలోకా నికి వచ్చేయి. కానీ, ఆ భరిణె మూతను తిసి చూడవద్దు. అలా చేస్తే నీకు తప్పకుండా అపాయం సంభవిస్తుంది" అని చెప్పి, రొట్టె ముక్కలను బంగారు నాణాలనూ యిచ్చి పంపాయి.

రాకుమార్తె వాటి సలహాకు వందనములర్పించి, అక్కడనుంచీ చాలా సంతోషంగా ఆ పెద్ద కొండ గుహావద్దకు వెళ్ళి, గుహలోవున్న నిటమైన మెట్లగుండా క్రిందికి దిగ సాగింది. అచ్చట చాలా చీకటిగా వుంది. పూర్తిగా ఆ మెట్లను దిగి క్రిందికి పోయేసరికి అక్కడ ఒకనది కనిపించింది. ఆ నదినీరు చాలా నల్ల గానూ, మురికిగానూ ఉన్నాయి. పడవవాడు ఒడ్డున కూర్చుని ఉన్నాడు. రాకుమార్తె అతనికొక బంగరునాణె మిచ్చి, తనని నది కవ తలిగట్టు చేర్చమంది. అతడామెను నది దాటించాడు. ఆ తీరములోనే పాతాళరాజ్యపు రాణి అంతఃపురం కనిపించింది. ద్వారంవద్దకు వెళ్లే

పాపాయి సందేహం

శిష్లా ఖడ్గ నారాయణరెడ్డి

ఔనమ్మా! నేనే ఒక
అందమైన కుక్కపిల్ల
నై నీ దరి కరుగుదెంచి
అన్నమంటె పెడతావా?

అవునమ్మా! నేను మరేం
ముద్దులొలుకు పిల్లినయి
పరుగున నీ దరికొస్తే
పాలయినా పోస్తావా?

అమ్మా! అమ్మా! నే నొక
చక్కని పూమొక్కనయి
నిలువున ఎండలొ మాడితె
నీళ్లయినా పోస్తావా?

అమ్మా! నేనేమొ బలే
అల్లరి పనులెన్నొ చేస్తు
పాడుపేరు తెస్తే—నను
పాపా! అని పిలుస్తావా?

అమ్మయె దైవమని నమ్మి
అనవరతము చదువుకొనుచు
బుద్ధిగానె మసలుకొంటె
ముద్దొకటిస్తావు కదూ?

వరికి రాకుమార్తెను చూచి, మూడు తలలకుక్క తనమూడునోళ్ళతోనూ ఒకేసారి మొరుగసాగింది. రాకుమార్తె తనవద్దనున్న రొట్టెముక్కలలో ఒకటి దానికి వేసి, అది తింటూండగా అంతఃపురాన్ని ప్రవేశించింది. ద్వారాలన్నిటినీ దాటి చివరి కామె పాతాళలోకపురాణి వున్నచోటుకి చేరుకుని, ఆమెచేతికి బంగరుభరిణె యిచ్చి దానిలో ఆమె సౌందర్యాన్ని నింపమని ప్రార్థించింది. రాణికి ఆమెమీద జాలికలిగి తన సౌందర్యాన్ని అందులో నింపి రాకుమార్తె కిచ్చింది. రాకుమార్తె పాతాళరాణికి వందనము లర్పించి, అచ్చటినుంచి త్వరగా వెనుదిరిగి రాబోయింది. ద్వారంవద్ద ఆమెను మళ్లీ మూడుతలలకుక్క అటకాయించింది. రెండవ రొట్టెముక్కను దానికి వేసి, ద్వారం దాటి ఒడ్డును చేరుకుని రెండవ నాణాన్ని పడవ వాని కిచ్చి, నది కివతలిగట్టు చేరుకుని మెల్లెక్కి కొండగుహలోకి రాసాగింది. పూర్తిగా కొండగుహ దాటి యివతలికి వచ్చేసరికి ఆమెకు ఆ భరిణె మూతను తీసి చూడాలనిపించింది. గోపురపు వాళ్లు చెప్పిన మాటలు మరచిపోయింది. ఆ భరిణె మూతను తీసి, అందులోని సౌందర్యరసాన్ని త్రాగాలనుకుని మూతను కొంచెం వదులు చేసేసరికి ఆమెకు మూర్ఛవచ్చి అలానే పడిపోయింది. అప్పుడు మన్మథుడు పరుగెత్తుకువచ్చి, మూర్ఛనుంచి తెలివిని పొందేవరకూ ఆమెకు ఉపచారము చేసి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఆమె బంగరుభరిణె నెత్తుకుని, సౌందర్యదేవతవద్దకు వెళ్లింది. ఆ సమయంలో మన్మథుడు డామెకు సాయపడకపోయినట్టయితే, ఆమె

జీవించివుండేది కాదు.

ఆ భరిణెను సౌందర్యదేవతచేతి కివ్వగానే ఆమె 'భేష్! అన్ని కార్యాలూ సాధించావు. ఇదిగో! యిప్పుడు ఒక క్షణకాలం కళ్లుమూసుకుని, దీర్ఘశ్వాస పీల్చు" అన్నది. రాకుమార్తె అలా చేసింది. వెంటనే సౌందర్యదేవత ఆ భరిణెలో వున్న సౌందర్యరసాన్ని త్రాగి గంధర్వ రూపంధరించి, గగనవీథి కెగిరి పోయింది.

రాకుమార్తె కళ్లుతెరచి సౌందర్యదేవత ఆకాశంలో కెగిరిపోతూండడం చూచి, అక్కడే పడి వున్న బంగరు భరిణెలోని ఒకచుక్క సౌందర్యరసాన్ని తన నాలుకమీద వేసుకుంది. వెంటనే ఆమెకూడా ఒక అందమైన సీతాకోకచిలుక లాంటి రెక్కలుగలిగిన చిన్న సౌందర్యదేవతగా మారిపోయింది. అప్పుడు ఆమె ప్రియుడైన మన్మథుడు తన తెల్లటి రెక్కలతో ఆమె ముందు వచ్చి వాలాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ హిమాలయాలమీదికి ఎగిరిపోయి ఇతర దేవతలతో కలసి, చాలాకాలం హాయిగా గడిపారు.

(ఆధారం: ఒక ఆంగ్లకథ)

ఉషాకన్య కథ

(47 వ పేజీ తరువాయి)

ఎర్రగన్నేరు మొగ్గలవర్ణం దనంతో ఒట్టిమూపుచూసి "ఇదుగో పర్దేశీ—హద్దూ పద్దూ లేకుండా ఏపటి భాగోతం" అందిఉష. హాశులు కున్నాడు అబ్బాయి. 'హాబొప్పే' మనుకున్నాడు.

'పర్దేశీ ఏమిటి? సర్గాగా మాట్లాడక? నా ప్రేమకు సరిహద్దులూ, నా ఊహాలచాకలిపద్దలూ లేనే లేవు. సికాకులం టే సరిహద్దులు పెట్టిద్దాం. చా.. పద్దాలు రాయిద్దాం. ఎహా భాగోతంఅంటావా, భారమైన గోతం భరించడం కష్టమని భాగోతంతో పోనిస్తున్నాను." ఉష ఉలిక్కిపడింది.

"ఈ అడివిలో ఎన్నో కాయ లున్నాయి గాని సీలాంటి వాగుడు కాయి ఎక్కడా లేదు" అంది.

"అంతేకాదు. నాతలకాయ్‌లాంటి తలకాయ్ ఈచుట్టుపట్ల లేనే లేదు. ఎహా, గుండెకాయ అంటావా – మధురం మధురం మనోహరం" అంటూ భావకవిలాగా భావకి చక్కిలిగింతలు పెట్టాడు అతను.

"ప్చ్ ప్చ్" అని నిట్టూర్చింది రాకుమారి.

'ఏంంంంంంంం' అన్నాడు పరదేశి.

'మరేంంంం లేదు. పాపం వాక్కాయనే పేరు మరో కాయకి పెట్టారుగదాని విచారిస్తున్నా' అని తల్లుగ్గా వెక్కిరించింది ఆమె.

'ఎక్కొచ్చి నాకు పెడితే బాగుండేది అంటావు – అంతేగా – తన్నా తియ్యగా మాట్లాడతావ్ మాటకారివే మొత్తానికి' అన్నాడు పరదేశి.

ఈ సుందరుడు ఆమెకు బంధమై పోతున్నాడు. ఆ సుందరి ఇతనికి అనుబంధమైపోయింది.

రాకుమారి రాజహంసలాగా మెల్లిగా నడవసాగింది. పరదేశి కూడా నీడలా అనుసరించాడు. కాసేపు వాళ్లు మాటలు పారబోసుకోకుండా నడిచారు.

(ఇంకా ఉంది)



ప్రభాత్ ఫిలింస్‌వారి 'ఏక్ ఫూల్ చార్ కాంటే'లో వహీదా-సునీల్‌దత్.

వార్తాభరణం

సినిమా

ఆంధ్రుల రామభక్తికి అమరసంకేతమై అమరసంగీతం కూడా సృష్టించిన రామదాసు భక్తిరసభరిత గాథ వి. ఎస్. ఫిలిమ్స్ నిర్మిస్తున్నారు. నాగయ్య, లింగమూర్తి, గుమ్మడి, పసల సూర్యచంద్రరావు, శీర్ల బ్రహ్మయ్య, కన్నాంబ, సూర్యకుమారి నటిస్తున్న ఈ చిత్రం నిర్మాణం తిరిగి కొనసాగుతున్నది. రేలంగి ఇందులో అతిథి నటుడుగా పాల్గొంటారు.

* * *

ఏ. ఎ. సుబ్బారావు నిర్మిస్తున్న 'భీష్మ' అక్టోబరు చివరి వారంలో సెట్స్ పైకి వెళ్లనున్నది. ఎన్. టి. రామారావు భీష్ముడుగా నటిస్తారు. ఏ. నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, అంజలి కూడా ఇందులో పాల్గొంటున్నారు. సంగీత రాజేశ్వరరావు సంగీతం, ఆరుద్ర రచన నిర్వహించే ఈ చిత్రానికి నిర్మాతే దర్శకుడు.

* * *

జి. వి. ఎస్. ప్రొడక్షన్స్‌వారి భక్తిరసమయచిత్రం 'భక్త రఘునాథ్' పూర్తి కావచ్చింది. విడుదలకు సిద్ధమౌతున్న ఈ చిత్రంలో కాంతారావు, జమున, నాగయ్య, రేలంగి, వగయిరాలు నటించారు. సంగీతం, నిర్మాణం ఘంటసాల. రచన దర్శకత్వం సముద్రాల రాఘవాచార్య.

* * *

రామకృష్ణా ప్రొడక్షన్స్‌వారి 'టాక్సీ రాముడు' పారమౌంట్‌లో త్వర వేగంతో తయారు అవుతున్నది. ఎన్.టి. రామారావు, దేవిక, జగ్గయ్య ఇందులో నటిస్తున్నారు.

* * *

రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీవారి 'బాణాసుర' పౌరాణిక చిత్రం వీనస్ స్టూడియోస్‌లో తయారవుతోంది. ఈ ఉషాపరిణయం కథను కె. బి. నాగభూషణం దర్శకత్వం వహిస్తున్నారు. ఉషగా జమున, బాణాసురుడుగా రంగారావు నటిస్తున్నారు.

* * *

సంగీతవారి 'మామకు తగ్గ అల్లుడు', విజయగోపాల్ ప్రొడక్షన్స్‌వారి తెలుగు చిత్రం లోను తెలుగు సినిమాకు మరో క్రొత్త గాయకుడు పరిచయమైనాడు. బి. బసవేశ్వర్ అనే

(58-వ పేజీ చూడండి)

చిత్రసమీక్ష

మాంగల్యం

కొన్ని కథలూ, ఆ కొన్నిటిలాగా కొన్ని చిత్రాలూ, చాలా అద్భుతంగా, అమోఘంగా కరుణ, శోకం ఈ రెండూ కుప్పేసి చూస్తూ చూస్తూ చూస్తున్న వాళ్ళని కన్నీటి మున్నీటి కెరటాలలో ముంచెత్తి ఒక్కసారి 'శుభం' అనేసి ఇంటికి పంపడం అలవాటు.

ఈ అలవాటు తెరవాటు కాగలదనే నమ్మకంతో లోగడకూడా కొన్ని చిత్రాలు తీసిన ఎం.ఎ.వి. వారు ఇప్పుడు 'మాంగల్యం' పేర మరో చిత్రం నిర్మించి విడుదల చేశారు. పత్రికా రచయితలకు ఈ చిత్రం అక్టోబరు 9 వ తేదీని ఎ. వి. యం స్టూడియోస్‌లో ప్రదర్శించారు.

కుమారి (కాంతారావు) అనే కలవారి కుమార్ డాక్టరీ చదివి చూసేవాళ్ళకు కొందర్లోనే సదభిప్రాయం కలిగించడం కోసం ఫస్ట్‌క్లాస్‌లో పట్టాపుచ్చుకుని, మరో పట్నం బాబు (రామకృష్ణ) తో చెట్టాపట్టా వేసుకుని సొంతవూరు వస్తాడు పల్లెటిదిక్కు పచ్చదనం నచ్చదనం కమ్మగా అనుభవించాలనే ఆశతో వచ్చిన ఆ పట్నం బాబు, రాగానే కుమార్ చెల్లెలు (రాజశ్రీ) తో నిముషాలమీద సరాగాలు ప్రారంభించి అనురాగం అనుకోమని అమెతోపాటు అందరికీ చెప్పి కులాసాగా ఉంటాడు. ఆయిద్దరి అనురాగమూ అంతస్థుకూ, ఆత్మగౌరవానికీ తగినట్టుందంటూ కుమార్ తల్లి (పి. హేమలత) మురిసిపోతుంది.

కుమార్ స్వతఃగా ఆవేశ పూరితుడైన సౌందర్యోపాసి. అతను తన యింటి పనిమనిషి సరళ (దేవిక) తో తనకు కావలసిన గుణం, సౌందర్యం, వినయం, వివేకం గూసి ఆమెను చేసుకుంటానని తనమాటను ఉంగరం ద్వారా ఆమెకు దానమిస్తాడు. కాని ఇది విన్నతల్లి అగ్గి పిడుగై మండి పడుతుంది. అంతస్థు అడ్డం వస్తుంది. సరళకు కూడా అదే అడ్డం వచ్చి ఆమె నిర్మల హృదయానికి మనిపూసి గాయం చేస్తుంది. సరళ ఆయిల్లు, తనలక్ష్యం కోసం విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. కుమార్ ఇంటికి వచ్చి సరళ నిష్క్రమించిన సంగతివిని నిరాశపడి బ్రహ్మచారిగా ఉండిపోవటానికి నిశ్చయించుకుంటాడు. చెల్లెలికి స్నేహితుడికి పెళ్ళి జరిపిస్తాడు. సరళ నాటకాలలో వేషాలు వేసి పట్టుదలతో కృషి చేసి కుమార్ తల్లికి కావలసిఅంతస్తుతో తిరిగివస్తుంది. కానికుమార్ మద్రాసు వెళ్ళినట్లు తెలుసుకుని, మదరాసులో నాటకాలాడుతూ అతని జాడ వెతికిస్తుంది. ఆ నాటకాల కంపెనీ యజమాని (రాజనాల) సరళ అనురాగం అర్థించి దాదాపు అరడజను సార్లు ఫలుడై చిట్టచివరికి కథను దుఃఖాంతం చేసేందుకు చేతనయిన పని చేస్తాడు. కుమార్ చూస్తుండగా 'ఇదే నీ పెళ్ళి కానుక' అంటూ సరళని రివాల్వర్‌తో పేలుస్తాడు. తనను తను చంపుకుంటాడు.

ఆస్పత్రిలో చికిత్స జరిగినతర్వాత కుమార్ అభీష్టం ప్రకారం సరళకూ కుమార్‌కూ వివాహం జరుగుతుంది. హైంప్రకారం ఇంజక్షన్ ఇస్తూ జీవాలు నిలబెడుతున్న డాక్టర్ వివాహ తతంగం నిముషాలలో ముగించమంటారు. కాని తతంగానికి బదులు పెండ్లి పీటలమీదే సరళ గతప్రాణి అవుతుంది. ఆనందంతో, తృప్తితో కన్ను మూస్తుంది సరళ.

ఈ కన్నీటిగాథ, కథాసంవిధానాన్ని బట్టి ఎందుకు దుఃఖాంతం కావాలో బోధపడదు. సరళ ప్రాణం ఎందుకు బలిచేసినట్లు? అందుకుతగిన కారణాలుగాని, సాంఘిక సమస్యలుగాని కనిపించవు. కేవలం కాములోలుడైన నాటకాలరాయుడి పగకు ఆమెను బలిచేసి, తద్వారా అంతస్తులు అడ్డంవచ్చి ఆమె ప్రాణదానం చేసిందని నిరూపించే యత్నం జరిగింది.

కరుణరసం పోషించే రూపహావభావాలు గల దేవిక సరళగా సహజంగా నటించింది. పల్లెటూరి చిలిపి పిల్లగా రాజశ్రీ, కథానాయకుడుగా కాంతారావు, అతని నేస్తంగా రామకృష్ణ చక్కగా రాణించారు. మితిమించని హాస్యం బాలకృష్ణ, రామకోటి బాగా పోషించారు.

ఆత్రేయ మాటలు అడుగడుగునా చాలా రసపట్టుగా ఉన్నాయి. 'అనగనగా ఒక పిలగాడు' పాట చాలా బాగుంది. రాజనాల, పేకేటి, హేమలత, బుష్యేంద్రమణి, కమలకుమారి వగైరాలు కూడా నటించిన ఈ చిత్రానికి శ్రీ బి. యస్. నారాయణ దర్శకత్వం, శ్రీ కె. వి. మహదేవన్ సంగీత దర్శకత్వం వహించారు ★



మంజీరా ఫిలిమ్స్ "చివరకు మిగిలేది"లో సావిత్రి, కాంతారావు.

విద్యావ్యాప్తికి వినోదానికి బ్రిటన్‌లో డాక్యుమెంటరీలు

డాక్యుమెంటరీల లక్ష్యమేమిటి? సంగతి సందర్భాలను ప్రజలకు విశదం చేయడం కావచ్చు. ఒక సంస్థ గౌరవ ప్రతిష్ఠలను సంపాదించడం కావచ్చు. ఓ వాణిజ్య సంస్థ తయారుచేసే సరుకు అమ్మకాలను ఎక్కువచేసే ప్రచారానికని డాక్యుమెంటరీని తయారు చేయించవచ్చు. వాస్తవాలను మాత్రమే చూపించుతారు డాక్యుమెంటరీలలో. కల్పనలుండవు. కొంత వినోదం ఉండవచ్చు. ఏమైనా ఇదివరకన్నడూ ఎరుగనంత ఎక్కువగా బ్రిటన్‌లో యీనాడు డాక్యుమెంటరీలు తయారవుతున్నవి. పదిసంవత్సరాల నాటికంటే ఎక్కువమంది ఇప్పుడు డాక్యుమెంటరీలను చూస్తున్నారనడంలో సందేహం లేదు.

ఎటువంటి ప్రేక్షకులకు చూపించవలసినదీ చాలా బాగా ఆలోచించి డాక్యుమెంటరీని తయారు చెయ్యాలి. టెలివిజన్‌లోనూ, సినిమా ప్రదర్శనశాలల్లోనూ ప్రదర్శించదలచే డాక్యుమెంటరీ ఉత్తమ కళాప్రమాణాలను అంగుళో కలిగినదై ఉండాలి. అటువంటి చిత్రాలను మాత్రమే వ్యాపారస్థులు ప్రదర్శించుతారు. ప్రభుత్వం, లేదా ప్రభుత్వ సంస్థ ఒక పరిశ్రమ వంటిని ఖర్చంతా భరించినా నగ్న ప్రచారానికి డాక్యుమెంటరీలలో అవకాశమివ్వరాదు. ఒక వాణిజ్య సంస్థ తయారుచేసిన ఒకానొక సరుకు అమ్మకాన్ని ఎక్కువచెయ్యడానికని తయారుచేసే డాక్యుమెంటరీని కొంతమంది ప్రేక్షకులు మాత్రమే చూస్తారు. ఇటువంటివాటికి డిస్ట్రిబ్యూటర్లు లభించే అవకాశం తక్కువ.

రెండవ ప్రపంచయుద్ధానికిపూర్వం డాక్యుమెంటరీ చిత్రాలను తయారు చేయడంలో జనరల్ పోస్టాఫీస్ మంచిపేరు సంపాదించినది. క్రేన్ ఫిలిమ్ యూనిట్ తయారుచేసిన డాక్యుమెంటరీలవల్ల డాక్యుమెంటరీల నిర్మాణంలో బ్రిటన్‌కు ప్రపంచంలో గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చినవి.

ఈనాడు బ్రిటన్‌లో తయారుచేసే డాక్యుమెంటరీలలో అధికభాగం యేదో ఒక ప్రత్యేకోద్దేశంతో కొంతమందికోసమని తయారుచేసేవే. అంటే మామూలు ప్రదర్శనశాలల్లో అందరికీ చూపించేవికావు.

సినిమా చూపించే సొంత యంత్రాలున్న క్లబ్‌లూ, పాఠశాలలూ, మహిళాసంఘాలూ, యువజన కేంద్రాలూ డాక్యుమెంటరీలను తెప్పించుకుని ప్రదర్శించుతూంటవి. పరిశ్రమలలో కొన్ని డాక్యుమెంటరీలను చూపిస్తూంటారు.

డాక్యుమెంటరీ నిర్మాతలందరినీ సమైక్యం చేసే ప్రత్యేక సినిమా నిర్మాతల సంఘం ఉన్నది బ్రిటన్‌లో. డాక్యుమెంటరీల నిర్మాణానికి సంబంధించిన బేరసారాలను ఈ సంఘం కుదుర్చుతుంది. డాక్యుమెంటరీ పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగపడే చర్చలను ఏర్పాటుచేస్తుంది. అంతర్జాతీయ ఫిలిమ్ ఉత్సవాలకు బ్రిటిష్ డాక్యుమెంటరీలను పంపించుతూంటుంది ఈ సంఘం.

పరిశ్రమల యజమానులే తీయించినా, ప్రభుత్వమే ఖర్చంతా భరించి తయారు చేయించినా, వారి లక్ష్యాలు డాక్యుమెంటరీలో అంత ప్రత్యక్షంగా కనిపించవు. నిర్మాణానికి కావలసిన డబ్బంతా ఇచ్చి నిర్మాణంలో నిర్మాతలకు స్వేచ్ఛ ఇచ్చేవారు కూడా ఉంటారు

పైన నిర్వచించిన రెండు రకాల డాక్యు



ఇటీవల మద్రాస్ మ్యూజియం థియేటర్‌లో కూచిపూడి కళాకారులు ప్రదర్శించిన 'భామా కలాపం'లో శృంగార ఘట్టం.



బాలాముకీస్ వారి తమిళ చిత్రం "పడికాదమేధై" ఇటీవల చెన్నపురిలో ఉడ్‌లాండ్స్ హోటల్‌లో 111వ దినోత్సవం జరుపుతున్నప్పుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నార్ అధ్యక్షత వహించారు. శాసన పరిషత్తు అధ్యక్షుడు డా॥. యు. కృష్ణారావు బహుమతులు పంచిపెట్టారు. (శ్రీమతి జానకి చిత్రంలో నాయికపాత్ర ధారణి) షీల్డ్ స్వీకరిస్తున్నారు.

డాక్యుమెంటరీలు

మెంటరీలూ విరివిగా అంతర్జాతీయ ప్రదర్శనలకు వెళుతున్నవి. ఈ ప్రదర్శనలలో చాలా భాగం యూరప్‌లోనే జరుగుతున్నవి. బ్రిటన్‌లో జరిగే డాక్యుమెంటరీ ప్రదర్శనోత్సవాలన్నింటిలో ఎక్కువ పేరెన్నికగన్నది ఎడింబరో ఉత్సవం. స్కాట్లెండ్ రాజధాని ఎడింబరోలో అగస్టు ఆఖరునుంచి సెప్టెంబరు ప్రారంభం దాకా జరిగే సినిమా ప్రదర్శనోత్సవాలలో భాగంగా డాక్యుమెంటరీల ప్రదర్శనం కూడా జరుగుతూంటుంది. పోటీలో ఉత్తమచిత్రాలకు బహుమతులూ, ధృవపత్రాలూ ఇస్తారు.

హారోగేట్ ఉత్సవాలుకూడా ప్రశంసించతగినవే.

—జాన్ వాల్టన్.

వార్తాభరణం

(55-వ పేజీ తరువాయి)

పేరుగల ఇతను "మామకు తగ్గ అల్లుడు"లో ఒక రాక్ ఎన్ రోల్ పాట ఇటీవల పాడారు.

పరిక్షిత్తి కథావస్తువు, కథన సంవిధానం సంతరించుకున్నట్లు చెప్పబడుతున్న మంజీరా ఫిలింసువారి 'చివరకు మిగిలేది' నవంబర్‌లో విడుదలకు సిద్ధంగావుంది. రామినీడు దర్శకత్వంలో సావిత్రి, బాలయ్య, కాంతారావు, రమణారెడ్డి, సూర్యకాంతం, డా॥ ప్రభాకరరెడ్డి, హరనాథ్ నటిస్తున్నారు.

* * *

ఆంధ్రా ఫిలింస్‌వారి అనువాద చిత్రం 'మనసిచ్చిన మగువ'లో సావిత్రి, హేమలత, సూర్యకాంతం, కమలా లక్ష్మణ్, ఎస్. వి. రంగారావు, నాగయ్య, గోపీకృష్ణ నటించారు. రచన శ్రీ శ్రీ, నవంబర్‌లో విడుదల.

* * *

సావిత్రి, బాలయ్య, జగ్గయ్య, రేలంగి, ఎం. సరోజ, డెయిసీ ఇరానీ నటిస్తున్న భారతీ వారి 'కుంకుమ రేఖ' నవంబర్ రెండవ వారంలో విడుదలకానున్నది. శాపీ చాణక్య దర్శకుడు.

* * *

మద్గూల్‌కర్ మరాఠీ కథ ఆధారంగా నవశక్తివారు నిర్మిస్తున్న చిత్రంలో నాగేశ్వరరావు, కృష్ణకుమారి, మాలతి, సుమ్రడి, లంక సత్యం, రమణారెడ్డి, సురభి బాలసరస్వతి, నటిస్తున్నారు. దర్శకుడు రామినీడు, సంగీతం అశ్వత్థామ, రచన గోపీచంద్. ★



"పడికాదమేధై" 111 వ దినోత్సవంలో షీల్డ్‌ను స్వీకరిస్తున్న నటుడు శ్రీ ఎస్. వి. రంగారావు.

రాక్షసంచేత అలా అన్నా...క్షమించాలి.." అని ప్రాధేయపడ్డాను...

"అంత కొంప మునిగిపోతూంటే ఇరుగునో పొరుగునో కొంచెం కనిపెడుతూండమని చెప్పి రాలేకపోయావ్...... అసలు నీకు జ్ఞానంలేదోయ్..." అంటూండగానే పిచ్చేశ్వరరావ్ తారాజువ్వలా దూసుకు వచ్చాడు లోపలకు.

"అయ్యగారూ! అమ్మగారు జీప్‌లో వచ్చేరు...తమర్ని అరుజంటుగా బయటకు రమ్మంటున్నారు..." అన్నాడు.

"ఏమోయ్ కుచేలావ్...అర్జంటు బిజినెస్ మీద వస్తున్నాను...ఎర్లీ మార్నింగునే ఆకౌంట్‌లు తీసుకొని రావాలిసుమా... రాత్రల్లా కూచునిఅయినా పూర్తిచేసుకు రావాలి..." అంటూ నాకు ఓ వార్నింగు ఇచ్చి వెళ్ళిపోయ్యారు...

శ్రీవారు అలా వెళ్ళగానే నేనిలా ఇంటిముఖం పట్టేను.

ఇంటికెళ్ళేసరికి శ్రీమతి కోరాలు మురియాలు తెగ నూరుతూంది... అగ్నిహోత్ర దండకం ప్రారంభించింది.

"ఏంఇంత పెందరాళే వచ్చారుగారు...చిట్టా ఆవర్జాలు చొక్కా పంచ పట్టుకొని వదలలేదు గామాలు పాపం!...మిమ్మల్ని అనవలసిన పనిలేదు...ఇంకో గతిలేక ఆఫీసులో అఘోరిస్తూన్న ఆ ఆఫీసరుయముణ్ణి అనాలి. ఆఫీసుకెడితేచాలు ఘల్లాకంలా పట్టేసి పిప్పిచేస్తున్నాడు... ఆముండాకొడుకు..." అని మెటికలు ఫెళఫెళ విరిచేసి ఇంకా తిట్టబోతూండగా నాకుకోపం నఖశిఖ పర్యంతం వ్యాపించింది...

"ఇదుగో నన్నంటే నాకిష్టమేగాని మా ఆఫీసరుగార్ని అన్నావంటే బాగోదు... శ్రీవారు మన శ్రేయస్సు సర్వదా కాంక్షించే ప్రత్యక్ష దైవ స్వరూపులు...రాబోయే మన ప్రమోషనుకి ఇవన్నీ పరీక్షలే! అగ్ని పరీక్షలు!! ఇవి కాస్త నిభాయించుకున్నామంటే మనంకోటలో పాగా వేసినట్టేనే పిచ్చిదానా! ఇహ ఒక్క అక్షరం అయినా శ్రీవారిని అన్నావా మనిద్దరికీ చెడుతుంది జాగ్రత!...అని హెచ్చరించాను ఆవేశ పూరితంగా. మాఆవిడ ఆగ్రహం నా ఆవేశం రెండూ బ్రహ్మాస్త్రాల్లా ఢీకొని రాపాడి, పోట్లాడుతూంటే "వహవ్వా, వహవ్వా" అంటూ మా కుర్రకుంకలు చప్పట్లుకొడుతూ "అమ్మ గెలుస్తుందో నాన్న గెలుస్తాడో" చూడా లంటున్నారు.

"ఇహ చాలెండి...చాలా గొప్పవారే..." అంది విసురుగా.

"చాలా? అయితేసరే..."అనేసి సెకిలుకున్న శిల్పపర్వత శ్రేణుల్ని ముడివిప్పి లోపలపెట్టేను.

"వధవల్లారా నడవండర్రా" అంటూ కుర్రాళ్ళను బయటకునెట్టి, నాకేసి చూసి

శ్రీమతి-శ్రీవారు

(12-వ పేజీ తరువాయి)

"రిక్షాలు తీసుకురండీ...పదండి..." అని నన్ను పంపింది...

రిక్షాలమీద హాలుదగ్గర కెళ్ళాం...టిక్కట్లడుగుతే అయిపోయేయ్ అన్నారు. కావాలంటే రిజర్వ్‌టిక్కట్లు ఉన్నాయిట.

"విన్నావా? ... నాదగ్గర ఇంతకన్నా లేదు..." అన్నాను మా శ్రీమతితో.

"ఎంత కావాలి..." అంది చురుగ్గా.

"ఓ రెండియ్యి..." అన్నా అవకాశం వినియోగించుకుంటూ—చకచకా రుమాలిప్పి విచ్చురూపాయలు రెండు ఇచ్చింది.

టిక్కట్లుకొని హాలులోకి వెళ్ళేసరికి ఆట ప్రారంభమయి అయిదు నిముషాలు దాటింది.

"మీ నుంచే లేటు అయింది..." అంది విసుగుతో.

"నానుంచేమిటే దౌర్భాగ్యులారా! ఎదురుగా కొండంత ఆఫీసరుంటే వదిలేసి ఎలా వచ్చేయటం..." అనేసి ఒళ్ళో ఎగురుతున్న మా కుర్రవెధవ నెత్తిని ఒక్కదెబ్బ కొట్టి అణిమిపట్టి కూచున్నా.

"రేపటినుంచి సెలవు పెట్టండి...రోగం కుదురుతుంది..." అంది కోపంగా.

"ఎవరి రోగమే?..." అంటూండగా "మాష్టారూ! కొంచెం మాట్లాడ్డం మానేస్తారూ!..." అన్నాడు ప్రక్కయన చిరాకుగా.

మా శ్రీమతి మరేం మాటాడలేదు.

*　　*　　*

ఇంటర్‌వెల్‌లో లైట్లన్నీ ఒక్కమాటు వెలిగాయి. వెనకవాళ్ళు, ముందువాళ్ళని, ముందువాళ్ళు వెనకవారిని చూసుకుంటున్నారు.

ప్రేమపక్షులు కిచకిచలాడుతున్నాయి... డ్రింకులు తాగుతున్నాయి...

నాకళ్ళు సెర్చిలైటులా ఆ హాలంతా గాలించసాగేయి.. మా వెనక కుర్చీల్లో సతీసమేతంగా కూచుని చిప్సు తింటూన్న మా ఆఫీసరుగారు, మా ముందుకుర్చీల్లో భార్యాసమేతంగా కూచుని పకోడీలు నములుతూన్న పిచ్చేశ్వరరావ్ హఠాత్తుగా నాకంటబడ్డారు—అప్రయత్నంగా శ్రీవారి దృష్టి మా కుటుంబంపై పడ్డది—పడక ఏం చేస్తుంది...గోచార రీత్యా జన్మలో శని, అష్టమంలో గురుడు ఉన్నారు.

నాకు ముచ్చెమటలు పోసినాయి...

"ఏమేయ్, అనుకున్నంతపని అయింది... అయ్యన వెనకనుంచి చూస్తున్నాడే...అన్నా గాభరాగా.

చూస్తే చూడనీయండి. కొరుక్కు తినలేదు...కళ్ళు నొప్పిపుట్టె వాడంతట వాడే చూట్టం మానేస్తాడు. అయినా ఈ చూడ్డం రోగం చిన్నా పెద్దకు అంటువ్యాధి అయిపోయింది. ఇంతకూ వాడెవడు?..." అంది దర్జాగా.

"ఆయనే నే!...మా ఆయనే!! మా దొరగారే!!! వెనకనుంచి మన సకుటుంబాన్ని చూస్తున్నారే..." అన్నా కంపితస్వరంతో.

"మా నేస్తే చూడనీయండి...సినిమాకు వెళ్ళడానికి వాడికేం హక్కుంది"......?

"నేను ట్వెంటీఫోర్ అవర్సు సర్వెంటుని...నా మీద వారికి సంపూర్ణ గుత్తాధికారం వుందే వెర్రిమొగమా!...నీకు జ్వరం అని అబద్ధం ఆడేను. అర్జంటు రిటర్న్ తయారుచేయమంటే అలాగేనని ఆయనకు తెలియకుండా ఇలా వచ్చేశా ... ఒకటికి రెండు తప్పులు—శ్రీవారు దండన విధించడంలో యమధర్మరాజు అడుగుజాడల్లో నడుస్తారే! నీకేంఇంట్లో గువ్వపిట్టలా కూచుంటావ్!" అనేసి హడలి ఛస్తున్నా...

"ఆడదానిలా అలా భయపడతారేం... ఆ విషయాలన్నీ ఓ క్షణం మరచిపోండి... ఆ నాయుడుగారి 'ప్రక్కనవిలబడి' రికార్డు ఎంత కమ్మగా, తియ్యగా ఉందో వింటున్నారా..." అంటూ తన్మయత్వంలో వుండిపోయింది మా శ్రీమతి—

మా శ్రీవారి విశ్వరూప సందర్శనంలో లీనమైపోయిన నాకు ఏం అనాలో తోచలేదు. ★



26-10-60 బుధవారం మొదలు
1-11-60 మంగళవారం వరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

మీ ఆలోచనలు చాలావరకు కార్యరూపంలోకి వస్తవి. ఇతరులతో పోటీ కనిపిస్తున్నా ధైర్యంతో ఎదుర్కొనగలుగుతారు. ప్రయాణ కార్యక్రమాలు శ్రమగా తోచినా కార్యసిద్ధి, ధనలాభము ఉంటవి. ఉన్నతస్థితిలో ఉన్నటువంటివారితో పరిచయం లభిస్తుంది. పడమరదిక్కు నుంచి లాభవార్తలు తెలుస్తవి. కొన్ని సమయాలలో ఇతరుల మోసపుమాటలను నమ్మి విరోధాలు తెచ్చుకోవలసి వస్తుంది. కుటుంబ విషయాలలో సుఖశాంతులు లభిస్తవి. ఖర్చులు మాత్రం విపరీతంగా తోచవచ్చు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికరమైన మార్గాలు, క్రొత్తదనము కనుపిస్తవి. 26, 27 లలో అకస్మాద్ధనలాభం, విలువగల వస్తువులు కొనటం—

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఈ సమయంలో మీ ధైర్యాన్ని క్రుంగదీసే సంఘటనలు జరిగే సూచనలున్నవి. అయితే ఆప్తమిత్రుని సలహాతో ముందుగా జాగ్రత్త పడగలుగుతారు. ఆదాయం పెరుగుతుంది. సంఘంలో మీ మాటకు విలువ లభిస్తుంది. క్రొత్తగా ధనం పెట్టుబడిపెట్టి చేయతగిన పనులనుగురించి ఆలోచనలు వస్తవి. బంధుమిత్రులకు సహాయం చేయగలుగుతారు. క్రొత్తవారితో లావాదేవీలు జరపటంలో జాగ్రత్త అవసరం. కలహప్రసంగాలు రాగల అవకాశాలున్నవి. ప్రతి విషయంలోను రహస్యం అవసరం. కుటుంబంలోనివారి అనారోగ్యంవల్ల మీ కార్యక్రమాలలో చురుకుదనం తగ్గుతుంది. 28, 29 లలో ధర్మకార్యాలు, శుభవార్తలు, పొరపాటువల్ల నష్టం.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఏ పని చేస్తున్నా మీ మనస్సుకు నిలకడ మాత్రం ఉండదు. అన్ని సౌకర్యాలు ఉండి కూడా సమయంలో ఉపయోగించుకోనే వీలుమాత్రం ఉండదు. గతానికంటె ఆదాయం పెరుగుతుంది. ఇష్టంలేకపోయినా రాజీమార్గం అనుసరించవలసివస్తుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. సమయానికి తగినట్లు మాట్లాడి అపవాదులు రాకుండా తప్పించుకోగలుగుతారు. ఆహార విహారాలలో జాగ్రత్తగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోనండి. వారాంతంలో మిమ్ములను అనుసరించుకుని ఉన్న మనుష్యులు వ్యతిరేకానికి వస్తారు. 30, 31 లలో విలాస సంబంధమైన ఖర్చులు, త్రిప్పట, వ్యవహారరంగంలో పొరపాట్లు.

గ్రహస్థితి

మిథునంలో అంగారకుడు, సింహంలో రాహువు, తులలో సూర్యుడు, వృశ్చిక తులలలో బుధుడు వక్రం, వృశ్చికంలో శుక్రుడు, ధనుస్సులో గురు శనులు, కుంభంలో కేతువు, ధనుర్మకర కుంభ మీనాలలో చంద్రుడు.

---

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష)

* * *

మీ ప్రయత్నానికి దైవబలం కలిసి వస్తుంది. ఎదురుచూస్తున్న వార్తలు ఆలస్యంగా వచ్చినా అనుకూలంగా ఉంటవి. బంధుమిత్రులు మీమాటను అనుసరిస్తారు. ఆస్తితోపాటు ఖర్చులుకూడా పెరుగుతవి. మీ వృద్ధిని, సమర్థతను చూచి సహించలేనివారు అపవాదులను ప్రచారంచేస్తారు. అధికారులకు వ్రాశేఉ తీరాలలో పొరపాట్లు రాకుండా చూచుకోనండి. వృత్తిఉద్యోగాలలో ఎదటివారిని ఆకర్షించి కార్యంసాధించుకోగలుగుతారు. పిల్లల ఆరోగ్యం బాగుండదు. ఉత్తరదిక్కునుంచి అనుకూలవార్తలు తెలుస్తవి. ఇతరులస్తోత్ర ప్రసంగాలు మిమ్ములను కష్టనష్టాలకు దించవచ్చు. జాగ్రత్త. 27, 28 లలో సంఘకార్యాలు వ్యవహార అనుకూలత.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఒకప్రక్క ఇతరులవల్ల ప్రతిబంధకాలు కనుపిస్తున్నా చాకచక్యంతో ముందుకు పోగలుగుతారు. అధికారులవల్ల అనుకూలత లభిస్తుంది. కుటుంబంలో ఇంతకుముందున్నటువంటి చిక్కులు అశాంతితొలగి మీ పనులకు ఒకమార్గం లభిస్తుంది. వ్యవహారరంగంలో ప్రతిబంధకాలు తొలగిపోతవి. విలువగల వస్తువులుకొంటారు. ఇతరులవద్ద నుంచి రావలసిన ధనం సకాలంలో లభిస్తుంది. లోగడచేసిన ఖర్చులవల్ల ఈ సమయంలో పశ్చాత్తాపపడవలసి వస్తుంది. ప్రయాణాలు అనుకున్నప్రకారం సాగకపోవచ్చు. వారాంతంలో మిత్రులఎడబాటు కలుగుతుంది. 29, 30 లలో స్వల్పవిషయాలలో పట్టుదలలు, మనోవ్యథ, సంచారం.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

భారమైనపనులు పైనపెట్టుకొని క్రమక్రమంగా పట్టుదలతో సాధించగలుగుతారు. మనోధైర్యం పెరుగుతుంది. ఆదాయంకూడా పెరుగుతుంది. అనేకమందితో పరిచయం లభిస్తుంది. అయితే అంతమాత్రం చేత సహాయం చేస్తారనుకోవద్దు. ధర్మకార్యాలు నెరవేరుతవి. సమయానుకూలంగా కొంతమంది మిత్రులతో సంబంధం తగ్గించుకోవలసి వస్తుంది. నౌకర్లు మొదలయినవారి సహాయంతో ఆరంభించిన పనులు సకాలంలో నెరవేర్చగలుగుతారు. పిల్లలమూలంగాసుఖసంతోషాలు లభిస్తవి. 31, 1 తేదులలో వ్యవహారజయం, స్థిరాస్తులు కొనేప్రయత్నాలు సంఘంలో గౌరవప్రాప్తి.

తులం :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఈ సమయంలో ప్రతిపనీ శ్రమగా తోస్తుంది. మీరు అనుకున్నంత ఫలితం పొందలేకపోతారు. ఎదటివారు మిమ్మల్ని మాటలతో సంతోషపెట్టి పనులు సాధించుకొనటానికి చూస్తారు. ఆరోగ్యం లోపించటంవల్ల మీ స్వకీయకార్యకలాపాలలో నిదానం కనుపిస్తుంది. దైవానుగ్రహంవల్ల ఇతరులవల్ల మాట రాకుండా చూచుకోగలుగుతారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతవి. కోర్టు కచేరీలలో అనుకూలమైన సమయం. నౌకరులు మొదలయినవారితో కలహాలు రాగల సూచనలున్నవి. డబ్బుగాని, విలువగల వస్తువులుగాని నష్టపోయే అవకాశాలున్నవి. ఇతరులతో ప్రసంగాలు తగ్గించుకొనటం అవసరం. 28, 29 లలో వృధా శ్రమ, ధనవంతులతో కలహాలు, పనులలో పొరపాట్లు—

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

చేసినపనినే చేయవలసి వస్తుండటంవల్ల విసుగు ఎక్కువ అవుతుంది. ఇతరుల బలవంతంవల్ల కార్యభారం పెట్టుకుని విషయాలు భరించవలసి వస్తుంది. ఏ సందర్భంలో ఏ పొరపాటు వస్తుందోనన్న ఆందోళన అధికమవుతుంది. ఆదాయంతోబాటు ఖర్చులు కూడా కనుపిస్తవి. అయితే మానసికంగా సంతృప్తి తగ్గుతుంది. మీరు న్యాయం మాట్లాడినా ఇతరుల దృష్టిలో తప్పుగా తోచగల సూచనలున్నవి. ధనవంతులతో స్నేహం లభిస్తుంది. అయితే పనులుమాత్రం చురుకుగా జరుగవు. విష్ణుసహస్రనామ పారాయణం చేసుకొనటంవల్ల మనోధైర్యం లభిస్తుంది. మీ సమస్యలు సులభంగా పరిష్కారం కాగలవు. 30, 31 తేదీలలో లాభదాయకమైన పనులు, ఇష్టవస్తుప్రాప్తి.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ప్రథమ పాదం)

అన్నిరంగాలలోను విజయం పొందగల సమయం. ధైర్యసాహసాలు బాగా ఉపయోగిస్తవి. బంధువులవల్ల అనుకూలత కనుపిస్తుంది. లోగడ మీరు ఇతరులకు చెప్పిన మాటను పాలించుకోగలుగుతారు. ఖర్చులు మాత్రం కొంచెం అధికంగా తోచవచ్చు. ఇతరులతో కలిసి చేయుపనులలో సంతృప్తికరమైన ఫలితం పొందగలుగుతారు. మీ మిత్రులు తమలో తాము కలహించుకుని మీ మీద విరుచుకొనటం జరుగవచ్చు. నిదానంగా యథార్థం తెలుసుకొనగలుగుతారు. పిల్లల ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండటం అవసరం. ప్రయాణాలు వాయిదా వేసుకొనటం అవసరం. 26, 27 లలో శుభవార్తలు, కొత్తవారితో పరిచయం, దండుగ ఖర్చులు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

సందేహాలు రావటంవల్ల పనులకు ఆటంకాలు వస్తూఉంటవి. తీరా ఆలోచిస్తే కారణంమాత్రం ఏమీ ఉండదు. ప్రతి పనిలో కొంత బాధ్యతను వహించి ముందుకుపోతూ ఉండటం అవసరం. ఉత్తరప్రత్యుత్తరాలు వ్రాయటంలో నేర్పు, ధైర్యము, ముఖ్యం. క్రమక్రమంగా ఆదాయం పెరుగుతుంది. మీ ఆరోగ్యం ఇంతకుముందుకన్నా మేలుగా ఉంటుంది. ఉత్తర, పశ్చిమ దిక్కులనుంచి ధనలాభము, ప్రోత్సాహము లభిస్తవి. సంఘంలో అంతస్తును కాపాడుకొనేనిమిత్తం ఖర్చులు పెరిగే అవకాశాలున్నవి. ఋణబాధలు చాలావరకు తీరిపోతవి. వృత్తిఉద్యోగాలలో అభివృద్ధి కనుపిస్తుంది. బంధువులవల్ల కార్యసిద్ధి ఉంటుంది. 29, 30 లలో ప్రయాణాలు, వినోద సంబంధమైన ఖర్చులు, కలహాలు.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

సంఘంలో స్థానం లభిస్తుంది. లోగడ కనుపిస్తున్న పోటీ తొలగిపోయి సుఖము శాంతి లభిస్తవి. విలువగల వస్తువులు కొంటారు. వృత్తి ఉద్యోగాలలో క్రమమైన మార్పులు, అభివృద్ధి కనుపిస్తవి. ఇతరులకు ఇచ్చిన వాగ్దానాన్ని పాలించుకుని గౌరవం దక్కించుకోగలుగుతారు. సులభంగా నెరవేరగలవనుకున్న పనులు విపరీతమైన ఖర్చులకు దారితీస్తవి. కుటుంబంలో మీ ఆలోచనలకు వ్యతిరేకతను తెలిపేవారుండటంవల్ల ఉత్సాహం లోపిస్తుంది. దూరమందున్న బంధుమిత్రులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. స్నేహితులకు సహాయం చేయవలసిన అవసరం కలుగుతుంది. 31, 1 తేదీలలో వ్యవహార విజయం. సాహస కార్యములయందు కోరిక, శ్రమ.

* * *

—ఈవారపు ధరలు—

బంగారు ధర 27, 28 తేదులలో తేజీ సూచన లున్నవి. వెండి ధర 29, 30 లలో పెరుగుతుంది. కాని మరల తగ్గుతుంది. పసుపుధర కొద్దిగా పెరిగి తగ్గుతుంది.

చింతపండు ధర కొద్దిగా తగ్గి వారాంతంలో పెరుగుతుంది. వేరుశనగ పప్పు ధర పెరుగుతుంది. నూనె ధర నిలకడలో ఉంటుంది. నువ్వుల నూనె ధర పెరుగుదలలో ఉంటుంది. గోధుమలకు మందీ కనుపిస్తుంది. శనగలధర గతవారంలో వలె నిలుస్తుంది. కాని 28, 29 లలో స్వల్పంగా తేజీ వస్తుంది. మినుముల ధర విశేషంగా పెరగవచ్చు.

మీనం:

(పూర్వా భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

నిబ్బరంతో అన్నిపనులు సాధించగలుగుతారు. దైవికంగా అటువంటి అవకాశం లభిస్తుంది. విలువగల వస్తువులు కొంటారు. మాటనేర్పుతో ఇతరులను ఆకర్షించగలుగుతారు. మీకు సంబంధంలేని పనులవల్ల కొంత శ్రమ కనుపించినా ఫలితం బాగుంటుంది. ఒకటి రెండు సందర్భాలలో చిక్కులను ఎదుర్కోవలసివస్తుంది. బుద్ధిబలంతో సులభంగా పరిష్కరించగలుగుతారు. వృత్తిలో అభివృద్ధి బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తవి. వారం రెండవ భాగంలో వాహనాలు ఎక్కటం, ఆయుధాలు ఉపయోగించటం మొదలయిన సందర్భాలలో జాగ్రత్తగా ఉండండి. 26, 27 లలో పెద్దలతో మైత్రి పనులలో ఆటంకాలు, శ్రమతో కూడిన ఆదాయం. ★

న్యూఢిల్లీ లేఖ

(15-వ పేజీ తరువాయి)

దులో చరిత్ర పునరావృత్తం అవుతోంది. మతోన్మాదులైన ముస్లింలు ఎంతగా కవ్వించినా, వారితో కాంగ్రెసు నిష్కర్షగా వ్యవహరించలేకపోవడానికి కాశ్మీరు సమస్యే కారణం. అలీఘర్ విశ్వవిద్యాలయం వ్యవహారాలను సైతం సవ్యంగా పరిష్కరించడానికి వీలు కావటంలేదు. కాశ్మీర్ సమస్య పరిష్కారంకోసం పాకిస్తాన్ 13 సంవత్సరాలనుంచి వేచి ఉన్నది. భారతప్రభుత్వం కాశ్మీర్‌లో వెదజల్లుతున్న ధనం తన బాగుకే వినియోగపడగలదనే విశ్వాసంతో పాకిస్తాన్ మరి కొన్ని సంవత్సరాలు ఓపిక పట్టవచ్చు.

అసలు ఈ సమస్యనే ఉభయదేశాల ప్రజలు విస్మరించారని ప్రధాన మంత్రి అన్న మాట కచ్చితంగా నిజం. "రాజకీయ స్థాయిలో మాత్రమే ఈ సమస్య తల ఎత్తుతోంది" అనికూడా ఆయన అన్నారు. ఒక్కసారి భారతదేశాన్ని కలయ చూచినట్లయితే, ఇంగ్లీషు స్థానంలో హిందీని ప్రవేశపెట్టే విషయమై ప్రజాబాహుళ్యం నిజంగా ఆసక్తి చూపుతోందా? అనే అనుమానం కలుగుతుంది. కేవలం రాజకీయ స్థాయిలోమాత్రమే ఈ సమస్య కనిపిస్తోంది. ప్రజలు అణు విద్యుచ్ఛక్తి కేంద్రాల నిర్మాణంపట్ల ఎంత నిర్లిప్తంగా ఉన్నారో దేశ విభజనపట్ల, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణపట్ల కూడా అంతే నిర్లిప్తంగా ఉన్నారు. నాగరకత ప్రారంభమైనది లగాయతూ నేటివరకు రాజకీయవాదులు ప్రజలను మోసగిస్తూనే ఉన్నారు.

ప్రధానమంత్రి న్యూయార్క్‌లో చేసిన ప్రకటన కాశ్మీర్ సమస్య పరిష్కారానికి ఒకమార్గాన్ని సూచిస్తోంది. "యథాస్థితి"ని భంగపరచరాదని ఆయన అన్నారు. ఈ "యథాస్థితి"కి నిర్యుద్ధరేఖ ప్రాతిపదిక అని పాకిస్తాన్ వాదం. 13 సంవత్సరాలక్రితం ఒకానొకరోజున, భారత, పాకిస్తాన్ సాయుధ దళాలు ఒండొరులపై కాల్పులు జరుపుకోటం విరమించుకొని, అప్పటినుంచి ఆ నిర్యుద్ధరేఖ వద్ద గస్తీ తిరుగుతున్నారు. ఈ రేఖను ఉభయ దేశాలమధ్య సహజ సరిహద్దుగాని, రాజకీయ సరిహద్దుగాని పరిగణించే వీలులేదు. అందుచేత ఇంతకంటే సహేతుకమైన సరిహద్దును నిర్ణయించుకోటం అవసరం. దీని అర్థం కాశ్మీర్ సమస్యను తిరగతోడాలని కాదు. "యథాస్థితి"ని పునర్వ్యవస్థీకరించాలని మాత్రమే సూచిస్తున్నాను. ఇలాంటి సర్దుబాటువల్ల ఉభయదేశాల మధ్య శాంతి సద్భావాలు తిరిగి నెలకొంటే, నిర్యుద్ధరేఖవద్ద సాయుధ దళాల గస్తీకోసం ప్రస్తుతం ఖర్చు చేస్తున్న కోట్లకొలదీ ధనం ఆదా అవుతుంది. ప్రపంచ శాంతిసాధనకోసం న్యూయార్క్ నగరానికి వెళ్ళివచ్చిన ప్రధాన మంత్రి ఈ పనికి పూనుకోటం ఉచితం.

విదేశాలనుంచి వచ్చీ రాగానే శ్రీ నెహ్రూ మళ్లీ కొన్ని కొరకరాని సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది. తమ స్వరాష్ట్రంఅయిన ఉత్తర ప్రదేశ్‌లో, రాజ్యాంగరీత్యా క్లిష్టమైన పరిస్థితి నెలకొని ఉన్నది. అస్సాం వ్యవహారాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. గిరిజన ప్రాంతాల ప్రతినిధులు సంప్రదింపుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమకో రాష్ట్రం రూపొందించుకోవాలని వీరి నిశ్చితాభిప్రాయం. అస్సామీలు కూడా అంతే పట్టుదలతో ఉన్నారు. తమపై బెంగాలీలు పరిపాలన సాగించడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. కచార్ ప్రాంతాలు లేకపోయినా సరే, తమకో రాష్ట్రం కావాలని అంటున్నారు. ఆంధ్ర వ్యవహారాలు ఒకదరికి వచ్చాయి. ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల వ్యవహారాలు అట్లాగే ఉన్నాయి. పంజాబీసుబా, విదర్భ ఉద్యమాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి.

* * *

వ్యాపారరంగం మనుగడ, కేవలం తమ దయాధర్మాలపైనే ఆధారపడి ఉన్నదని గనులమంత్రి సర్దార్ స్వరణ్ సింగ్ అవకాశం చిక్కినప్పుడల్లా చెబుతున్నారు. పరిశ్రమల సలహామండలి క్రితంసారి సమావేశమైనప్పుడు ఆయన ఆమాటే మళ్లీ అన్నారు. దేశంలో బొగ్గుకొరత ఏర్పడి, ఉత్పత్తి దెబ్బ తినటమే కాక, ప్రభుత్వరంగంలోని బ్లాస్ట్ ఫర్నేస్‌లను పనిచేయించే కార్యక్రమాన్ని కూడా వాయిదా వేసుకోవలసివస్తోంది. టి. సి. ఎం. నిపుణులు సమర్పించిన నివేదికలను, బొగ్గుపరిశ్రమలో ప్రభుత్వరంగం ఎట్లా పని చేసిందీ వివరిస్తూ, బ్రిటిష్ నిపుణుడు సమర్పించిన నివేదికను, సర్దార్ స్వరణ్ సింగ్ చదివారో లేదో తెలియదు. బొగ్గు ఇంజనీర్లు, బొగ్గును త్రవ్వించడానికి బదులుగా ఇళ్లు కట్టిస్తున్నారని ఒక నివేదిక పేర్కొన్నట్లు అభిజ్ఞవర్గాలద్వారా తెలిసింది.

బొగ్గు కొరతపట్ల ప్రధానమంత్రి తీవ్రమైన ఆందోళన వెల్లడించారనీ, ఈ విషయమై దర్యాప్తు జరిపి, నివేదిక అందజేయుమని సీనియర్ కార్యదర్శులను ఆదేశించారనీ అందరికీ తెలిసినసంగతే.

సమష్టి బాధ్యతా సిద్ధాంతాన్ని అనుసరించి పని చేస్తున్న ప్రభుత్వంలో, బొగ్గు కొరత విషయమై బాధ్యత ఎవరిదనే అంశం మీద, బొగ్గు, రైల్వేశాఖలమధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం కొంతవరకు ఆందోళన కారి కాగలదు.

ప్రస్తుతం పనిచేస్తున్న ఉక్కు కర్మాగారాలకు కావలసిన బొగ్గును బెంగాల్, బీహార్ రాష్ట్రాలలోని గనులనుంచి సరఫరా చేయడానికి నిత్యం 1400 రైల్వేవాగన్లు కావలసివస్తాయి. ఇప్పుడు పని ప్రారంభించిన మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు, 1961 ఏప్రిల్‌లో పని ప్రారంభించనున్న నాలుగో ఫర్నేసును కలిపి, రోజుకు మరో 300 వాగన్ల బొగ్గు అవసరమవుతుంది.

ద్వితీయప్రణాళిక చివరి సంవత్సరంలో బొగ్గుపరిశ్రమ అవసరాల నిమిత్తం నిత్యం 4560 వాగన్లు కావలసిరాగా, రైల్వేశాఖ 3030 వాగన్లు సరఫరా చేసింది.


బొగ్గును వినియోగించునది ఉక్కు పరిశ్రమ ఒక్కటే కాదు. వస్త్రపరిశ్రమకు, సిమెంటు మొదలైన ఇతర పరిశ్రమలకుకూడా బొగ్గు అవసరం.

గనులశాఖ, రైల్వేశాఖకూడా తమ సంక్షేమం దేశ సంక్షేమంకంటే ఎక్కువని నిరూపించాయి. ఈ సందర్భంలో ప్రధానమంత్రి వెంటనే తగుచర్యలు తీసుకుంటారు. అన్ని విషయాలు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసినవారు ఆయనకు వివరాలు అందజేశారు. ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

గళ్ల నుడికట్టు-24

ఆధారాలు



నిలువు :

1. రాముడిదారి.
3. ...కడివెడైననేమి ఖరముపాలు...
5. మాట కోసం అన్నమాటేగాని అదే భామకు జీవం.
7. మాన్యులూ, సామాన్యులూ ఒక్కలాగే ఉంటారు; అచ్చు ఇలాగే.
9. త్రిశూలం.
26. సరదా పండక్కి మారువేషం!
30. లక్షపయిగా నక్షత్రాలు వెలిగే వేళ.
33. సమీరకుమారుడు.
40. లేమి రెండోసారి కూడా వచ్చి పడితే ఇహానంతా కలిసే.
42. లంబాడీలు బరువైన లంగాలను...రిస్తారు.
48. అమ్మ కూతురు కాదు; నాన్న కూతురే.

అడ్డము :


2. సరాగంలో సంగీతం.
4. నారిని సారించండి; నడుము నాజూకౌను.
6. టూటూ తిరగా బోర్లావేసినా తేడాలేదు కాని; వారిలో వాం మటుక్కు తిరగబడింది.
8. వాడి మొహంలా ఉంది తేస్తురూ.
10. పిలి స్తేపలుకు
11. కొండయ్య; పార్వతితండ్రి
12. అ–డివికానిది.
13. అవును. ఇదిసరిగా లేదు తప్పే. ఎత్తించి చూసినా తప్పే.
14. ప–రిగ తిపోయిందిగాని లేపోతే ఈమాట పరుగోపరుగు.
15. ఫోకాలేకపోడవే. ఉంది.
16. కంటికి నదరుగా ఉందనుకో కట్టుకు చూసేగాని తెలీదు.
17. అంచేత మళ్ళీ అడివే.
18. ఒక్క నిమిషం ఇటు తిరిగి చూడు.
19. కృష్ణార్జునుల రణకారణం ఇదా!
20. దీనిమీదకెక్కితే వీధినపడ్డట్టే. ఎక్కినవాడు, ఎక్కించినవాడు కూడా.
21. తిప్పు తిప్పు.
22. ఆ పాపారావుగారి ముందున్న పిల్లి నిలాకెయ్యం డోసారి.
23. పొట్టిరాముడు.
24. ముందర, ఇంగ్లీషు 'కొంచెం' తెచ్చి ఈ నిగ్గుకి కలిపితే తెలుగు సినిమాలాటిది తయారవుతుంది.
25. పుట్టుపనికి పెట్టింది పేరు.
26. క్షీరోదధిని తోడేసేదుంది అందులోనే.
27. బుద్ధి లేదనుకుంటే తప్పులో కాలేస్తారు.
28. 60%
29. పార్టీల ఆకర్షణ, వికర్షణ కూడా ఇదే.
31. స్నిమితం పోడి ఒక్కమాటుగా తలకిందులయిపోబట్టేగదా ఈ బాధ.
32. పీటకి ధర పెరిగింది. పూర్వం అణాకి డజనిచ్చేవారు; ఇప్పుడరడజనే.
34. రెండు రాలు
35. తెలుగుకి ఇంగ్లీషు
36. కృప తుంతప్పుల వేపేనా?
37. మొదట అచ్చుపడితేనేగాని అక్కడని బోధపడదు.
38. కూసేముందు ఇలా అనడం లోకాని రివాజు.
39. తినగా తినగా చేదెక్కి.
40. రాయినిచూదని పిమ్మట, లాకేత్వమిచ్చి పిమ్మట దానను కొమ్మ్రవ్వనట్టి దాతలు కలరే?
41. ఇది మూలిగితే మీద తాటికాయ పడుతుంది.
42. బంగారంలాటిది. లోకంలో దీన్ని మించిన దుందరడం ధర్మం కాదంటారు.
43. అంధారాత.
44. జానను చేదకాని జానేదికాదు.
45. నరుడి తోడునీడ.
46. పిల్లికి అర్థం మార్గాలమైతే దీనికి అర్థం ఇదే; ప్రుట్టనిది.
47. డబ్బుగలవాడు మరీ లావుఅనకపోయినా ఈలా వుంటాడు.
49. లేచిందే పరుగు.
50. జాడంటే సరి; సరిపోతుంగి కూడా.
51. ము–భావం లేకపోతే ముస్తాబు పూర్తికాదు.
52. ముంకె.
53. రాజహంస పగబాలు వేరుచేసి మరీ పుచ్చుకుంటుంది.
54. ఈదారిన మిట్టమధ్యాహ్నం అయితే పరిగెడతారు.
55. తేనుంటే రాజు పండిపోతాడు.
56. ఈ పేకముక్క లోకారుని పైకి తేవాల్సి వచ్చు.

★

23-వ గళ్లనుడికట్టుకు జవాబులు

మ	మ			టా	ని	స			జా	ల
	డి	రి	పె	వ		తి	మి	ర	ము	
		స						క్షీ		
ర	గ	డ		ఉ	త్త	ర		ర	వ	తి
ట్టు		గ	డ	ప		కి	ఱ	కు		రు
				కా	క	ర				
రు		అ	చ్చ	ర		కొ	వ	త్తి		రా
జ	నా	నా		ము	వ్వ	లు		లం	గ	రు
		రః						కా		
	చె	లి	య	రో		తె	ప	క	ము	
పొ	ద			జా	బి	ల్లి			జై	క్కి

బహుమతి పొందిన కార్టూన్



చిత్రకారుడు — ఎర్గోని శ్యామసుందర్ (గుత్తి)

ఒక దర్జీ కొడుక్కి కడుపులో ఏదో సీరియస్ జబ్బువచ్చింది. ఆపరేషన్ చేయించాల్సొచ్చింది. చేయించేందుకు హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. ఆపరేషన్ చేసే డాక్టరు బయటికొచ్చి, "మీ అబ్బాయికి ఆపరేషను చేశాను. అంతా అయిపోయినట్టే!, కుట్టిన తర్వాత మీరు తీసుకెళ్ళొచ్చు" అన్నాడు.

దర్జీ—మీకంత శ్రమ అనవసరం. నేను తీసుకెళ్ళి కుట్టేసుకుంటా లేండి!

ఇంద్రగంటి పురుషోత్తం (పెనగడప)

* * *

ఒక ముష్టివాడు రైల్వేస్టేషను దగ్గర నిలుచుని టిప్‌టాప్‌గా వెళ్తున్న ఒక పెద్దమనిషిని చూసి చెయ్యి చాచాడు.

ఆయన: అర్జంటు పనిమీద వెళ్తున్నా. మళ్ళీ వచ్చి ఇస్తాను. తప్పకుండా ఇస్తాను.

పొట్టికథలు

ముష్టివాడు: అదేం కుదరదు సార్. ఇలాంటి అరువుబాపతుల మూలంగా నేను చాలా డబ్బు నష్టపోయాను.

* * *

ఒక మేష్టారు క్లాసులో ఇలా అన్నాడు. "నేను స్కూలుకు వస్తుండగా దారిలో ఒక చాకలి, గాడిదను చావమోదుతున్నాడు. ఆదృశ్యంచూచిన నామనస్సులో ఎటువంటిభావం కలిగి వుంటుందంటారు."

ఒక తెలివిగల అబ్బాయి ఇలా అన్నాడు:

సోదరప్రేమభావం సార్.

డి. వి. రమణమూర్తి (కలకత్తా)

* * *

మేస్త్రీ: ఏంరా! అందరూ రెండేసి మూటలు తీసుకుపోతుంటే నీవు ఒక్కొక్కటే తీసుకుపోతున్నావ్?

కూలి: వాళ్ళంతా సోమరిపోతులు బాబయ్యా! రెండేసిసార్లు తిరగవలసి వస్తుందని, రెండేసి మూటలు ఒకేసారి తీసుకుపోతున్నారు.

ఎమ్. వి. శివకుమార్ (చెరుకుపల్లి)

* * *

అప్పుడే ఆఫీసరుగారిచే చివాట్లుతిని ఇంటికి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

భార్య వాసంతివచ్చి "ఏమండీ! ఏం కూర వండమంటారు పొట్లకాయ నూలు పప్పా లేక వంకాయ ముద్దకూరా?"

"నా తలకాయ వండు" అన్నాడు మూర్తి కోపముగా.

"ఆవపిండి పెట్టాలా లేక నూలు పప్పు వేయమంటారా?" అంది ఆమె.

వుద్దవోలు మాలతి (గుమడ)

* * *

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd,. by S. Radha Krishna at TheAndhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad


ఇప్పుడు!
పియర్స్ టాల్కమ్
కుటుంబముకోసం
పెద్దసైజులోకూడా దొరుకుచున్నది!
BY APPOINTMENT TO
HER MAJESTY QUEEN ELIZABETH II
SOAP MANUFACTURERS
A & F. PEARS LTD
PEARS
TALCUM
LTD., FOR A. & F. PEARS LTD., ENGLAND
BY APPOINTMENT TO
HER MAJESTY QUEEN ELIZABETH II
SOAP MANUFACTURERS
A & F. PEARS LTD
PEARS
TALCUM
A. & F. PEARS LTD., ENGLAND
ప్రియర్స్ టాల్కమ్ — అంటే అన్ని చోట్లాగల సొగసైన వనితలకు శ్రేష్ఠమైన
పౌడర్ — ఇప్పుడు మీకు కుటుంబముకోసం పొదుపైన పెద్ద సైజులో కూడా లభించు చున్నది!
ఈ పట్టు వంటి మెత్తని పౌడర్ చాలా దివ్యమైన పరిమళం గలది ... మిమ్ములను
రోజల్లా హాయిగాను సొగసుగాను వుంచుతుంది!
మీ సౌందర్యమును చాలాభద్రంగా నుంచునట్టి పియర్స్ సబ్బు, అసలైన గ్లిసరీన్‌గల సౌందర్యము
నిచ్చే సబ్బును తయారుచేసిన వారిచేత ఇది మీకోసం తయారు చేయబడినది.
పియర్స్ సొగసైన వనితా సాంప్రదాయమైనది!
PTP.2-X52 TL లండన్‌లోని ఎ. అండ్ ఎఫ్. పియర్స్ లి., తరపున హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ చేత భారతదేశంలో తయారు చేయబడినది.

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.